thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 192 | కరీంనగర్ శుక్రవారం, 19 సెప్టెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## సిగరెట్లపై జీఎస్టీ 40 శాతానికి పెంపు!

న్యూఢిల్లీ : సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులపై జీఎస్టీని 40 శాతానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ ఉత్పత్తులపై జీఎస్టీ ప్రస్తుతం 28% ఉంది. దీంతోపాటు కాంపెన్సేషన్ సెస్, ఇతర చార్జీలు కలిపి 53 శాతం దాకా అవుతున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న కాంపెన్సేషన్ సెస్ గడువు 2026 మార్చి 31తో ముగుస్తుంది. అయినప్పటికీ మొత్తం పన్నుపై దీని ప్రభావం పడకుండా ఉండేందుకు జీఎస్టీని పెంచాలని భావిస్తోంది. కాగా, సిగరెట్లపై పన్ను 75%దాకా ఉండాలన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసు కన్నా తక్కువే కానుంది. ఇదిలా ఉండగా.. కాంపెన్సేషన్ సెస్ స్థానంలో హెల్త్‌సెస్‌ను ప్రవేశపెట్టే యోచనలో కూడా కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

# ఓట్ల తొలగింపు వెనుక అజ్ఞాత శక్తులున్నాయ్!

## సాఫ్ట్‌వేర్‌ను వాడి.. ఓటర్ ఐడీలను తొలగిస్తున్నారు

## ఈసీపై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు




ఓటు చోరీపై హైడ్రోజన్ బాంబ్ పేలుస్తానంటూ ఇప్పటికే ప్రకటించిన కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తాజాగా దీనిపై మీడియా ముందుకు వచ్చారు. ఈసీపై ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్నవారిని ఈసీ కాపాడుతుందన్నారు రాహుల్. ఈ క్రమంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పై ఆయన తీవ్రమైన ఆరోపణలు చేశారు. దేశవ్యాప్తంగా ప్రతిపక్ష ఓటర్లను లక్ష్యంగా చేసుకుని ఒక పద్ధతి ప్రకారం దాడులు జరుగుతున్నాయన్నారు. ఓటర్ల జాబితా నుండి లక్షలాది మంది పేర్లను ఉద్దేశపూర్వకంగా తొలగించారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ప్రతిపక్షాలకు ఎక్కువగా ఓటు వేసే దళితులు, గిరిజనులు, మైనారిటీలు మరియు %ాదీజ%లు వంటి నిర్దిష్ట వర్గాలను ప్రత్యేకంగా గుర్తించారని ఆయన అన్నారు.

**కర్ణాటకలో ఓట్ల తొలగింపు..** కర్ణాటకలోని ఆలంద్ నియోజకవర్గంలో 6,000 ఓట్లను నకిలీ లాగిన్‌ల ద్వారా తొలగించారు. ఈ ప్రక్రియలో సాఫ్ట్‌వేర్‌ను దుండగులు హైజాక్ చేశారు. నకిలీ అప్లికేషన్‌లు, తప్పుడు ఫోన్ నంబర్లు ఉపయోగించి ఓట్ల తొలగింపునకు అప్పీల్ చేశారని రాహుల్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే అవకాశం ఉన్న బూత్‌లను లక్ష్యంగా చేసుకుని ఈ ఓట్ల తొలగింపు జరిగిందని రాహుల్ గాంధీ అన్నారు. ఈ చర్యలు తమ పార్టీని బలహీనపరచడానికి జరిగాయని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాదు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అలాంటి ప్రజాస్వామ్య విధ్వంసకులను రక్షిస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు.

**100% ఆధారాలు ఉన్నాయి...** తాను చేస్తున్న ఆరోపణలకు 100% ఆధారాలు ఉన్నాయని రాహుల్ చెప్పారు. కర్ణాటకలో ఓట్లు తొలగించేందుకు ఇతర రాష్ట్రాల ఫోన్ నెంబర్లు ఉపయోగించారన్న రాహుల్.. ఆ ఫోన్ నెంబర్లు ఎవరివి .. వాటిని ఎవరు ఆపరేట్ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సూర్యకాంత్ పేరుతో 12 నిమిషాల వ్యవధిలో14 దరఖాస్తులు వెళ్లాయని రాహుల్ గాంధీ అన్నారు. ఓట్లు తొలగించేందుకు కొందరు వ్యవస్థను హైజాక్ చేస్తున్నారని, ఓట్లు తొలగింపు వివరాలు ఇవ్వాలని కర్ణాటక సిఐడి కోరిన ఈసీ స్పందించలేదని రాహుల్ తన ప్రసంగంలో వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఆధిక్యంలో ఉన్న బూత్‌లలో ఈ అవకతవకలు జరిగాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. 12 ఓట్లను తొలగించడానికి గోదాబాయి పేరుతో నకిలీ లాగిన్‌ను ఉపయోగించారని ఆరోపించారు. కర్ణాటకలోని అలంద్ నియోజకవర్గంలో 6,018 మంది ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయని రాహుల్ అన్నారు. కర్ణాటకతో పాటుగా మహారాష్ట్ర, హర్యానా, యూపీలలో కూడా ఇదే తరహా ఓట్ల చోరీ జరిగిందన్నారు రాహుల్. వారంలోపు ఓటు తొలగింపు వివరాలను అందించాలని రాహుల్ గాంధీ ఈసీని డిమాండ్ చేశారు. ఓటర్ల తొలగింపు వివరాలను అందించకుండా ఎన్నికల సంఘం ప్రజాస్వామ్య హంతకులను సమర్థిస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు,



## హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడుకోవాలి

హైదరాబాద్: నగరంలో నిధుల కొరత ఉన్నప్పటికీ.. లభ్యమవుతున్న నిధులను సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధి చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ, కేంద్ర సహాయ పథకాలు, ప్రాజెక్టుల అమలు స్థితిపై గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. "హైదరాబాద్ అంటే కేవలం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ మాత్రమే కాదు.. నిజమైన హైదరాబాద్ బస్తీల్లో ఉంది. నగరంలో చిన్నపాటి వర్షం కురిసినా రహదారులు జలమయమై ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల వర్షాల కారణంగా నాంపల్లిలో ఇద్దరు, సంతోష్‌నగర్‌లో ఒకరు నాలాలో కొట్టుకుపోవడం దురదృష్టకరం. ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పనిచేసి.. నగర ప్రాధాన్యతను గుర్తుంచుకొని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడుకోవాలి. ఏ బస్తీకి వెళ్లినా వర్షపు నీరు, వరదలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అనేక ప్రాంతాల్లో డ్రైనేజీ సిస్టం దెబ్బతిని.. తాగునీటిలో కలిసిపోతోంది. అన్నీ రిస్టోర్ చేసి శుభ్రం చేయాలి. స్కూల్స్, కమ్యూనిటీ హాళ్లు, అంగన్వాడీ కేంద్రాలు, హాస్టల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించుకోవాలి" అని కిషన్‌రెడ్డి అన్నారు.




దిల్లీ: సాఫ్ట్‌వేర్ వాడి ఓట్లను తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన విమర్శలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. అదంతా నిరాధార, అసత్య ప్రచారమని వెల్లడించింది. ఆన్‌లైన్ వేదికగా ఓట్లను తొలగించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. "సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వకుండా ఏ ఒక్కరి ఓటు తొలగించడం లేదు.. ఆన్‌లైన్‌లో మరెవరూ తొలగించలేరు. 2023లో అలంద్ అసెంబ్లీ నియోజవర్గంలో ఓటర్ల తొలగింపునకు విఫల ప్రయత్నాలు జరిగాయి. ఆ వ్యవహారంపై దర్యాప్తు కోసం ఎన్నికల సంఘమే ఫిర్యాదు చేసింది. రికార్డుల ప్రకారం.. అలంద్ అసెంబ్లీకి 2018లో జరిగిన ఎన్నికల్లో భాజపా అభ్యర్థి విజయం సాధించారు. 2023లో కాంగ్రెస్ నేత బీఆర్ పాటిల్ గెలుపొందారు" అని ఈసీ వెల్లడించింది.

**భాజపా విమర్శలు..** రాహుల్ తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని భాజపా దుయ్యబట్టింది. "రాహుల్‌కు రాజ్యాంగం, చట్టం అర్థం కావడం లేదు. 2014 నుంచి మోదీజీ సాధిస్తున్న విజయాలన్నీ నిజం కాదని ఆయన ఆరోపిస్తున్నారు. ఈ వ్యాఖ్యలు దేశ ప్రజలకు, ఓటర్లకు అవమానం. ఆయన బాంబు గురించి మాట్లాడుతున్నారు. ఈ ప్రకటనలను తీవ్రంగా ఖండిస్తున్నాను" అని మాజీ కేంద్రమంత్రి రవిశంకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. "హైడ్రోజన్ బాంబు పేలుస్తామని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు. ఆ బాంబ్ ఇలాగే ఉంటుందా..? వాళ్లు ఓటమిని చవిచూస్తున్నారు. ఈ సమయంలో వారు చేయాల్సింది దానిని అంగీకరించడం. కష్టపడి మీ స్థాయికి వస్తామనేలా వారి మాటలు ఉండాలి. అంతేకానీ దానికి బదులుగా వారు కోర్టుల జోక్యాన్ని కోరుకుంటున్నారు. లేకపోతే వేరొకరిపై నిందలు వేస్తున్నారు" అని దిల్లీ మంత్రి మజీందర్ సింగ్ సిర్సా మండిపడ్డారు.




## గొప్ప మనసు చాటుకున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే

హైదరాబాద్: తన నియోజకవర్గంలోని రైతుల కోసం ఖర్చు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబసభ్యులు విరాళం అందించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌ను లక్ష్మారెడ్డి కలిసి రూ.2కోట్ల చెక్ అందజేశారు. లక్ష మంది రైతులకు ఒక్కో యూరియా బస్తా ఉచితంగా అందించాలని సీఎంను ఆయన కోరారు. ఇటీవల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కుమారుడు సాయి ప్రసన్న వివాహం జరిగింది. మిర్యాలగూడలో భారీ ఎత్తున రిసెప్షన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే భావించారు. కానీ రిసెప్షన్‌ను రద్దు చేసుకుని ఆ డబ్బును రైతుల కోసం ఖర్చు చేసేందుకు ఆయన ముందుకు వచ్చారు. లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబసభ్యులను సీఎం అభినందించారు.

# వర్షం దెబ్బకు....

# హైదరాబాద్ అతలాకుతలం!

## నగరం మొత్తం ఒక్కసారిగా కుంభవృష్టి - జన జీవనం అస్తవ్యస్తం!!




హైదరాబాద్: నగరాన్ని మరోసారి భారీ వర్షం అతలాకుతలం చేసింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా వర్షం దంచికొట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యార్థులు, ఉద్యోగులు ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట్, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. పంజాగుట్ట, ఖైరతాబాద్, లకిడికాపూల్, నాంపల్లి, సెక్రటేరియట్ పరిసర ప్రాంతాల్లో సైతం భారీ వర్షం పడుతోంది. బషీర్బాగ్, అబిడ్స్, కోఠి, హిమాయత్ నగర్లలో మోస్తారు వర్షం కురుస్తోంది. ఎల్బీనగర్, ఉప్పల్, హయత్ నగర్ పరిసర ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షం పడుతోంది. ఐటీ కారిడార్‌తో పాటు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మరో రెండు గంటల పాటు మోస్తారు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని GHMC అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షపు నీరు ఇళ్లలోకి వచ్చేందుకు అవకాశముండటంతో జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉంటే.. నీట మునిగిన ప్రాంతాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. అమీర్‌పేట్, మాదాపూర్, బాగ్ లింగంపల్లి ప్రాంతాల్లో పర్యటించిన హైడ్రా కమిషనర్.. పైనుండి వస్తున్న భారీ వరదతో మైత్రివనం వెనుక ఉన్న గాయత్రీ నగర్‌కి వరద ముప్పు ఉన్నట్లు గుర్తించారు. మైత్రివనం వద్ద చేసినట్లుగానే గాయత్రి నగర్‌లో కూడా నాలాలో సీల్ట్ తొలగించాలని స్థానికులు హైడ్రా కమీషనర్ రంగనాథ్ కోరారు. నాళాల్లో పూడిక తీసి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్థానికులకు హైడ్రా కమిషనర్ హామీ ఇచ్చారు. దుర్గం చెరువులో నీటిమట్టం తగ్గించడంతో కొంతమేర పరిసర కాలనీలకు ముంపు సమస్య తీరనున్నట్లు హైడ్రా కమిషనర్ గుర్తించారు. క్లౌడ్ బరస్ట్ కారణంగా గంట వ్యవధిలోనే 15 సెంటీమీటర్ల పైగా వర్షం పడడంతో ఇబ్బందులు తలెత్తాయని హైడ్రా కమీషనర్ స్పష్టం చేశారు. అలాంటి పరిస్థితులను తట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బాగ్ లింగంపల్లిలో నీట మునిగిన శ్రీరామ్ నగర్ కాలనీలో పర్యటించిన హైడ్రా కమిషనర్.. కాలనీ నుంచి వరద నీటిని త్వరగా తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. రెండు రోజుల్లో శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని హైడ్రా కమీషనర్ రంగనాథ్ సూచించారు.

**అడుగేస్తే కొట్టుకుపోవడమే!.. శ్రీనగర్ కాలనీలో చెరువుల్లా రోడ్లు...** శ్రీనగర్ కాలనీ, కృష్ణానగర్, ఫిలింనగర్, యూసుఫ్ గూడా తదితర పరిసరాల్లో రహదారులు.. వర్షపు నీటితో నిండిపోయాయి. శ్రీనగర్ కాలనీలో రోడ్డుపై ప్రవాహ ఉధృతికి జనం కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో వాహనదారులు, పాదచారులు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**తెలంగాణలోని పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ...** ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఇవాళ కూడా వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, సూర్యాపేట, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపిన వాతావరణశాఖ.. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

చురకలు





# బ్రిటిష్ హైకమిషనర్‌తో సీఎం రేవంత్ భేటీ... చర్చించిన అంశాలివే

హైదరాబాద్ : భారత బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు జూబ్లీహిల్స్ నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యూకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే చెవెనింగ్ స్కాలర్ షిప్ కో-ఫండింగ్ ప్రాతిపదికన తెలంగాణ మెరిట్ విద్యార్థులకు ఇచ్చేందుకు లిండీ కామెరాన్ అంగీకరించారు. ఎడ్యుకేషన్, టెక్నాలజీ సంబంధిత రంగాల్లో సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రికి బ్రిటిష్ హైకమిషనర్ వివరించారు. యూకే యూనివర్సిటీలలో చదువుకునే తెలంగాణ విద్యార్థుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి అక్కడి యూనివర్సిటీలు ఆపరేట్ చేసేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ సందర్భంగా తెలంగాణలో తీసుకురాబోతున్న కొత్త ఎడ్యుకేషన్ పాలసీ డ్రాఫ్టను కూడా బ్రిటీష్ హైకమిషనర్‌కు సీఎం రేవంత్ వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు ట్రైనింగ్ అందించేందుకు బ్రిటిష్ హైకమిషనర్ సుముఖత వ్యక్తం చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో బ్రిటీష్ కంపెనీలు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి కోరారు. జీసీసీ, ఫార్మా, నాలెడ్జ్, అకాడమీ విభాగాల్లో పెట్టుబడులకు ముందుకు రావాలని సీఎం కోరగా.. అందుకు బ్రిటీష్ హైకమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశానికి డిప్యూటీ హైకమిషనర్ హైదరాబాద్ గారెత్ విన్ ఓవెన్ , పొలిటికల్ ఎకానమి అడ్వైజర్ నళిని రఘురామన్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి హాజరయ్యారు.




# దమ్ముంటే జూబ్లిహిల్స్‌లో గెలిచి చూపించు.. కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి సవాల్...

ఖమ్మం: నేటి పేదోడి ప్రభుత్వం సంక్షేమ పథకాలు తెస్తుంటే.. కొంతమంది విషం కక్కుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. పాముకు కోరల్లో విషం ఉంటే, కొందరి నాయకులకు ఒళ్ళంతా విషం ఉంటుందని విమర్శించారు. ఎదులాపురం మున్సిపాలిటీ వరంగల్ క్రాస్ రోడ్డులో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ చేరికల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వేదిక మీద నుంచి నాటి ప్రబుద్ధులను అడుగుతున్న.. ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుంటే మీకు కడుపు మంట ఎందుకని ఆయన ప్రశ్నించారు. పేదోడికి ఇల్లు కట్టించి ఉంటే మీకు ఈ పరిస్థితి ఉండేది కాదని హితవు పలికారు.

**బీఆర్‌ఎస్‌కు మరోసారి ప్రజలు బుద్ధి చెప్తారు..** బీఆర్ఎస్ నాయకులకు ప్రజలు రెండు పర్యాయాలు బుద్ధి చెప్పారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రజలు బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. వారి సోదరి, బిడ్డ సమస్యను సీఎం రేవంత్ రెడ్డికి అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మూడున్నర సంవత్సరాల తర్వాత జరిగే ఎన్నికల గురించి ట్విట్టర్ టిల్లు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. 'మీ పార్టీ శాసన సభ్యులు ఆరోగ్యం బాగాలేక చనిపోయారు. దానికి 15 రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వస్తుంది. మీకు ఉన్న పరిజ్ఞానం, విజన్ గురించి నేను మాట్లాడను.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలిచి చూపించు' అని కేటీఆర్‌కు సవాల్ విసిరారు.

**నువ్వెంత బచ్చా గాడివి...** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేటీఆర్ మీద బచ్చా గాడిని పెట్టి గెలిపిస్తామని మంత్రి పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. మూడున్నర సంవత్సరాల తర్వాత కేటీఆర్ ఇండియాలో ఉంటారో.. బ్యాగ్ సర్దుకుని విదేశాలకు వెళ్తారో చూడాలని ఎద్దేవా చేశారు. జూబ్లిహిల్స్ ఎన్నిక తర్వాత మీ పార్టీ స్థానం ఏంటో చూడు నాయన ట్విట్టర్ టిల్లు కేటీఆర్ అంటూ.. విమర్శించారు. మీ దయ దాక్షిణ్యాలతో ఎవరు బి ఫామ్ తీసుకోలేదని పేర్కొన్నారు. మీ నాయన మూడు సార్లు వచ్చి ముక్కు నేలకు రాసిన ఏమి చేయలేక పోయారని, నువ్వెంత బచ్చా గాడివి అని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అంటే ఆషామాషీ పార్టీ కాదన్నారు. ఇచ్చిన మాట కోసం నిలబడి, నెరవేర్చే పార్టీ అని ధీమా వ్యక్తం చేశారు. ఈ పార్టీలో ఏ ఒక్కరు తప్పు చేయరని ఉద్ఘాటించారు. తల కిందులగా తపస్సు చేసిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్ని సీట్లు వచ్చాయో.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అవే సీట్లు వస్తాయని మంత్రి పొంగులేటి ధ్వజమెత్తారు.

**కేటీఆర్ కామెంట్స్..** తంతే.. గారెలబుట్టలో పడినట్టు లక్కీలాటరీలో మంత్రి అయిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మళ్లీ పాలేరులో ఎలా గెలుస్తారో చూద్దామని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. మంగళవారం తెలంగాణభవన్‌లో భద్రాచలం నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల భేటీలో పొంగులేటిపై కామెంట్స్ చేశారు. ఏడాది క్రితం పొంగులేటి ఇంటిపై జరిగిన ఈడీ దాడుల్లో దొరికిన డబ్బు గురించి కేంద్రంగానీ, ఆయన గానీ ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. 'పొంగులేటి బీజేపీతో కుమ్మక్కయ్యారా? బీజేపీతో కుమ్మక్కైన రేవంత్‌రెడ్డితో పొంగులేటి కలిసిపోయారా..?' అని నిలదీశారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ మాటలకు ఇవాళ(గురువారం) మంత్రి పొంగులేటి బదులిచ్చారు.

# ఆ కలెక్టర్‌పై ప్రభుత్వం సీరియస్.. అసలు విషయమిదే..




రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 18 : రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝాపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్ అయింది. నిన్న(బుధవారం) ప్రజా పరిపాలన దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ప్రోటోకాల్ పాటించకపోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. జెండా ఆవిష్కరణ సమయానికి హాజరు కాకపోవడంతోపాటు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు స్వాగతం పలకడంలో కలెక్టర్ నిర్లక్ష్యం వహించారు. ఈ విషయంపై నిన్న (బుధవారం) ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీఎంవోకు ఫిర్యాదు చేశారు ఆది శ్రీనివాస్. దీంతో ఈ సంఘటనకు సంబంధించి రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని కలెక్టర్ కు నోటీసులు జారీ చేసింది ప్రభుత్వం. అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిబంధనలు పాటించకుండా వ్యవహరించిన తీరును సర్కార్ తప్పుబట్టింది. రోజురోజుకూ వివాదాస్పదంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మారుతున్నారని సర్కార్ సీరియస్ అయింది. ఓ భూ నిర్వాసితుడి విషయంలోనూ నిన్న కోర్టు ఆయనకు వారెంట్ జారీ చేసింది. ఈ క్రమంలో ఈరోజు(గురువారం) జిల్లావ్యాప్తంగా ఆది శ్రీనివాస్‌కు మద్దతుగా నిరసన తెలిపారు బీసీ సంఘాల నేతలు. ఈ మేరకు కలెక్టర్ సంజయ్ ఝాకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల్లోపు వివరణ ఇవ్వాలని సీఎస్ ఆదేశించారు. కలెక్టర్ ఇచ్చే వివరణను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.




చిట్యాల: కొందరు గిట్టని వ్యక్తులు తన ప్రతిష్ఠ దెబ్బతీసేందుకు, సామాజిక మాధ్యమాల ద్వారా అవాస్తవాలు వ్యాపింపజేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వదంతులను నమ్మొద్దని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. గుంటూరులో ఓ కార్యక్రమానికి వెళ్తూ.. చిట్యాల మండలం పెద్దకాపర్తిలో కార్యకర్తలతో కలిసి ఆయన భోజనం చేశారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాజీనామా చేస్తున్నానని, పార్టీ మారుతున్నానని, పార్టీ పెడుతున్నానని ఇలా రకరకాల వార్తలు సృష్టిస్తున్నారు. " కాంగ్రెస్ పార్టీ శ్రేయస్సు దృష్ట్యా, పార్టీని బలోపేతం చేసేందుకు కొన్ని సందర్భాల్లో నా అభిప్రాయాన్ని బహిరంగంగా చెప్పాను. అలా చెప్తే తప్పేంటి?ఇవాళ కూడా ఓ ప్రైవేటు కార్యక్రమానికి గుంటూరు వెళ్తుంటే.. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలవడానికి వెళ్తున్నానని వదంతులు సృష్టిస్తున్నారు.

నా రాజకీయ భవిష్యత్ గురించి మీడియా సమావేశం పెట్టి చెబుతా, అప్పటి వరకు ఈ దుష్ప్రచారాలు నమ్మొద్దని తెలంగాణ సమాజాన్ని కోరుతున్నా" అని రాజగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.




హైదరాబాద్‌లో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఖైరతాబాద్‌లోని ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్‌లో కాలనీలు నీట మునిగాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. జీహెచ్ఎంసీ సిబ్బంది మోటార్ల సాయంతో నీటిని తొలగిస్తున్నారు. బేగంపేట్‌లోని మోతీలాల్ నెహ్రూ పార్క్ కాలనీ పూర్తిగా నీట మునిగింది. రసూల్‌పురలో ఇళ్లలోకి వరద చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బేగంపేటలో అపార్ట్‌మెంట్లలోని సెల్లార్లలోకి భారీగా వరద నీరు చేరింది. ముషీరాబాద్ నియోజకవర్గం బాగ్‌లింగంపల్లి శ్రీరాంనగర్ బస్తీలోకి నడుములోతు వరకు మురుగునీరు చేరింది.

# రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌పై కేటీఆర్ ఏమన్నారంటే...



వికారాబాద్ జిల్లా, సెప్టెంబరు18 : రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు స్పందించారు. రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు మారుస్తోందని ప్రశ్నల వర్షం కురిపించారు. అలైన్‌మెంట్‌ను మార్చి రోడ్డు నిర్మాణం చేపడితే మరో లగచర్ల ఘటన రిపీట్ అవుతుందని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను హెచ్చరించారు కేటీఆర్. గతంలో ఆమోదించిన రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం అలైన్‌మెంట్‌ని మార్చి సర్వే నెంబర్లను ప్రకటించింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. అయితే, గతంలో నిర్మించ తలపెట్టిన మార్గంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు ఉండటంతో అలైన్‌మెంట్‌ను మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వం. అలైన్‌మెంట్ మార్పుతో రైతులు భారీగా భూములు కోల్పోతున్నారు. ఈ విషయంపై వారం రోజులుగా వివిధ పద్ధతుల్లో నిరసన వ్యక్తం చేశారు అన్నదాతలు. అధికారులు తమను పట్టించుకోవడం లేదని కేటీఆర్‌ను కలిశారు మోమీన్‌పేట మండల గ్రామాల రైతులు. అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో ఫోన్‌లో మాట్లాడారు కేటీఆర్. పేద రైతుల భూములను గుంజుకొని వారికి అన్యాయం చేస్తే మరో లగచర్ల ఘటన చోటు చేసుకుంటుందని కలెక్టర్‌ను హెచ్చరించారు కేటీఆర్. అయితే, కలెక్టర్‌ను హెచ్చరించిన వీడియో వికారాబాద్ జిల్లా వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేస్తోంది.

# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకే భారత రాష్ట్ర సమితి విమర్శలు: మంత్రి సీతక్క



వైరా: ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సీతక్క అన్నారు. ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. "రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు భారత రాష్ట్ర సమితి పార్టీ విమర్శలు చేస్తోంది. యూరియాను సరఫరా చేయాల్సింది కేంద్ర ప్రభుత్వం. రైతులను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆ పార్టీ విమర్శలు చేస్తోంది. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులమయం చేసింది. భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయిస్తాం.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలి. స్థానిక ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది" అని సీతక్క అన్నారు.

# బతుకమ్మ, దసరాకు టీజీఎస్ఆర్టీసీ 7754 ప్రత్యేక బస్సులు

హైదరాబాద్: బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీజీఎస్ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ఈ నెల 20 నుంచి అక్టోబరు 2 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 7754 ప్రత్యేక సర్వీసులను నడపాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అందులో 377 స్పెషల్ సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. పండక్కి సొంతూళ్లు వెళ్లినవారు తిరుగుపయనమయ్యేందుకు వీలుగా అక్టోబర్ 5, 6 తేదీల్లోనూ రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపేందుకు సిద్ధమవుతోంది. హైదరాబాద్‌లో ప్రధానంగా ఎంజీబీఎస్, జేబీఎస్‌తో పాటు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే కేపీహెచ్‌బీ, ఉప్పల్ క్రాస్‌రోడ్, ఉప్పల్ బస్టాండ్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్ తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడపనుంది. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రం నలుమూలలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రకు కూడా ప్రత్యేక సర్వీసులు నడపనుంది. పండగ స్పెషల్ బస్సుల్లో ప్రత్యేక ఛార్జీలు వసూలు చేయనున్నారు.






# నేపాల్‌లో శాంతి స్థాపనకు అండగా ఉంటాం: సుశీలా కార్కికి మోదీ హామీ

సోషల్ మీడియాపై నిషేధం, అవినీతి వ్యతిరేక నిరసనలతో కొన్ని రోజుల క్రితం అట్టుడికిన నేపాల్‌లో పరిస్థితులు కుదుటపడ్డాయి. ఈ క్రమంలో ఆ దేశంలో శాంతి స్థాపనకు భారత్ అండగా ఉంటుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. తాత్కాలిక ప్రభుత్వ ప్రధానిగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశీలా కార్కీతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణకు సంబంధించిన విషయాలను మోదీ ఎక్స్‌లో పంచుకున్నారు. సుశీలా కార్కీతో అద్భుతమైన సంభాషణ జరిగిందని పేర్కొన్నారు. నిరసనల్లో ప్రాణాలు కోల్పోయినవారికి సంతాపం వ్యక్తం చేసినట్లు తెలిపారు. శాంతి, స్థిరత్వం పునరుద్ధరణకు ఆమె చేసే ప్రయత్నాలకు భారత మద్దతును పునరుద్ఘాటించినట్లు మోదీ వెల్లడించారు. సామాజిక మాధ్యమాల నిషేధంతో మొదలై.. అవినీతికి వ్యతిరేక ఉద్యమంగా మారిన నేపాల్ ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. దీంతో ప్రధాని కేపీ శర్మ సహా పలువురు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే సుశీలా కార్కీని తాత్కాలిక ప్రధానిగా జెన్-జీ ఎంపిక చేసింది. గత శుక్రవారం ఆమె ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు. కార్కీ సిఫార్సు మేరకు దేశ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ పార్లమెంటును రద్దు చేశారు. 2026 మార్చి 5న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు.

# విలువల కోసం జీవితాంతం పాటుపడిన కాటం


## - సెప్టెంబర్ 19...కాటం లక్ష్మీ నారాయణ జయంతి



ఆయన నిజాం వ్యతిరేక పోరాటయోధులలో ప్రముఖుడు. స్వార్థం అనే పదాన్ని దగ్గరకు రానీయకుండా, రాజకీయ పదవులకు ఏనాడూ పాకులాడ కుండా, కేవలం ప్రజలకు, విలువల కొరకు ఎంతటి వారినైనా, ఎదిరించి ధైర్యంగా నిర్మొహ మాటంగా నిలబడటం ఆయనకే చెల్లింది. సంస్థానాలలో స్వాతంత్ర్య యోధులను కేంద్ర ప్రభుత్వం గుర్తించక పోవడాన్ని అవమానంగా భావించి, పోరాడి సంస్థానాల లోని స్వాతంత్ర్య యోధులకు కూడా పెన్షన్ సౌకర్యం లభింప చేసిన ఘనత ఆయనదే. హైదరాబాదు స్వాతంత్ర్య సమర చరిత్రను ప్రామాణిక పద్ధతుల్లో గ్రంథస్థం చేయించిన కృషీవలుడు ఆయన. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు చెల్లవని కోర్టు తీర్పు ఇవ్వగా దాంతో బలహీన వర్గాల నాయకు లందరిని ఒక తాటిపైకి తెచ్చి, ఒక కార్యవర్గాన్ని ఏర్పరిచి దానికి కన్వీనరు అయి సుప్రీం కోర్టుకు వెళ్లి హైకోర్టు తీర్పును రద్దు చేయించిన గొప్పతనం ఆయనదే. ఆంధ్ర ప్రదేశ్ లో తెలుగు అకాడమి లాగ హింది అకాడమి ఉండాలని ఉద్యమించి ప్రభుత్వాన్ని ఒప్పించి స్థాపించి దానికి తానే ఉపాధ్యక్షులయ్యారు. ఆయనే పోరాట పటిమకు, కార్యదీక్ష తకు నిలువుటద్దం గా నిలిచిన యోధుడు కాటం లక్ష్మీ నారాయణ. కాటం లక్ష్మీనారాయణ (సెప్టెంబరు 19, 1924 – ఫిబ్రవరి 25, 2010) రంగారెడ్డి జిల్లా శంషాబాదులో, లక్ష్మయ్య, సత్తెమ్మ దంపతులకు 1924 వ సంవత్సరంలో సెప్టెంబరు 19 న జన్మించారు. అయన తాత కాటం నారాయణ స్థానిక జమీందారుల అకృత్యాలను ఎదిరించిన ధైర్యవంతులు. తాత పేరుతో పాటు ధైర్య సాహసాలు కూడా పుణికి తెచ్చు కున్నారు. 1942 అక్టోబరు 12 న బూర్గుల రామకృష్ణారావు చాదర్ ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండులో సత్యాగ్రహం చేయడానికి సన్నాహాలు చేసిన సందర్భంలో నైజాము పోలీసులు బూర్గుల రామకృష్ణారావును, లక్ష్మీ నారాయణను అరెస్ట్ చేశారు. అప్పటికి నారాయణ వయస్సు పంతొమ్మిది. అప్పటి నుండి లక్ష్మినారాయణ బూర్గుల రామకృష్ణారావుని గురువుగా బావించారు. పోలీసులు లక్ష్మినారాయణను ఏడు నెలల పాటు చెంచల్ గూడ జైల్లో వుంచారు. తర్వాత లక్ష్మీ నారాయణ న్యాయవిద్య పూర్తి చేసి బూర్గుల వారి వద్దనే జూనియర్ లాయర్ గా చేరారు. బూర్గులతో పాటు అన్ని కార్య కలాపలాలలో క్రియా శీలక పాత్ర పోషించారు. ఆనాటి సామాజికి సమస్యలలో కూడా పాలు పంచుకున్నారు. నిజాం ప్రభుత్వ ఆజ్ఞలను దిక్కరించి హింది పాఠశాలను స్థాపించారు. ఖాది వ్యాప్తి, దళిత జనోద్దరణ వంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. ఆచార్య రంగా ప్రేరణతో 1945లో లక్ష్మీనారాయణ హైదరాబాదు యువ జన కాంగ్రెసు స్థాపించి తాను ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. లక్ష్మీ నారాయణ ఏదో ఒక ఉద్యమంలో పాల్గొనడం, అరెస్ట్ కావడం, తిరిగి రావడం, మళ్లీ జైలుకెళ్లడం నిత్య కృత్యంగా మారింది. నిజాం పాలన అంతమై, నూతన రాష్ట్రం ఏర్పాటు అయ్యాక, ఆర్థిక, సాంకేతిక, వైజ్ఞానిక రంగాలలో రాష్ట్ర పునర్ నిర్మాణానికి 1949 డిసెంబరులో "జనత" పేరుతో ఒక పత్రికను ప్రారంభించారు. గతంలో రజాకార్ల చేతిలో హతుడైన షోయెబుల్లా ఖాన్తో కలిసి పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం ఇప్పుడు దీనికి బాగా ఉపక రించింది. అంతే గాక రైతుల సమస్యల పరిష్కారానికి 1952లో రాష్ట్ర కర్షక సంఘాన్ని స్థాపించారు."తెలుగు భూమి" అనే మరొక పత్రికను 1969లో ప్రారంభించారు. ఆంధ్ర ప్రదేశ్ లో తెలుగు అకాడమి లాగ హింది అకాడమి ఉండాలని ఉద్యమించి ప్రభుత్వాన్ని ఒప్పించి స్థాపించి దానికి తానే ఉపాధ్యక్షులయ్యారు. 1968లో హైకోర్టు వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు చెల్లవని తీర్పు ఇవ్వగా దాంతో బలహీన వర్గాల నాయకులందరిని ఒక తాటిపైకి తెచ్చి ఒక కార్యవర్గాన్ని ఏర్పరిచి దానికి కన్వీనరు అయి సుప్రీం కోర్టుకు వెళ్లి హైకోర్టు తీర్పును రద్దు చేయించారు. ఆ సందర్భంలో ఒక మహా సభ ఏర్పాటు చేయించారు. దానికి లక్షలాది మంది రాగా నాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధి కూడా రావడం విశేషం.లక్ష్మీ నారాయణ సాధించిన ఘన విజయాలలో ఇది ఒకటి. నిజాం వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న యోధులకు పెన్షన్ ఒక వరం లాంటిది అని నమ్మేవారు లక్ష్మీ నారాయణ. స్వతంత్ర భారత్ లో ఈ అవకాశాన్ని అందరు వినియోగించు కుంటున్నా... నిజాం పాలిత ప్రాంతాల యోధులకు ఆ అవకాశం రాలేదు. దీనిపై లక్ష్మీ నారాయణ కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపారు. కేంద్రం అంగీకరించక పోవడంతో లక్ష్మీ నారాయణ " తెలంగాణ సమర యోధుని సత్యాగ్రహం" అని రాసిన ఒక అట్టను మెడలో వేసుకుని ప్రధాని ఇంటి ముందు నిరాహార దీక్ష చేశారు. ఢిల్లీ పత్రికలు ప్రముఖంగా ఈ అంశాన్ని ప్రచురించాయి. దాంతో ఇందిరా గాంధీ లక్ష్మీ నారాయణను పిలిపించి కారణం అడగగా...... " సంస్థానాలలో స్వాతంత్ర్య యోధులను మీరు గుర్తించక పోవడాన్ని మేము అవమానంగా భావిస్తున్నాము. బ్రిటిష్ ఆంధ్ర స్వాతంత్ర్య యోధులు ఒక బ్రిటిష్ వారితోనే పోరాడారు. కాని సంస్థాన లోని యోధులు అటు సంస్థానాధీశుల తోను, ఇటు బ్రిటిష్ వారితోను పోరాడారు. 15 ఆగస్టు మాకు స్వాతంత్ర్య దినం కాదా? హైదరాబాదు విముక్తి జరిగిన సెప్టెంబరు 17 ను స్వాతంత్ర్య దినంగా జరుపుకో మంటారా? ఒక్క హైదరాబాదు సంస్థాన ప్రజలే కాదు పలు సంస్థానాల ప్రజలు భారతీయులు కారా? అవునా? కాదా? ముందు ఇది తేల్చండి? " అని సూటిగా, ధైర్యంగా ఇందిరా గాంధిని ప్రశ్నించిన యోధుడు లక్ష్మీ నారాయణ. దాంతో సంస్థానాల లోని స్వాతంత్ర్య యోధులకు కూడా పెన్షన్ సౌకర్యం లభించింది. ఈ యోధుడు సాధించిన అతి పెద్ద ఘన కార్యం. నేటికీ ప్రామాణిక గ్రంథంగా ఉన్న 844 పేజీల హైదరాబాదు స్వాతంత్ర్య సమర చరిత్రను ప్రామాణిక పద్ధతుల్లో గ్రంథస్థం చేయించారు... దాన్ని అప్పటి భారత రాష్ట్ర పతి జైల్ సింగ్ చేత ఆవిష్కరింప జేశారు. పి.వి.నరసింహ రావు, టి. అంజయ్య, కాసు బ్రహ్మానంద రెడ్డి, భవనం వెంకట్రామ రెడ్డి, నలుగురు ముఖ్య మంత్రులతో ఒక పెద్ద సభను నిర్వహించారు. ఆయన నిర్వహించిన సభలకు ప్రధాన మంత్రులు, రాష్ట్రపతులు, పీఠాధిపతులు, స్వాతంత్ర సమర యోధులు, దళిలాలు వంటి వారు కూడా పాల్గొనే వారు. ఆ మ హా యోధుడు 2010 వ సంవత్సరం ఫిబ్రవరి 25 నాటి ఈ లో కాన్ని వదిలి వెళ్లారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# స్థానిక సమస్యల పరిష్కారం... పంచాయితీ రాజ్ లక్ష్యం

## సెప్టెంబర్ 19...పంచాయితీ రాజ్ పిత బల్వంతరాయ్ మెహతా వర్ధంతి సందర్భంగా




భారత దేశంలోని అతి ప్రాచీన వ్యవస్థ పంచాయతీరాజ్ వ్యవస్థ. గ్రామస్థాయిలో అమల్లో ఉండే అతి ప్రాచీన పాలనా వ్యవస్థే పంచాయ తీ. ఇదే స్థానిక స్వపరిపాలనా సంస్థలవ్యవస్థ. ప్రాచీన కాలంలో పనిచేస్తున్న గ్రామ పాలనా వ్యవస్థ నాటి సాంఘిక పరిస్థితుల కనుగు ణంగా గ్రామ వృత్తి పనివారల ప్రతినిధులతో పనిచేయగా, బ్రిటిష్ పాలన కాలంలో గవర్నర్ జనరల్ రిప్పన్ ప్రోత్సాహంతో స్థానిక స్వ పరిపాలనా సంస్థలు రూపు దిద్దుకున్నాయి. 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాలు కొంత వీటికి బలం చేకూర్చాయి. భారత దేశంలో మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రారంభించిన తొలి రాష్ట్రం రాజస్థాన్ కాగా, 1959 నవంబరు 1న, ఆంధ్ర ప్రదేశ్ లో దేశంలోనే రెండవదిగా, మహబూబ్ నగర్ జిల్లా, షాద్నగర్లో ప్రారంభమైంది. గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీ, బ్లాకు స్థాయిలో పంచాయతి సమితి, జిల్లా స్థాయి లో జిల్లా పరిషత్ ఏర్పడింది. 1986లో బ్లాకు స్థాయి వ్యవస్థని మండల పరిషత్ గా మార్చారు. కేంద్ర ప్రభుత్వ చొరవతో ప్రయోగా త్మక ప్రాతిపదికగా, సమాజ వికాసా భివృద్ధి కార్యక్రమం (కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్) 1952లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ద్వారా దేశంలో బాగా వెనుక బడిన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, రవాణా సౌకర్యా లు, కుటీర పరిశ్రమలు అనే ఐదు రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. 1953లో ఈ పథకాన్నే జాతీయ విస్తరణ సేవా పథకం (నేషనల్ ఎక్స్టెన్షన్ సర్వీస్ స్కీమ్) గా దేశ మంతటా అమలు చేశారు. ఈ కార్యక్రమాల ప్రభావాన్ని అంచనా వేయడానికి బల్వంతరాయ్ మెహతా అధ్యక్షతన నిపుణుల కమిటీ ని 1956లో నియమించా రు. ఈ కమిటీ తన నివేదికను 1957లో సమర్పించింది. ఈ కమిటీ సిఫారసులే పంచాయతీరాజ్ వ్యవస్థ (ప్రజాస్వామ్య వికేంద్రీకరణ) ఏర్పాటుకు మూలాధారం అయినాయి. బల్వంతరాయ్ మెహతా (1900 ఫిబ్రవరి 19 – 1965 సెప్టెంబరు 19) స్వాతంత్ర్య సమర యోధుడు, సామాజిక కార్యకర్త, పంచాయితీ రాజ్ నూతన వ్యవస్థ మార్గదర్శకుడు. ఆయన బర్డోలి సత్యాగ్రహ భాగస్వామి. గుజరాత్ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా పనిచేశాడు. స్వయం పాలన కోసం ప్రజల పోరాటం ఆయన జీవితా శయం. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ సంబంధంగా... "బల్వంతరాయ్ మెహతా కమిటీ" సిఫార్సులు దేశంలో అమలు పరచబడి, ప్రాచుర్యం పొందిన పంచాయితీ రాజ్ అనే విప్లవాత్మక కార్యక్రమంతో మెహతా గుర్తింపు పొందాడు. స్వాతంత్ర్యం తరువాత మెహతా భారతదేశ లోక్సభకు పార్లమెంటు సభ్యునిగా రెండుసార్లు ఎన్నికయ్యా డు. పార్లమెంట్ అంచనా కమిటీ అధ్యక్షుడుగా ఉన్నాడు. ప్రణాళిక (ప్రాజెక్ట్స్) కమిటీ అధ్యక్షుడుగా రాష్ట్రాలలో మూడు అంచెల వ్యవస్థ స్థాపన కోసం మెరుగైన విధానానికి అద్భుతమైన నివేదికను సిద్ధం చేశాడు. తద్వారా భారత దేశపు పంచాయితీ రాజ్ ఫాదర్గా ప్రశంసించ బడ్డాడు. 1952, అక్టోబరు 2న ప్రవేశ పెట్టిన సమాజ అభివృద్ధి కారక్రమం ప్రాతి పదికగా, జాతీయాభివృద్ధి మండలి 1957, జనవరి, 16న బల్వంత్ రాయ్ గోపాల్ మెహతా అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 1953, అక్టోబరు 2న ప్రవేశ పెట్టిన జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం పథకాలు ఎంతవరకు విజయవంతం అయినాయో సమీ క్షించి, గ్రామ పరిపాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడానికి అవసరమయ్యే సంస్థాగత ఏర్పాటును సిఫార్సు చేసింది. బల్వంతరాయ్ మెహతా కమిటీ ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ప్రజల భాగస్వామ్యం అనే అంశాలతో 3 – అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ను సిఫారసు చేస్తూ, తన నివేదిక ను 1957, నవంబరు 24న జాతీ యాభివృద్ధి మండలికి సమర్పించిం ది. కమిటీ నివేదికను జాతీయా భివృద్ధి మండలి 1958, జనవరిలో ఆమోదించింది. ఈ నివేదికలోని అంశాల అమలు వివిధ రాష్ట్రాలు పంచాయతీరాజ్ సంస్థఏర్పాటుకు ప్రయత్నించాయి. భారత దేశంలో 1959 అక్టోబరు 2న రాజస్థాన్లోని నాగూర్ జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థను లాంచ నంగా ప్రారంభించారు. రాజస్థాన్ రాష్ట్రంలో, నాగోర్ జిల్లాలోని, సికార్ అనే ప్రాంతంలో ఈ విధానా న్ని ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ప్రారంభిస్తూ చేసిన వ్యాఖ్యానం..."నేడు ప్రారంభమ వుతున్న స్థానిక స్వపరిపాలనా సంస్థలు భారత ప్రజాస్వామ్యానికి ప్రాతిపదికగా పనిచేస్తూ జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తూ, భవిష్యత్ నాయకత్వానికి పాఠశాలలుగా తోడ్పడతాయి". మూడు అంచెల విధానాన్ని ప్రారంభించిన రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 1959, నవంబరు 1న ఆంధ్రప్రదేశ్లోని రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ వద్ద నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నెహ్రూ ప్రారంభించారు. బల్వంతరాయ్ మెహతా కమిటీ చేసిన ముఖ్యమైన సిఫార్సులు... దేశంలో 3 అంచెల పంచాయతీ రాజ్ విధానం ఏర్పాటు చేయాలి. 1) జిల్లా స్థాయిలో – జిల్లా పరిషత్, 2) బ్లాకు స్థాయిలో – పంచాయతీ సమితి, 3) గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీప్రజల భాగస్వామ్యం కల్పించడానికి పంచాయతీరాజ్ వ్యవస్థను నెలకొల్పాలి. గ్రామ పంచాయతీ వ్యవస్థకు ప్రత్యక్ష ఎన్నిక లను నిర్వహించాలి. ఈ ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన కాకుండా, స్వతంత్ర ప్రాతిపదికపై జరపాలి. స్థానిక సంస్థలకు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి నియమ బద్ధంగా ఎన్నికలు జరపాలి. స్థానిక సంస్థలకు తగిన అధికారాలను, ఆర్థిక వనరులను సమకూర్చాలి. భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పథకాలన్నీ స్థానికసంస్థల ద్వారానే నిర్వహించాలి. స్థానిక స్వపరిపాలనలో జిల్లా కలెక్టరు కీలకపాత్ర పోషించాలి. కింది స్థాయి లో మినహాయించి, మాధ్యమిక, ఉన్నత స్థాయిల్లో పరోక్ష ఎన్నికలు నిర్వహించాలి. అధికారాల, పరి పాలనా, వనరుల, ప్రణాళికా, ప్రజాస్వామ్య వికేంద్రీకరణలు జరగాలి. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్లు మంజూరు చేయాలని బల్వంత్రాయ్ మెహతా కమిటీ సూచించింది. స్థానిక సమస్యలను స్థానికంగా పరిష్కరించడం, ప్రజలను రాజకీయంగా చైతన్యం చేయడం పంచాయతీ రాజ్ వ్యవస్థ యొక్క ప్రధాన లక్ష్యం. ఆ లక్ష్య సాధన కోసం స్వాతంత్ర్యానంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తనవంతు కృషి చేస్తూనే ఉన్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ట్రెండింగ్ మోజులో ఊబిలో చిక్కుకుంటున్న యువత.. ఈ జంట ఏం చేసిందో తెలుసా?



ఈ మధ్యకాలంలో ట్రెండింగ్ పేరిట యువత ఏ ఏ పనులు చేస్తున్నారో కూడా చెప్పడం కష్టంగా మారిపోయింది. ముఖ్యంగా పర్సనల్ విషయాలను కూడా ట్రెండింగ్ పేరుతో పబ్లిక్ లో పెట్టే అంత పిచ్చిలో బ్రతుకుతున్నారనే మాటలు ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులను బట్టి వెలువడుతున్నాయని చెప్పవచ్చు. పైగా పబ్లిక్ లో పాపులారిటీని సొంతం చేసుకోవడానికి, సోషల్ మీడియాలో ఫేమస్ అవ్వాలని, ఫాలోవర్స్ ను పెంచుకోవాలని రీల్స్ పిచ్చితో చేస్తున్న చేష్టలు ఇప్పుడు వార్తలుగా మారుతున్నా.. యువత ఆగడాలు మాత్రం తగ్గడం లేదనే చెప్పాలి.. పైగా ట్రెండింగ్ మోజులో పడి ఏకంగా ప్రాణాలను కూడా పణంగా పెడుతున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఒక జంట రీల్ పిచ్చిలో పడి ఏకంగా ప్రాణాలనే పణంగా పెట్టేసింది.. అసలు ఏం జరిగింది? ఎక్కడ జరిగింది? అనే విషయం ఇప్పుడు చూద్దాం.. అసలు విషయంలోకి వెళ్తే.. తాజాగా ఒక జంట చేసిన రీల్ అందరిలో ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. అసలు విషయంలోకి వెళ్తే.. కొంతమంది అబ్బాయిలు వంతెనపై నిలబడి ఉండగా.. వారందరూ కలిసి ఏదో స్టంట్ కోసం సిద్ధమైనట్లు తెలుస్తోంది. అప్పుడే కెమెరా వంతెన నుండి తలకిందులుగా వేలాడుతున్న వ్యక్తిని చూపిస్తుంది. ఒక తాడు అతడు పాదాలకు గట్టిగా కట్టవేయబడింది. ఇక రివర్స్ లో ఆ వ్యక్తిని కిందికి వదిలారు..క్రింద నదిలో బలమైన ప్రవాహంలో ఒక అమ్మాయి ఉంది. ఆమె మునిగిపోతున్నట్లు నటిస్తుంటే.. అతను కాపాడుతున్నట్లు ఆ వీడియోలో చూపించారు. ఇదంతా ఒక రీల్ షూటింగ్ అని స్పష్టంగా తెలుస్తోంది కూడా.. నీటిలో మునిగిపోతున్న అమ్మాయిని రక్షించడానికి బాలుడు సాహసం చేస్తున్నాడు అనే కాన్సెప్ట్ తో ఈ పిచ్చి రీల్స్ చేశారు. ఒకవేళ పొరపాటున ఆ తాడు తెగినా.. నీటి ప్రవాహం పెరిగినా ఇద్దరి ప్రాణాలు నీటిలో కలిసినట్లే .దీంతో ఈ వీడియోను చూసిన నెటిజన్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు. రీల్స్ మోజులో పడి పాపులారిటీని పెంపొందించుకోవడానికి.. ఫాలోవర్స్ ను సంపాదించుకోవడానికి ఇలాంటి పిచ్చి ప్రయత్నాలు ఎంత కాలం చేస్తారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉండడం గమనార్హం. ఏది ఏమైనా ట్రెండింగ్ మోజులో పడి యువత ఈ ఊబిలో చిక్కుకుపోతూ ప్రాణాలను కూడా కోల్పోతున్నారనటంలో సందేహం లేదు. ముఖ్యంగా ఈ మధ్యకాలంలో యువత రీల్స్ మోజులో పడి రైళ్ల కింద పడుకోవడం.. వేగంగా వెళుతున్న రైళ్ల పక్కన నడవడం.. నదిలోకి దూకడం.. వెళ్తున్న కారు నుండీ డోరు తీసి సడన్గా పక్కకు దూకి దాని పక్కనే డాన్స్ చేస్తూ ముందుకు వెళ్లడం.. ఇలా చెప్పుకుంటూ పోతే లెక్కలేనన్ని పిచ్చి పనులు చేస్తూ ప్రాణాలు మీదికి తెచ్చుకుంటున్నారు. మరి ఇలాంటి ఆగడాలను అరికట్టాలి అంటే అధికారులు రంగంలోకి దిగాలని సామాన్య ప్రజలు కూడా కోరుకుంటున్నారు. మరి ఎప్పటికీ తమను తాము మార్చుకొని వాస్తవం లోకి వస్తారో చూడాలి అంటూ కామెంట్లు చేస్తూ ఉండడం గమనార్హం.

# ఐస్ క్రీమ్ మీద కిమ్ కు కోపం వస్తే ఎట్టా ఉంటాదో తెలుసా?

ఉత్తర కొరియా నియంత కిమ్ జాంగ్ ఉన్ పాలనలో ప్రతి చిన్న అంశం కూడా ఒక రాజకీయ ఆయుధమే. ఇటీవల తీసుకున్న "ఐస్క్రీమ్" పేరు మార్పు నిర్ణయం కూడా కేవలం ఒక హాస్యాస్పద చర్య కాదు, అది ఆయన పాలనలో భాషను, సంస్కృతిని ఎలా నియంత్రిస్తారో తెలిపే ఒక ఉదాహరణ. ఇది కేవలం ఒక పదాన్ని మార్చడం మాత్రమే కాదు, దేశంపై పాశ్చాత్య ప్రభావం పడకుండా ప్రజలను పూర్తిగా వేరుచేయాలనే కిమ్ తీవ్రమైన వ్యూహాన్ని ఈ చర్య సూచిస్తుంది. **భాషను ఆయుధంగా మార్చిన వైనం....** ఉత్తర కొరియాలో భాష కేవలం మాట్లాడే సాధనం కాదు.. అది ఒక రాజకీయ సాధనం. "ఐస్క్రీమ్" లేదా "హాంబర్గర్" వంటి ఆంగ్ల పదాలను నిషేధించి, వాటికి స్థానిక పదాలను ఉపయోగించడం ద్వారా కిమ్ తన పాలనలో ప్రత్యేకమైన, స్వచ్ఛమైన ఉత్తర కొరియా సంస్కృతిని కాపాడేవాడిగా ప్రజలకు తనను తాను చూపించుకుంటున్నారు. ఈ చర్య ద్వారా దక్షిణ కొరియా, పాశ్చాత్య దేశాల నుండి వచ్చే సాంస్కృతిక ప్రభావం తమపై పడకుండా ప్రజలను రక్షించామని ఆయన భావిస్తారు. అయితే దీని అసలు ఉద్దేశం ప్రజలపై తమ నియంత్రణను మరింత బలపరచడమే. **పర్యాటకం ఒకవైపు... నియంత్రణ మరోవైపు...** కిమ్ తీసుకున్న



ఈ నిర్ణయం ఒక విచిత్రమైన పరిస్థితిని సూచిస్తుంది. ఒకవైపు వాన్సన్ రిసార్ట్ వంటి ప్రాజెక్టులతో విదేశీ పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తున్నా, మరోవైపు ఆ పర్యాటకుల భాష, సంస్కృతి తమ దేశ ప్రజలపై ప్రభావం చూపకుండా కఠినమైన ఆంక్షలు విధిస్తున్నారు. ఇది వ్యాపార అభివృద్ధి కంటే కూడా తమ ఇమేజ్, నియంత్రణకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని స్పష్టం చేస్తుంది. విదేశీ పర్యాటక గైడ్లకు ఇచ్చే శిక్షణలో "ఆంగ్ల పదాలు వాడకూడదు" అని ఆంక్షలు పెట్టడం అసాధ్యమైన విషయం. ఇది ఒక వైపు పర్యాటకాన్ని ఆకర్షిస్తూనే, మరోవైపు దాని ప్రభావం ప్రజలపై పడకుండా నియంత్రించాలనే కిమ్ విరుద్ధమైన వైఖరికి నిదర్శనం.
**ప్రజలపై మానసిక ఒత్తిడి...** కిమ్ విధించిన ఈ ఆంక్షలు ప్రజలపై మానసిక ఒత్తిడిని పెంచుతాయి. బాహ్య ప్రపంచం గురించి తెలుసుకునే అవకాశం ప్రజలకు దక్కకుండా పూర్తిగా వారిపై నియంత్రణ సాధించాలనే ప్రయత్నం ఇది. "కిమ్ చెప్పిందే సరైనది" అనే ఆలోచన విధానాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నారు. దీనివల్ల ఉత్తర కొరియా ప్రజలు ప్రపంచానికి మరింత దూరమవుతారు. బయట ప్రపంచం ఎలా ఉందో దానిలో ఎలాంటి మార్పులు వస్తున్నాయో వారికి తెలుసుకునే అవకాశం తగ్గుతుంది. చివరగా కిమ్ జాంగ్ ఉన్ "ఐస్క్రీమ్" పేరు మార్చడం కేవలం ఒక చిన్న సంఘటనగా భావించకూడదు. ఇది ఆయన పాలనలోని తీవ్రమైన జాతీయవాదాన్ని, సంస్కృతిపై, భాషపై ఉన్న కఠినమైన నియంత్రణను సూచిస్తుంది. ఈ చర్యల ద్వారా ప్రజలను ప్రపంచం నుండి మరింత దూరం చేసి, తన పాలనను నిరంతరాయంగా కొనసాగించాలనే కిమ్ లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. అయితే ఇది ఉత్తర కొరియా ప్రజల భవిష్యత్తును మరింత కట్టడి చేసే చర్యగానే మిగిలిపోతుంది.

# కేంద్ర మంత్రి పేరుతో మోసం

## సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

డిజిటల్ ప్రపంచంలో రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. కొత్త పద్ధతులతో సైబర్ నేరగాళ్లు అమాయకులను లక్ష్యంగా చేసుకుని డబ్బులు దోచుకుంటున్నారు. తాజాగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫొటోను ఉపయోగించి హైదరాబాద్లో ఒక వృద్ధుడిని రూ. 14.35 లక్షల మేర మోసం చేసిన ఘటన ప్రజలందరినీ ఆందోళనకు గురిచేసింది. ఇది కేవలం ఒక సంఘటన మాత్రమే కాదు, డిజిటల్ మోసాలు ఎంత వేగంగా కొత్త రూపాలు సంతరించుకుంటున్నాయో చెప్పేందుకు ఒక ఉదాహరణ. ఈ సంఘటనలో సంతోష్నగర్కు చెందిన 68 ఏళ్ల వృద్ధుడు ఫేస్బుక్లో కనిపించిన ఒక పెట్టుబడి ప్రకటనను చూసి మోసపోయాడు. "అధిక లాభాలు" వస్తాయని ఆశ చూపి, ఆ ప్రకటనలో ప్రముఖుడైన నిర్మలా సీతారామన్ ఫొటోను ఉపయోగించారు. ఇది వృద్ధుడిలో నమ్మకం కలిగించింది. మొదట రూ. 12,600 పెట్టుబడి పెట్టగా, లాభాలు



వెంటనే చూపించడంతో అతను నమ్మి విడతలవారీగా రూ. 14.35 లక్షలు చెల్లించాడు. ఆ తర్వాత నేరగాళ్లు మరో రూ. 8 లక్షలు కట్టాలని ఒత్తిడి చేయడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటన ద్వారా మనం నేర్చుకోవాల్సిన పాఠాలు చాలా ఉన్నాయి. సైబర్ నేరగాళ్లు ప్రజల బలహీనతలను, నమ్మకాలను అడ్డం పెట్టుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా, సామాజిక మాధ్యమాలలో ప్రముఖుల ఫొటోలు, పేర్లను ఉపయోగించడం ద్వారా నమ్మకాన్ని పెంచే ప్రయత్నం చేస్తుంటారు. అధిక లాభాల ఆశను చూపించి, తక్కువ సమయంలో డబ్బు రెట్టింపు అవుతుందని చెప్పే ప్రకటనలను నమ్మడం చాలా ప్రమాదకరం.
**సైబర్ నేరాల నుంచి రక్షణకు కొన్ని చిట్కాలు..** అపరిచిత లింక్లు క్లిక్ చేయొద్దు, ఈమెయిల్, మెసేజ్ లేదా సోషల్ మీడియాలో వచ్చే అపరిచిత లింక్లను ఎట్టిపరిస్థితుల్లోనూ క్లిక్ చేయకండి. వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దు. బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్వర్డ్లు, ఓటీపీ వంటి ముఖ్యమైన సమాచారాన్ని ఎవరికీ తెలియజేయవద్దు. బ్యాంక్ అధికారులు లేదా ప్రభుత్వ ఉద్యోగులు ఎవరూ ఈ వివరాలను అడగరు. ఆఫర్లను జాగ్రత్తగా పరిశీలించండి. భారీ లాభాలు లేదా సులభంగా డబ్బు సంపాదించే మార్గాలు అంటూ వచ్చే ఆఫర్లను నమ్మవద్దు. అవి చాలా వరకు మోసపూరితమైనవి. ప్రముఖుల పేరుతో వచ్చే వాటి పట్ల జాగ్రత్త వహించాలి. ప్రముఖుల పేర్లు, ఫొటోలు పెట్టి వచ్చే ప్రకటనలు చాలా వరకు నకిలీవి. వాటిని నమ్మే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. అధికారిక వెబ్సైట్లను మాత్రమే ఉపయోగించండి. ఆన్లైన్ లావాదేవీల కోసం అధికారిక లేదా ధృవీకరించబడిన వెబ్సైట్లను మాత్రమే ఉపయోగించండి. సైబర్ నేరాలు ఆర్థికంగానే కాకుండా మానసికంగానూ తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తాయి. ఇటువంటి సంఘటనలు మళ్లీ జరగకుండా ఉండాలంటే, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండటం, సైబర్ నేరాల గురించి అవగాహన పెంచుకోవడం చాలా అవసరం. మోసపోయినట్లు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. ఇంటర్నెట్ను తెలివిగా, జాగ్రత్తగా ఉపయోగిస్తేనే మనం సురక్షితంగా ఉండగలం.

చురకలు

# సంపాదకీయం

## తగ్గుతున్న నిరుద్యోగ రేటు
## ఆర్థిక పునరుద్ధరణ దిశగా భారత్

భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశం. దేశ ఆర్థికాభివృద్ధికి, నిరుద్యోగ రేటును తగ్గించడం ఒక కీలకమైన అంశం. యువ జనాభా ఎక్కువగా ఉన్న మన దేశంలో, ఉపాధి అవకాశాలను కల్పించడం ఎప్పుడూ ఒక పెద్ద సవాలుగానే ఉంది. అయితే ఇటీవల కేంద్ర కార్మిక సర్వే విడుదల చేసిన గణాంకాలు కొన్ని సానుకూల సంకేతాలను ఇస్తున్నాయి.

**తాజా గణాంకాలు – ప్రధాన కారణాలు...** కేంద్ర కార్మిక సర్వే ప్రకారం.. భారతదేశంలో నిరుద్యోగ రేటు క్రమంగా తగ్గుతోంది. జూలైలో 5.2%గా ఉన్న ఈ రేటు, ఆగస్టులో 5.1%కి తగ్గింది. ఈ తగ్గుదల గ్రామీణ ప్రాంతాల్లో మరింత స్పష్టంగా కనిపిస్తోంది. మే నెలలో 5.1%గా ఉన్న గ్రామీణ నిరుద్యోగ రేటు ఆగస్టు నాటికి 4.3%కి పడిపోయింది. ఈ సానుకూల మార్పుకు కొన్ని ప్రధాన కారణాలు ఉన్నాయి: గ్రామీణ ఉపాధి అవకాశాలు: వ్యవసాయ రంగంలో కార్యకలాపాలు పెరగడం, గ్రామీణ పరిశ్రమల వృద్ధి, స్థానిక ఉపాధి పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనను గణనీయంగా పెంచాయి. సేవల రంగం విస్తరణ: పట్టణ ప్రాంతాల్లో, ఈ-కామర్స్, రిటైల్, నిర్మాణ రంగాల్లో పెరిగిన కార్యకలాపాలు ఉపాధి అవకాశాలను సృష్టించాయి.

**ప్రభుత్వ పథకాలు:** స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి ప్రభుత్వ కార్యక్రమాలు కొత్త సంస్థల స్థాపనకు, తద్వారా కొత్త ఉపాధి అవకాశాలకు తోడ్పడ్డాయి.

**గ్రామీణ ఉపాధి: తాత్కాలికమా, స్థిరమా?...** గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ రేటు 4.3%కి తగ్గడం ఒక మంచి పరిణామమే. అయితే, ఈ తగ్గుదల వ్యవసాయ సీజన్ లేదా తాత్కాలిక పనుల వల్ల మాత్రమే వచ్చిందా, లేక ఇది దీర్ఘకాలికంగా కొనసాగుతుందా అనేది ఒక ప్రశ్న. గ్రామీణ ఉపాధిని స్థిరంగా మార్చడానికి, నీటిపారుదల, రహదారులు వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించడం అత్యంత కీలకం.

**ముందున్న సవాళ్లు-భవిష్యత్తు....** నిరుద్యోగ రేటు తగ్గడం మన ఆర్థిక వ్యవస్థకు ఒక మంచి సంకేతం. కానీ, ఈ సానుకూల ధోరణిని కొనసాగించడానికి కొన్ని ముఖ్యమైన సవాళ్లను అధిగమించాలి. నాణ్యమైన, దీర్ఘకాలిక ఉపాధి అవకాశాలను సృష్టించడం, యువతలో నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడం చాలా ముఖ్యం. అలాగే, గ్రామీణ – పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న ఆర్థిక అసమానతలను తగ్గించడం, ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడం ప్రభుత్వానికి పెద్ద సవాలుగా ఉంది. ఈ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటేనే, నిరుద్యోగం లేని, ఆర్థికంగా బలమైన భారతదేశాన్ని నిర్మించగలం.


# స్వస్థ నారీ... శక్తివంతమైన కుటుంబం । ఆరోగ్య మేళా ఉద్యమం




దేశవ్యాప్తంగా మహిళల ఆరోగ్యం, కుటుంబ శ్రేయస్సు, సమాజ అభివృద్ధి అనే మూడు ప్రధాన లక్ష్యాలను ప్రతిబింబించేలా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ "స్వస్థ నారీ, శక్తివంతమైన కుటుంబ అభియాన్"ను ప్రకటించింది. ఈ ఆరోగ్య మేళా కార్యక్రమం సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు దేశవ్యాప్తంగా జరగనుంది. గాంధీ జయంతి నాడు ముగియనున్న ఈ అభియాన్‌ను జాతీయ స్థాయిలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మధ్యప్రదేశ్ లోని ఇందోర్ నగరంలో ప్రారంభించారు. మహిళల ఆరోగ్యం, పోషకాహారంపై దృష్టి పెట్టే ఈ కార్యక్రమం మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న "పోషణ్ మాహ్"తో అనుసంధానమై మరింత సమగ్రతను సాధిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో ఈ అభియాన్ భాగంగా మొత్తం 3,500 ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించ బడతాయి. ప్రతి జిల్లాలో 17వ తేదీన ఒక మెగా క్యాంప్ నిర్వహిస్తూ, మొత్తం 33 మెగా క్యాంపులు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతాయి. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రులు, మెడికల్ కళాశాలలు ఈ ఆరోగ్య శిబిరాలకు వేదికలుగా మారనున్నాయి. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులను నోడల్ అధికారులుగా నియమించి ముందస్తు ఏర్పాట్లు ప్రారంభించ బడ్డాయి. సెప్టెంబర్ 13 లోపు ప్రత్యేక వైద్య శిబిరాల క్యాలెండర్ రూపొందించి, 15వ తేదీకి కేంద్ర డాష్ బోర్డ్‌లో నమోదు చేయడం తప్పనిసరి. ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ప్రచార బోర్డులు, పోస్టర్లు, బ్యానర్లు ఉపయోగిస్తారు. ముఖ్యమంత్రి, ప్రజాప్రతినిధులు, గౌరవనీయులు ఈ ప్రారంభోత్సవాలకు ఆహ్వానించ బడతారు. అలాగే మహిళా శిశు సంక్షేమం, విద్య, యువజన, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, గిరిజన శాఖలతో అనుసంధానం కల్పించి సమగ్ర సమన్వయం చేపడతారు. ప్రైవేట్ ఆసుపత్రులు, ఆరోగ్యశ్రీకు అనుబంధిత ఆసుపత్రుల సహకారం కూడా పొందనున్నారు. ఈ శిబిరాలలో ప్రతి లబ్ధిదారుడి నమోదు ఆన్లైన్‌లో జరుగుతుంది. మొబైల్ మెడికల్ యూనిట్లు దూర ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలలో సేవలు అందిస్తాయి. గైనకాలజిస్టులు, పీడియాట్రిషియన్లు, నేత్ర వైద్యులు, ఇ ఎన్ టి నిపుణులు, దంత వైద్యులు, చర్మ వైద్యులు, మానసిక ఆరోగ్య నిపుణులు వంటి వైద్యులను జిల్లా ఆసుపత్రులు, మెడికల్ కళాశాలల నుండి సమీకరిస్తారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టబడుతుంది. రక్తపోటు, డయాబెటిస్, స్తన, గర్భాశయ, నోటి క్యాన్సర్లకు స్క్రీనింగ్ చేస్తారు. క్షయ వ్యాధి నిర్ధారణకు పరీక్షలు నిర్వహిస్తారు. యువతుల్లో రక్తహీనత పరీక్షలు చేసి, సలహాలు ఇస్తారు. గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ వ్యాధి పరీక్షలు చేసి కార్డులు పంపిణీ చేస్తారు. గర్భిణీ స్త్రీలకు సంపూర్ణ అంథినేటల్ కేర్ అందిస్తూ హీమోగ్లోబిన్ పరీక్షలు, పోషకాహార సూచనలు, తల్లి-శిశు రక్షణ కార్డుల పంపిణీ జరుగుతుంది. పిల్లలకు టీకాలు తప్పనిసరిగా అందిస్తారు. కిశోర బాలికలకు మాసిక శుచిత, పోషకాహారంపై అవగాహన కల్పిస్తారు. మహిళా సంఘాలు, పంచాయతీరాజ్ సంస్థల ద్వారా చక్కెర, నూనె వినియోగం తగ్గించేందుకు ఆరోగ్య మేల్కొలుపు కార్యక్రమాలు నిర్వహిస్తారు. రక్తదానం భాగంగా జాతీయ రక్తదాన డ్రైవ్‌లో లక్ష యూనిట్ల రక్త సేకరణ లక్ష్యంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు అవుతాయి. "మైగోవ్" వేదిక ద్వారా రక్తదాతల నమోదు, ప్రతిజ్ఞలు తీసుకోవడం జరుగుతుంది. క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా "నిక్షయ్ మిత్రుల"ను పెంచేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తారు. ప్రతి శిబిరం నిర్దిష్ట ఆపరేటింగ్ విధానాల ప్రకారం నిర్వహించ బడుతుంది. రోజువారీ పురోగతిని సమీక్షించేందుకు జిల్లా స్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థ అమలు అవుతుంది. జాతీయ డాష్‌బోర్డ్‌లో లబ్ధిదారుల సమాచారం, శిబిరాల వివరాలు సమయానికి నమోదు చేయాలి. ప్రతి శిబిరం నుండి లబ్ధిదారుల అనుభవాలు, అభిప్రాయాల వీడియో క్లిప్‌లు అప్లోడ్ చేయాలి. "స్వస్థ నారీ, శక్తివంతమైన కుటుంబ అభియాన్" మహిళల ఆరోగ్యం, కుటుంబ శ్రేయస్సు, సమాజ అభివృద్ధికి కొత్త మార్గం చూపే జాతీయ ప్రజోద్యమంగా రూపుదిద్దు కుంటోంది. జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు ప్రతి ఒక్కరి చురుకైన సహకారం, నాయకత్వం అవసరం. ఈ అభియాన్ విజయవంతమైతే మహిళల ఆరోగ్యం, పోషకాహారం, కుటుంబాల సుస్థిరతలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకోవడం ఖాయం. "స్వస్థ నారీ – శక్తివంతమైన కుటుంబం... ఆరోగ్యకరమైన సమాజానికి బలమైన పునాది"

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్**

# వాడుక భాషను విరివిగా వాడిన మేస్త్రీ తాపీ - సెప్టెంబర్ 19...తాతాజీ తాపీ ధర్మారావు జయంతి




తాపీ ధర్మారావు నాయుడు తెలుగు రచయిత, తెలుగు భాషా పండితుడు, హేతువాది, నాస్తికుడు. ఆంధ్రులకొక మనవి, దేవాలయాలపై బూతుబొమ్మలు ఎందుకు? పెళ్ళి దాని పుట్టు పూర్వోత్తరాలు, రాలూ రప్పలు, రాముడికి సీత ఏమవుతుంది వంటి బహు పాఠక పుస్తకాలు,సాహిత్యాం శాలపై సాహిత్య మోర్మోరాలు, పాతపాళీ, కొత్తపాళీ వంటి గ్రంథాలు, విజయవిలాస కావ్యంపై హృదయోల్లాస వ్యాఖ్య వంటి విభిన్న అంశాలపై రచనలు చేసి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన మాలపిల్ల, రైతుబిడ్డ మొదలైన సినిమాలకు సంభాషణలు రాశారు. తాపీ ధర్మారావు జయంతి సెప్టెంబరు 19 ని "తెలుగు మాధ్యమాల దినోత్సవం"గా కూడా జరుపు కుంటున్నారు. తాపీని గౌరవంగా 'తాతాజీ' అని పిలిచేవారు. సాహిత్యం, సినిమా, పత్రికలు, అధ్యాపకత్వం – ఇన్ని రంగాల్లో ఏకకాలంలో కృషి చేసిన అభ్యుదయవాది తాపీ. పత్రికలలో, సినిమాలలో వాడుక తెలుగు భాష ప్రవేశ పెట్టిన ఘనత తాపీ ధర్మారావుకే చెందుతుంది. అభ్యుదయ రచయితల సంఘం తొలి మహాసభలకూ ఆయనే అధ్యక్షులు. తాపీ ధర్మారావు (సెప్టెంబర్ 19, 1887 – మే 8, 1973) ప్రస్తుతం ఒరిస్సాలో ఉన్న బెర్హంపూరు (బరంపురం) లోని ఒక తెలుగు కుటుంబములో ధర్మారావు నరసమ్మ, అప్పన్న దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్యను శ్రీకాకుళంలో, మెట్రిక్యులేషన్ విజయవాడలో, పర్లాకిమిడిలో ఎఫ్.ఏ. వరకు చదువుకొని మద్రాసులోని పచ్చయప్ప కళాశాలలో చేరారు. చదివే రోజులలో వ్యవహారిక భాషావేత్త అయిన గిడుగు రామ్మూర్తి ఈయనకు గురువు కావటం విశేషం. వీరి అప్పన్న తాత లక్ష్మయ్య కొంతకాలం మిలిటరీలో పనిచేసి, తరువాత తాపీ పనిలో మంచి పేరు తెచ్చుకొన్నారు. అలా శ్రీకాకుళంలో "తాపీ లక్ష్మయ్య" అన్న పేరు స్థిరపడి పోయిందట. అలా వీరి ఇంటిపేరు తాపీ గా మారింది. చిన్నప్పుడు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడి, ఉపాధ్యాయ వృత్తి చేపట్టి, క్రమంగా యెదిగిన వ్యక్తి ఆయన. కల్లికోట రాజావారి కళాశాలలో గణిత ఉపాధ్యాయులుగా పని చేశారు. 1910 ప్రాంతంలో కొందరు మిత్రులతో కలిసి బరంపురంలో వేగుచుక్క గ్రంథమాలను స్థాపించారు. ఇతని తొలి రచన 1911లో 'ఆంధ్రులకొక మనవి' అనే పేరుతో వెలువడింది. పత్రికా నిర్వహణలో ఆయన నేర్పు అనన్య సామాన్యం.1930 జూన్‌లో జస్టిస్ పార్టీ వారి పత్రిక 'సమదర్శిని'లో సంపాదకులుగా, 1935–'36లో గూడవల్లి రామబ్రహ్మం సారథ్యం లోని 'ప్రజామిత్ర' పత్రికలో రచయితగా, 1936లో పిఠాపురం రాజా పీపుల్స్ పార్టీ పక్షాన నెలకొల్పిన 'జనవాణి'కి ఎడిటర్‌గా పత్రికా రంగానికి తాతయ్య చేసిన సేవ, పెట్టిన ఒరవడి నేటికీ గుర్తు చేసు కుంటారు. ముందు వీర గ్రాంథిక వాదైనా, గిడుగు వారి ప్రభావంతో తర్వాత వ్యావహారిక భాషకు పట్టం కట్టారు. సినీ రచయితగా ఆయన తొలిచిత్రం మోహినీ రుక్మాంగద (1937). ఆ పౌరాణిక చిత్రంలో ఆయన వ్యావహారిక భాషలో సంభాషణలు రాయడం అప్పట్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. 'మాలపిల్ల', 'రోజులు మారాయి' చిత్రాల రచనల్లో ఆయన అభ్యుదయ భావాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. 1937లో సినీరంగంలో అడుగుపెట్టి మొదట మోహినీ రుక్మాంగదకు, చివరగా 1962లో భీష్మ సినిమాకు సంభాషణలు రాశారు. చేమకూర వెంకటకవి విజయవిలాస కావ్యానికి సహృదయోల్లస వ్యాఖ్య రాసి సంప్రదాయ పండితుల ప్రశంసలందు కున్నారు. తాపీ ధర్మారావు మాలపిల్ల (1938) సినిమాకు సంభాషణలు రాయగా, కథ అందించినది గుడిపాటి వెంకటచలం. ఉమ్మడి రాష్ట్రంగా వున్న రోజుల్లో బొబ్బిలి రాజా ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నప్పుడు... ధర్మారావు ఆయన దగ్గర కార్యదర్శిగా పని చేశారు. ఆంధ్ర రాష్ట్ర పత్రికా రచయితల మహాసభ జరిగినప్పుడు ధర్మారావే తొలి అధ్యక్షులు. శృంగేరి పీఠాధిపతులు జగద్గురు చంద్రశేఖర భారతీ శంకరాచార్యుల వారి నుండి 1926లో 'ఆంధ్ర విశారద' బిరుదు, చేమకూరి వెంకటకవి రచించిన 'విజయ విలాసం' కావ్యానికి చేసిన 'హృదయోల్లాస వ్యాఖ్య'కు 1971లో కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారము, మరెన్నో సాహిత్య పురస్కారములు పొందారు. ఆంధ్రులకొక మనవి, దేవాలయాలపై బూతుబొమ్మలు ఎందుకు? 1936, పెళ్ళి దాని పుట్టుపూర్వోత్తరాలు 1960, ఇనుప కచ్చడాలు, సాహిత్య మోర్మోరాలు, రాలూ రప్పలూ, మబ్బు తెరలు, పాతపాళీ కొత్తపాళీ, ఆలిండియా అడుక్కు తినేవాళ్ళ మహాసభ, విజయ విలాసం వ్యాఖ్య, అక్షర శారద ప్రశంస, హృదయో ల్లాసము, భావ ప్రకాశిక, నల్లిపై కారుణ్యము, విలాసార్జునీయము, ఘంటా న్యాయము, అనా కెరినీనా, ద్యోయానము, భిక్షాపాత్రము, ఆంధ్ర తేజము, తప్తాశ్రు కణము తదితర రచనలు చేశారు. ధర్మా రావు 1973 మే 8న మరణించారు. తెలుగు సినిమా దర్శకులు తాపీ చాణక్య ఆయన కుమారుడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అన్య భాషా మాధ్యమం వద్దు... తెలుగు మాధ్యమమే ముద్దు - సెప్టెంబర్19...తెలుగు మాధ్యమాల దినోత్సవం

తెలుగు మాధ్యమాల దినోత్సవం ప్రతి సంవత్సరం సెప్టెంబరు 19న నిర్వహించబడుతుంది. తెలుగు మాధ్యమాలలో వాడుక భాషను విజయవంతంగా ప్రవేశపెట్టిన తాపీ ధర్మారావు గుర్తుగా ఆయన జన్మదినం రోజున ఈ దినోత్సవం జరుప బడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విజ్ఞానాన్ని తెలుసుకోవడం, తెలుసుకున్న జ్ఞానాన్ని అనుభవాన్ని సంస్కృతిని, సంప్రదాయాన్ని తర్వాతి తరాలకు అందించడానికి ఉపకరించే సాధనం మాతృభాష. గతానికి వర్తమానానికి భవిష్యత్తుకు వారధి కూడా మాతృభాషే. భాష అనేది చరిత్ర గమనానికి, సామాజిక పరిణామానికి మూలాధారం. మాతృభాష అనగా శిశువుకు తల్లి ఉగ్గుపాలతో నేర్పినటువంటి భాష. ఈ మాతృభాష ప్రతి శిశువుకు సహజంగా ఎలాంటి ప్రయత్నం అవసరం లేకుండానే వస్తుంది. మాతృభాష ద్వారా నేర్చుకున్న విద్య సులభంగా అవగత మవుతుంది. అంతేకాక విద్యార్థిలో ఉన్న సృజనాత్మక శక్తులను వెలికి తీస్తుంది. తద్వారా ఇతర భాషలు నేర్చుకోవడానికి మాతృ భాష ఎంతో సహాయకారిగా ఉంటుంది. ప్రాథమిక స్థాయిలో మాతృభాషా మాధ్యమం అనివార్యమైన అవసరమని భారత రాజ్యాంగం (అధికరణం 350 ఎ), కొఠారీ కమిషన్ చెప్పింది. 2010లో భారత ప్రభుత్వం తెచ్చిన విద్యాహక్కు చట్టం విభాగం 29(2)లో ఎలిమెంటరీ స్థాయిలో వీలైనంత వరకు మాతృభాషా మాధ్యమాన్నే అమలు చేయాలని నిర్దేశించింది. నూతన జాతీయ విద్యా విధానం (2020) కూడా ఐదవ తరగతి వరకు మాతృభాష లోనే బోధన జరగాలి అని చెబుతోంది. అంతర్జాతీయ సంస్థలన్నీ- యునెస్కో, వరల్డ్ బ్యాంక్, వరల్డ్ డిక్లరేషన్ ఆన్ ఎడ్యుకేషనల్ ఫరాల్ (ఎఫ్ఎఫ్ఏ) జనరల్ అసెంబ్లీ లాంటి సంస్థలన్నీ పిల్లలకు ప్రాథమిక విద్యని మాతృభాషలో నేర్చుకునే హక్కుందని నిర్ధారించాయి. ప్రాథమిక స్థాయి వరకు తెలుగు మాధ్యమం లోనే విద్యాబోధన చేసి 6వ తరగతి తరువాత ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని, తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు రెండింటినీ కొనసాగిస్తే ఎవరికి ఇష్టమైన మాధ్యమంలో వాళ్లు విద్యాభ్యాసం చేస్తారనేది అనేకమంది వాదన. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నది తెలుగు జాతి. ప్రపంచంలో




"మా తల్లి భాష మాకొద్దు, ఇతర భాషల ముద్దు" అని చెప్పగలిగే జాతి ఏదైనా ఉంది అంటే నిస్సిగ్గుగా అది తెలుగు జాతి మాత్రమే. "తెలుగుకు" పట్టిన ఈ "తెగులు" ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్ర దేశం పూర్తిగా మారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. ఆంగ్ల మాధ్యమంలో చదివితే పిల్లలు గొప్పవారు కాగలరని, తెలుగు మాట్లాడితే చులకన అనే భావన వల్ల, ఆంగ్ల భాషకు ప్రాధాన్యత పెరిగి, తెలుగు భాష నిరంతర నిర్లక్ష్యానికి గురి అవుతున్నది. తెలుగు భాషను నికోలే కొంటి "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని 1402 లోనే ప్రశంసించారు. పరభాష ద్వారా ప్రాథమిక తరగతుల విద్యార్థులకు పాఠాలు చెప్పే విధానం పూర్తిగా అశాస్త్రీయమని, కాలహరణ హేతువని, బావి పౌరులను బానిసలుగా చేస్తుందని విద్యా వేత్తలు అభిప్రాయ పడుతున్నారు. పిల్లల సొంత ఆలోచనలను పెంపొందించడానికి, వారి సాంస్కృతిక బానిసత్వానికి మార్గం ఏర్పడుతుందని, విజ్ఞానానికి – విద్యార్థులకు మధ్య ఒక అడ్డుగోడలా సృష్టిస్తుందని, తమ చుట్టూ ఉన్న జీవిత విలువలను తెలియని విద్యార్థులను, విషయ పరిజ్ఞానం లోతుగా తెలీని, ఉపాధ్యాయులు చెప్పింది చెప్పినట్లు, నోట్సు కాపీ చేస్తూ, కంఠస్తం చేసే యంత్రాలుగా మారుస్తుందని విద్యాధికుల, మానసిక శాస్త్ర వేత్తల భావన. తనకు అర్థం కాని, సాధికారికత ఏమాత్రం చేకూర్చని భాషకు సంబంధించిన విషయాలను, బట్టీ పట్టి తమ తల్లిదండ్రులను మురిపింప చేస్తూ, తమను తాము, తమ పోషకులను, మోసం చేసుకోవడం అవుతుందని విజ్ఞులు, ప్రాజ్ఞులు ఎంత మొత్తుకున్నా, అర్థం చేసుకునే వారు భూతద్దానికి అగుపించడం లేదంటే అతిశయోక్తి లేదు...మొగల్ చక్రవర్తి ఔరంగజేబు అరబ్బీ భాషలో తనకు పాఠాలు బోధించి, తన బాల్యం అంతా వృథా పరిచారని, తన గురువుకు రాజ్య బహిష్కరణ లాంటి తీవ్ర శిక్ష విధించిన విషయం చరిత్ర చెప్తుంది. ఔరంగజేబు తన గురువుకు రాసిన నాటి చారిత్రాత్మక ఉత్తరాన్ని 1910లో కొమర్రాజు లక్ష్మణరావు తెలుగులోకి అనుమతించడమే కాక, తన కాలం నాటి ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల భవిష్యత్ తరాలు ఔరంగజేబు లాగా మనలను తప్పు పడతా యని హెచ్చరించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో, కేజీ నుండి పూర్తిగా ఆంగ్ల మాధ్యమం పెడదామన్న మాజీ సీఎం జగన్ ప్రభుత్వ నిర్ణయాన్ని, హై కోర్టు నిర్ద్వందంగా త్రోసి పుచ్చింది. ఇదైనా పాలకులకు గుణపాఠం కావాలి. ప్రైవేటు పాఠశాలలో తెలుగు మాధ్యమంలో, ప్రాథమిక విద్య దాదాపు కనుమరుగయింది. తెలుగు భాషకు.. తెలుగు తనానికి చోటు లేకుండా పోతున్నది. ఈ తరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాల పట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు "తెలుగు లెస్స" అన్న నానుడి దేశ భాష లందు "తెలుగు లెస్" అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు రాష్ట్రాలలో తెలుగును నిర్లక్ష్యం చేస్తుంటే.... దేశ ప్రధాని నరేంద్ర మోడీ, గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉంటూ, అహమ్మదాబాద్, సూరత్ లాంటి పట్టణాలలో, తెలుగు వారికోసం తెలుగు మాధ్యమ బడులు నడిపారు. ఇప్పటికీ అవి నడుస్తూనే ఉన్నాయి. అంతే కాదు, 2017లో కేంద్ర ప్రభుత్వ బళ్ళలో కూడా తెలుగు తప్పని సరి అని ప్రధాని అన్నారు కూడా. భారత తాజా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, "మాతృ భాష కళ్ళ వంటిది, పరాయి భాష కళ్ళద్దాల వంటిది, కళ్లు లేకుండా, అద్దాలు పెట్టుకోవడం వల్ల ఉపయోగం శూన్యం". అన్న మాటలను మననం చేసుకోవాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు



# అక్రమ 'అంతస్తులు'



కరీంనగర్ : నగరంలోని ఓ ప్రాంతంలో జీ౦2 భవన నిర్మాణానికి అనుమతి తీసుకున్నారు. ఆ తర్వాత అదనంగా మూడు, నాలుగు, అయిదు అంతస్తులను అక్రమంగా నిర్మించారు. దీనిని గుర్తించిన పట్టణ ప్రణాళిక అధికారులు భవనానికి నోటీసు అంటించి సీజ్ చేశారు. మరో డివిజన్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా రెండు అంతస్తులు నిర్మించారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోలేదు. కోర్టు ఆదేశాల మేరకు ఆ నిర్మాణాన్ని కూల్చివేశారు. జిల్లాలోని పుర, నగరపాలికల్లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. భవన నిర్మాణాల అనుమతులకు ప్రభుత్వం సులువైన మార్గాలు అమలు చేస్తోంది. పట్టణ ప్రణాళిక అధికారులు వీటిపై అవగాహన కల్పించకపోవడంతో అడ్డదారులను ఆశ్రయిస్తున్నారు. దీనికితోడు క్షేత్రస్థాయి ఉద్యోగులు సైతం జత కట్టడంతో అనధికారిక నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండాపోయింది.

**అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు**

జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థ పరిధిలో భవన నిర్మాణాలు అనుమతులకు విరుద్ధంగా నిర్మించుకుంటున్నారు. జీ౦2 అనుమతి తీసుకొని జీ౦3, 4, 5 వరకు నిర్మించుకునే వారి సంఖ్య పెరిగింది. ఆ లెక్కన అనుమతి తీసుకుంటే ఫీజు రూపంలో బల్దియాకు రూ.వేలల్లో ఆదాయం వస్తోంది. ఆ మొత్తాన్ని చెల్లించకుండా అనుమతులు ఒకరకంగా, నిర్మాణాలు మరోరకంగా చేపడుతున్నారు. మూడేళ్లుగా పరిశీలిస్తే ఇలాంటి నిర్మాణాలు వందల్లో ఉంటాయని చెబుతున్నారు.

**అటకెక్కిన నిబంధనలు..**

భవన నిర్మాణ సమయంలో స్థల విస్తీర్ణం బట్టి అంతస్తులకు అనుమతి ఇవ్వాలి. కానీ ఇటీవల చిన్న, చిన్న వీధుల్లో కూడా బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు.

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని లోపలికి జరిగి ఇళ్ల నిర్మాణం చేసుకోవాల్సి ఉండగా సెట్‌బ్యాక్ అనేదే మరిచిపోయారు. ప్లాట్ ఏరియాను బట్టి 200 మీటర్లలోపు అయితే రోడ్డు వైపు అయిదు ఫీట్లు, మిగతా మూడు వైపులా 3.5 ఫీట్లు వెనక్కి జరిగి శ్లాబు వేసుకోవాల్సి ఉండగా ఎవరూ పాటించడం లేదు.

20 అడుగుల రోడ్డు ఉంటే కచ్చితంగా నగరపాలక సంస్థకు 5 ఫీట్లు గిఫ్టు చేయాల్సి వస్తుందనే కారణంతో కొందరు అనుమతులే తీసుకోవడం లేదు.

సెట్‌బ్యాక్ స్థలంలో శ్లాబు, ప్రహరీలు, సెప్టిక్‌ట్యాంకు, బోర్‌వెల్ ఉండకూడదు. ఎక్కడ చూసినా ఇవన్నీ ఆ స్థలంలోనే ఉంటున్నాయి. నగర, పట్టణాల్లో అనధికారిక, సెట్‌బ్యాక్ లేకుండా, చెరువు కట్టలు, ప్రభుత్వ స్థలాలకు అనుకొని నిర్మాణాలు పెరిగిపోతున్నాయి.

**నోటీసులు జారీ చేశాం**

నగరంలో అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలు 53 ఉన్నట్లు గుర్తించాం. వీటన్నింటికి నోటీసులు జారీ చేశాం. రెండు నెలల సమయం ఇచ్చాం. తర్వాత వాటన్నింటిపై చర్యలు తీసుకుంటాం.

– బషీర్, డీసీపీ, కరీంనగర్ నగరపాలిక

## విజృంభిస్తున్న దోమలు.. వణికిస్తున్న జ్వరాలు

సిరిసిల్ల: జిల్లాలో డెంగీ జ్వరాలు పెరుగుతున్నాయి. జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబరులలో ఇప్పటి వరకు 100 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇందులో జులై, ఆగస్టు మాసాల్లో ఎక్కువగా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా సరిహద్దు గ్రామాలు, తండాలోని అక్కడి వైద్యులు జీజీహెచ్‌కు రిఫర్ చేయడంతో ఇక్కడ కేసులు ఎక్కువగా రికార్డు అవుతున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

**ప్రత్యేక శ్రద్ధ అవసరం**

జిల్లా జనరల్ ఆసుపత్రిలో సాధారణ రోజుల్లో సగటున 600 ఉండే ఓపీ రెండు నెలలుగా 1100లకు చేరుతోంది. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు.. దోమల పెరుగుదల, పారిశుద్ధ్యలోపం, ఇంటి పరిసరాలను సకాలంలో శుభ్రం చేయకపోవడంతో నీటినిల్వలు, చెత్త పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమల నివారణకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదు. మండల పరిషత్తుల్లో చాలాచోట్ల ఫాగింగ్ యంత్రాలు ఉన్నా వాటి నిర్వహణ భారంగా మారడంతో ఉన్నవాటిని సైతం వినియోగించడం లేదు. ప్రత్యామ్నాయంగా దోమల వృద్ధిని నివారించేందుకు చేపట్టాల్సిన పారిశుద్ధ్య కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.

**నిర్లక్ష్యం వద్దు**

తొలుత సాధారణ జ్వరంగా కనిపించినా రెండు రోజుల తర్వాత డెంగీ లక్షణాలు కనిపిస్తాయి. జ్వరం, తలనొప్పి ఇతర ఏ లక్షణాలు కనిపించినా వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేయవద్దు, జ్వరం, తలనొప్పి, ఇతర ఏ లక్షణాలున్నా వెంటనే వైద్యులను సంప్రదించాలి. జీజీహెచ్‌లో డెంగీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ అయితే సకాలంలో వైద్యం అందుతుంది.



**వైద్యుల కొరత**

జిల్లా జనరల్ ఆసుపత్రిలో వైద్యుల కొరత వేధిస్తోంది. ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, సాధారణ శస్త్రచికిత్సల విభాగంలో నిత్యం రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అన్ని విభాగాల్లో కలిసి 90 మంది వైద్యులు ఉండాల్సింది 63 మంది ఉన్నారు. ఇటు వైద్య కళాశాలలోనూ 118 మంది ప్రొఫెసర్లకు 44 మంది మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే ఆసుపత్రిలో చికిత్సలు అందిస్తున్నారు. వైద్యుల నియామకాలపై ఉన్నతాధికారుల దృష్టిలో ఉన్నట్లు జిల్లా ఆసుపత్రి, వైద్యకళాశాల అధికారులు తెలిపారు.

**వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం – రజిత, డీఎంహెచ్‌వో**

ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహిస్తున్నాం. నీటి నిల్వలున్న చోట దోమ లార్వాలు నాశనం చేయడానికి ఆయిల్ బాల్స్, ఇంజిన్ ఆయిల్ లాంటివి పోసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇంటింటి సర్వే నిర్వహించి, జ్వర కేసులు ఎక్కువగా నమోదవుతున్న చోట అక్కడికక్కడే వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. జిల్లా ఆసుపత్రిలో జ్వరాల కోసం ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి మెరుగైన చికిత్సలు అందిస్తున్నాం.

## ఎన్నాళ్లో కష్టనష్టాలు

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో 1521 కిలోమీటర్ల మేర పంచాయతీరాజ్ రోడ్లు విస్తరించి ఉండగా అందులో ప్రధాన సీసీ రోడ్లు 138 కి.మీ., బీటీ రోడ్లు 576 కి.మీ., మెటల్ రోడ్లు 57 కి.మీ., మట్టిరోడ్లు 750 కి.మీ. ఉన్నాయి. 21 పెద్ద బ్రిడ్జిలు, 59 కాజ్‌వేలు పీఆర్ రహదారుల్లో భాగమే. జిల్లాలో 600.627 కిలోమీటర్ల రోడ్లు భవనాలశాఖ రోడ్లున్నాయి. అందులో 57 వారధులు, 1300 కల్వర్టులు, 71 కాజ్‌వేలున్నాయి. అయితే ప్రస్తుతం ఉన్న లో- లెవల్ కల్వర్టులు, కాజ్‌వేలతో ప్రజలు, ప్రయాణికులకు ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదు. భారీ వర్షాలకు వరదనీరు ఈ కల్వర్టులపై నుంచి పారుతుండడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. మరికొన్ని గ్రామాలకు రవాణా సంబంధాలు పూర్తిగా తెగిపోతున్నాయి. వర్షాకాల మొస్తే వణుకే అన్న చందంగా మారింది పల్లెవాసుల పరిస్థితి.

ఎగువ మానేరు ఉప్పొంగినప్పుడల్లా గంభీరావుపేట – లింగన్నపేట మధ్య లో లెవల్ కల్వర్టు పూర్తిగా నీట మునిగిపోతోంది. బ్రిడ్జి నిర్మాణానికి రూ.17 కోట్లు మంజూరయ్యాయి. లో లెవల్ కల్వర్టును పూర్తిగా తొలగించి, 2023 సెప్టెంబరులో వారధి పనులు ప్రారంభించారు. సిమెంటు పైపులు వేసి, తాత్కాలిక రోడ్డు వేశారు. ఇటీవల ఎగువమానేరు వరద ఉద్ధృతికి తాత్కాలిక రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. 9 పిల్లర్లతో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణంలో కేవలం ఏడు పిల్లర్లను మాత్రమే నిర్మించారు. పనులు నత్తనడకన సాగుతుండడం తీవ్ర ఇబ్బందిగా మారుతోంది.

కల్వర్టులను విస్తరించడం, వాటిని బాగుచేయడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కల్వర్టుల విస్తరణకు ఏళ్లుగా ఎదురు చూస్తున్నా పరిష్కారం కావడం లేదు. తక్కువ ఎత్తుతో ఉన్న కల్వర్టులు, రోడ్ డ్యాంలపై వరద నీటి ప్రవాహానికి వాహన రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతుండడంతో మారుమూల గ్రామాల ప్రజలు వర్షాకాలంలో వనవాసం చేయాల్సిన దుస్థితి తలెత్తుతోంది.

చందుర్తి నుంచి కమ్మర్‌పేటలో మత్తడి ప్రమాదకరంగా మారింది. విలాసాగర్- కొదురుపాక గ్రామాల నడుమ, బోయినపల్లి- మర్తనపేట గ్రామాల మధ్య వారధుల నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. వేములవాడ- స్తంభంపల్లి నడుమ, వీర్నపల్లి మండలం అడవిపదిర వద్ద బ్రిడ్జిల పనులు నత్తనడకన సాగుతున్నాయి. అవసరమైన ప్రదేశాల్లో వారధులు నిర్మిస్తే ప్రజల సమస్యకు పరిష్కారం లభించనుంది.

కాజ్‌వేలు, లో లెవల్ కల్వర్టుల వద్ద ఇబ్బందులను గుర్తించామని నిధులు మంజూరుకాగానే నిర్మాణాలు ప్రారంభిస్తామని పంచాయతీ రాజ్ ఈఈ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. రోడ్లు భవనాలశాఖ ఈఈ నర్సింహాచారి మాట్లాడుతూ గంభీరావుపేట- లింగన్నపేట మధ్య వంతెన పనులను వర్షాలు తగ్గిన తర్వాత వేగవంతం చేస్తామన్నారు. గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజీ నుంచి ఎగువమానేరు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. డిజైన్‌లో భాగంగా స్థలాన్ని సేకరించాల్సి ఉందని ఆర్ అండ్ బి ఈఈ నర్సింహాచారి పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం పదిర, ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లె గ్రామాల నడుమ ఉన్న కాజ్‌వే ఇదీ. ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాలను తక్కువ దూరంలో కలిపేందుకు ఈ రోడ్డు ప్రధానంగా ఉండేది. కొద్దిరోజుల క్రితం ఎగువమానేరు వరదనీటి తాకిడికి కాజ్‌వే పూర్తిగా ధ్వంసమైంది. ఇప్పుడు ఎల్లారెడ్డిపేట నుంచి ముస్తాబాద్‌కు వెళ్లాలంటే వెంకటాపూర్, బండలింగంపల్లి మీదుగా వెళ్లాల్సి వస్తోంది. దీంతో ప్రయాణికులపై దూరభారం పడుతోంది. శాశ్వత బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలనే యోచన ప్రతిపాదనలకే పరిమితమవుతోంది.

## ఆదాయ లక్ష్యం వైపు అడుగులు



హుజూరాబాద్ : ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నిర్దేశిత ఆదాయ లక్ష్యం అధిగమించేలా అధికారులు దృష్టి సారించారు. గతేడాది రూ.69.83 కోట్ల ఆదాయ లక్ష్యానికి.. రూ.73.52 కోట్లు సమకూరింది. ఈసారి రూ.90.22 కోట్లుగా అంచనా వేశారు. ఇందుకనుగుణంగా జిల్లాల వారీగా ఆయా మార్కెట్లలో జరిగే పంట ఉత్పత్తుల విక్రయాలతో వచ్చే మార్కెట్ ఫీజు, గిడ్డంగులు, దుకాణ సముదాయాల అద్దె, చెక్‌పోస్టులు తదితర ఆదాయాలపై అవసరమైన కసరత్తు చేస్తున్నారు.

**రూ.90.22 కోట్లుగా నిర్ణయం**

ఉమ్మడి జిల్లాలోని 39 మార్కెట్ల ద్వారా రూ.90.22 కోట్ల ఆదాయమే లక్ష్యంగా పెట్టుకోగా.. గడిచిన ఐదేళ్లలో రూ.14.18 కోట్ల మేర ఆదాయం సమకూరింది. ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర కలిపి మరో రూ.28.31కోట్లు జమకావాలి. మొత్తంగా రూ.42.49 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 47 శాతం ఆదాయం సాధించినట్లు అధికారులు తెలిపారు. వానాకాలం సీజన్ పత్తి, ధాన్యం, ఇతర వ్యవసాయోత్పత్తులు అధికంగా మార్కెట్లకు వచ్చే అవకాశం ఉండటంతో లక్ష్యం అధిగమిస్తామంటున్నారు.

**గతేడాది**

2024-25 ఆర్థిక సంవత్సరంలో కరీంనగర్ జిల్లాలో 8 వ్యవసాయ మార్కెట్ల ఆదాయ లక్ష్యం రూ.24.27 కోట్లు కాగా.. రూ.25.23 కోట్లు సాధించాయి. జగిత్యాలలో 13 మార్కెట్లకు రూ.21.19 కోట్లకు.. రూ.21.22 కోట్లు వచ్చింది. పెద్దపల్లి జిల్లాలో 8 మార్కెట్లకు రూ.14.05 కోట్లు నిర్ణయించగా రూ.12.64 కోట్లకు పరిమితమైంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 10 మార్కెట్ల ఆదాయ లక్ష్యం రూ.10.32 కోట్లు అధిగమించి రూ.14.48 కోట్లు సాధించింది.

**చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం**

యాసంగిలో ఆదాయం తగ్గినా వానాకాలం సీజన్ పత్తి, ధాన్యం, ఇతర పంట ఉత్పత్తులు క్రయవిక్రయానికి వచ్చే అవకాశముండటంతో మార్కెట్ ఆదాయం పెరిగే అవకాశం ఉంది. మార్కెట్ ఫీజు వసూళ్లతో పాటు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించాం. ప్రైవేటు వ్యాపారుల క్రయ, విక్రయాలను దగ్గరుండి పరిశీలించాలని మార్కెట్ అధికారులకు సూచించాం. గిడ్డంగులు, దుకాణ సముదాయాల అద్దె బకాయిలు లేకుండా వసూలు చేయాలని చెప్పాం. – ఉప్పుల శ్రీనివాస్, ఆర్‌జేడీఎం, వరంగల్

## అడుగు ముందుకు..రెండడుగులు వెనక్కి



జగిత్యాల: జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారి నిర్మాణం తీరు ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అనే రీతిలో సాగుతోంది. భారత్ మాల పరియోజనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ రోడ్డును జాతీయ రహదారి 563గా గుర్తించి.. గతంలో రూ.1503 కోట్లు మంజూరు చేసింది. భూసేకరణలో జాప్యం, రహదారి పరిధి గ్రామాల్లో వివాదం తదితర కారణాలతో ఆరేళ్ల క్రితమే అర్ధాంతరంగా నిలిపివేశారు. తిరిగి అంచనాలు పెంచి సుమారు రూ.2223 కోట్లతో రహదారి విస్తరించాలని నాలుగేళ్ల క్రితమే భావించినప్పటికి భూసేకరణ అంశం కొలిక్కి రావడంలేదు.

**జిల్లాకు రూ.124 కోట్ల పరిహారం**

58.6 కిలోమీటర్ల రహదారి విస్తరణకు 245.94 హెక్టార్ల భూమి సేకరించాలని నిర్ణయించారు. ఇందులో 157 హెక్టార్లు జగిత్యాల.. మిగతాది కరీంనగర్ జిల్లాలో సేకరించేందుకు గతంలో నోటిఫికేషన్ జారీ చేశారు. జిల్లాలో భూములు సేకరించి అవార్డు పాస్ చేసి మూడేళ్లు దాటినా జాతీయ రహదారి భవనాలశాఖ కొర్రీలతో కాలం వెల్లదిస్తోంది. జిల్లాలో సేకరించిన భూమికి రూ.124 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉండగా.. కేవలం జగిత్యాల, చల్‌గల్, రాజారం, నూకపల్లి, నాచుపల్లి, గౌరాపూర్ గ్రామాల్లోని కొద్ది మంది భూనిర్వాసితులకు రూ.4 కోట్లు పరిహారం చెల్లించి చేతులు దులుపుకున్నారు.

**పట్టించుకోని ప్రజాప్రతినిధులు**పలు గ్రామాలకు చెందిన భూసేకరణ ఫైళ్లను జాతీయ రహదారి భవనాల ప్రాజెక్టు కార్యాలయం నుంచి ఏదో కారణం చూపుతూ జగిత్యాల ఆర్డీవో కార్యాలయానికి తిప్పి పంపిస్తున్నారు. దీంతో భూములు కోల్పోతున్న రైతులు పరిహారంరాక అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. దీంతో అధికారులపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు కార్యాలయంలో ఉన్న పలువురు సిబ్బంది సైతం ఒప్పంద పద్ధతిలో పని చేస్తుండడంతో పట్టనట్లు భావిస్తున్నారు. అత్యంత రద్దీగా ఈ రహదారి నిర్మాణం ప్రాధాన్యత సంతరించుకున్నప్పటికి ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. వెంటనే పనుల్లో చొరవ చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు.. అక్రమ వసూళ్లు

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కోరుట్ల పట్టణంలో మొత్తం 502 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 324 నిర్మాణాలకు సంబంధిత అధికారులు మార్కింగ్ ఇచ్చారు. నిర్మాణాలు వేగంగా చేపట్టేందుకు 33 వార్డులకు అధికారులకు బాధ్యతలు అప్పగించారు. మరోవైపు పలువురు లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం విడతల వారీగా నగదు జమ చేస్తుంది.

**ఓ లబ్ధిదారుడి వద్ద రూ.15 వేలు..**

మూడు రోజుల క్రితం పట్టణంలోని 21వ వార్డులో ఓ లబ్ధిదారు ఖాతాలో నగదు జమ కావడంతో.. వారి వద్ద నుంచి వార్డు అధికారి రూ.15 వేలు వసూలు చేశాడు. ఈ విషయం బయటకు తెలియడంతో సదరు వార్డు అధికారి వెంటనే ఆ నగదును లబ్ధిదారుకు తిరిగిచ్చాడు. మున్సిపల్ అధికారులు వెంటనే దానిపై విచారణ చేపట్టారు. సదరు



వార్డు అధికారి నగదు తీసుకున్న విషయం నిజమేనని.. అయితే ఆ మొత్తం చేబదులుగా తీసుకున్నానని చెప్పాడని తెలిసింది. దీనిపై కమిషనర్ రవీందర్‌ను వివరణ కోరగా.. వార్డు అధికారికి షోకాజు నోటీసులు జారీ చేసి విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని.. వారి ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

**మరికొన్ని సంఘటనలు**

కోరుట్ల మండలంలోని ఓ గ్రామంలో ఇళ్ల లబ్ధిదారుల వద్ద నుంచి రూ.10 వేలను రాజకీయ నాయకులు వసూలు చేసినట్లు తెలిసింది. కొన్ని గ్రామాల్లో లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం మేస్త్రీలతో బేరం కుదుర్చుకొని వారి వద్ద నుంచి కమిషన్ వసూలు చేస్తున్నారని సమాచారం.

**ఇసుక, మట్టి పేరిట..**

నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాలకు ఉపయోగించే ఇసుక, మట్టి సరఫరా పేరిట అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇసుకను ఉచితంగా అందజేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వాగుల్లో విచ్చలవిడిగా జేసీబీలను, కూలీలను ఏర్పాటు చేయించి మరి తవ్వి తరలిస్తున్నారు. లబ్ధిదారులు గుర్తించిన ఇసుక రీచ్‌లకు వెళ్లి తెచ్చుకునే వీలు లేకపోవడంతో వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు అక్రమార్కులు గుట్టలను తవ్వి మట్టిని నిర్మాణాలకు తరలిస్తున్నారు. ఒక్కో మట్టి ట్రిప్పుకు రూ.1200-1500 వరకు లబ్ధిదారుల వద్ద నుంచి దండుకుంటున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

## పరి'శ్రమ'కు ప్రోత్సాహం

ఖమ్మం : ఉత్పాదక రంగంలో పరిశ్రమలను ప్రోత్సహించటంతోపాటు ఉద్యోగ కల్పనను పెంచేందుకు కేంద్రం తీసుకొచ్చిన నూతన పథకమే 'ప్రధానమంత్రి వికసిత్ భారత్ ఉద్యోగ యోజన'. ఈ కార్యక్రమంపై ఉభయ జిల్లాల్లోని పరిశ్రమ నిర్వాహకుల్లో తగిన అవగాహన లేదు. ఈ ఏడాది ఆగస్టు నుంచి జులై 31, 2027 మధ్య కాలంలో పరిశ్రమల్లో కొలువులు పొందినవారికి, కొలువులు ఇచ్చిన పరిశ్రమలకు పథకం వర్తిస్తుంది.

**ఇదీ ఉద్దేశం..**

ఉపాధి అవకాశాల పెంపు, సంస్థల సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం, అన్ని రంగాల్లో సామాజిక భద్రతపై భరోసా కల్పించడం.. దేశవ్యాప్తంగా 1.96 కోట్ల మందికి ప్రయోజనం సమకూర్చాలని భవిష్య నిధి నిర్ణయించింది.

**యాజమాన్యాల అర్హతలు, ప్రయోజనం**

50 మంది ఉద్యోగులు ఉన్న సంస్థలు (కొత్తవైనా, పాతవైనా) 2025 ఆగస్టు, 2027 జులై 31 మధ్య కనీసం ఇద్దరు ఉద్యోగులను నియమించుకోవాలి. 50 మందికి మించి సిబ్బంది ఉంటే కనీసం అయిదుగురికి కొలువులివ్వాలి.

భవిష్య నిధి సేవలను సంస్థపరంగా విధిగా కొనసాగిస్తుండాలి.

సంస్థలకు ప్రోత్సాహకంగా నెలకు రూ.మూడు వేల చొప్పున రెండేళ్లు, తయారీ సంస్థలైతే నాలుగేళ్లపాటు ఇస్తారు.



యజమానులు తమ ఎంప్లాయర్ పోర్టల్‌లో పీఎంవీబీఆర్కే లింక్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలి.

**ఉద్యోగులకు లబ్ధి ఇలా..**

నిర్దుష్ట కాలంలో నియమితులైన ఉద్యోగులకు వార్షిక వేతనంలో నెల జీతం(గరిష్ఠంగా రూ.15వేలు) అందిస్తారు. కాకుంటే ఆరు నెలల పాటు విధిగా పనిచేయాలి.

నెలకు రూ.లక్ష జీతం మించినవారికి పథకం వర్తించదు.

ప్రోత్సాహక మొత్తంలో కొంత పీఎఫ్‌లో జమ చేస్తారు.

'పీఎంవీబీఆర్కే గురించి మరింత సమాచారం కోరుకునే వారు ఖమ్మం నగరం, పాత కార్పొరేషన్ కార్యాలయ భవనంలో ఉన్న భవిష్యనిధి కార్యాలయంలో సంప్రదించవచ్చు.'

సునీల్, భవిష్యత్ నిధి జిల్లా అధికారి

# హుస్సేన్ సాగర్‌లో ఫ్లోటింగ్ గ్రౌండ్.. తొలుత బాక్సు క్రికెట్!

హైదరాబాద్: నీటిపై తేలియాడే మైదానంలో ఫుట్‌బాల్, క్రికెట్ ఆడుతుంటే ఎలా ఉంటుంది.. ఆ ఊహే ఆహా అనిపిస్తోంది కదూ.. ఇప్పటికే సింగపూర్ లాంటి దేశాల్లో పర్యాటకులను ఆకట్టుకునేందుకు ఇలాంటి మైదానాలను అందుబాటులోకి తెచ్చారు. మన భాగ్యనగరంలోనూ ఇలాంటి ఫ్లోటింగ్ గ్రౌండ్‌లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. హుస్సేన్‌సాగర్ చుట్టూ పర్యాటక అభివృద్ధికి ఇప్పటికే ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో అధ్యయనం చేస్తోంది. ఖైరతాబాద్ మెట్రోను కలుపుతూ నెక్లెస్‌రోడ్డు, సంజీవయ్య పార్కు, ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ గార్డెన్, ప్రసాద్ ఐమాక్స్ వరకు దాదాపు 10.5 కిలోమీటర్ల పొడవుతో స్కైవాక్ వంతెన నిర్మాణంపై పరిశీలి



స్తోంది. ఇందులో సైకిల్ ట్రాక్, వాక్‌వే ఉండేలా.. పలుచోట్ల ఎంట్రీలు, ఎగ్జిట్‌లతో పీపీపీ పద్ధతిలో నిర్మించేందుకు ప్రణాళిక చేస్తున్నారు.

**క్రికెట్‌కు ఉన్న ఆదరణతో..** సంజీవయ్య పార్కులో సాగర్‌కు ఆనుకొని నీటిపై ఫ్లోటింగ్ బాక్సు క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు వల్ల పర్యాటకులను ఆకట్టుకోవచ్చునని అధికారులు భావిస్తున్నారు. సింగపూర్ లాంటి దేశాల్లో ఇలాంటి ఫ్లోటింగ్ స్టేడియంలు అందుబాటులో ఉన్నాయి. మన వద్ద క్రికెట్‌కు ఉన్న డిమాండ్ దృష్ట్యా బాక్సు క్రికెట్ గ్రౌండ్లకు ఆదరణ ఉంటుందని హెచ్ఎండీఏకు చెందిన ఓ అధికారి తెలిపారు.

# ఫ్యూచర్ సిటీకి మరో మార్గం!

యాచారం : ప్రభుత్వం తలపెట్టిన భారత్ ఫ్యూచర్ సిటీని నాగార్జునసాగర్– హైదరాబాద్ రహదారితో అనుసంధానానికి కొత్త రహదారి నిర్మించనున్నారు. ఇందుకు సాగ ర్ రహదారి నుంచి తక్కళ్లపల్లి మీదుగా మేడిపల్లి వరకు ఉన్న ఆర్అండ్‌బీ మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరిస్తారు. మేడిపల్లికి ముందు అర కి.మీ. దూరం కొత్త దారి నిర్మించి ఫ్యూచర్ సిటీకి కలుపుతారు. ఫ్యూచర్ సిటీ (అప్పట్లో ఫార్మాసిటీ)ని అనుసంధానం చేస్తూ కందుకూరు (శ్రీశైలం రహదారి)–



యాచారం (నాగార్జునసాగర్ రహదారి) రహదారిని వంద అడుగులు విస్తరించాలని 2020లో ప్రతిపాదించారు. కందుకూరు నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు పూర్తి చేశారు. మిగిలిన పనులు నిలిచిపోయాయి. భూసేకరణ, విద్యుత్ స్తంభాలను పక్కకి మార్చడానికి పెద్దమొత్తం నిధులు అవసరం కావడంతో ఈ భారాన్ని తగ్గించుకునేందుకు తక్కళ్లపల్లి మీదుగా రహదారికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం.

# ప్రైవేటు బడి.. మత్తు అలజడి

హైదరాబాద్: నగరంలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. తాజాగా ఓ ప్రైవేటు పాఠశాలలో అల్ప్రాజోలం తయారీ ఘటనతో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం తెలిసిపోయింది. ఓల్డ్‌బోయిన్‌పల్లిలోని మేధా పాఠశాల ఇందుకు నిదర్శనం. కొన్ని నెలలుగా అల్ప్రాజోలం అనే మత్తు పదార్థాన్ని స్కూలు నిర్వాహకుడుజయప్రకాశ్‌గౌడ్ తయారు చేస్తుంటే అధికారులు గుర్తించలేకపోయారు. పాఠశాల అనుమతి గడువు ముగిసినా హెచ్చరించలేదు.

**ఏడో తరగతి వరకే అనుమతి...**

ఓల్డ్ బోయిన్‌పల్లిలోని మేధా హైస్కూల్‌కు ఎల్‌కేజీ నుంచి ఏడో తరగతి




వరకు మాత్రమే అనుమతి ఉంది. ఇందుకు విరుద్ధంగా పదోతరగతి వరకూ ఉందటూ ప్రచారం చేసుకుంటున్నారు. మేధా స్కూల్‌ను జయప్రకాశ్ గౌడ్ రెండేళ్ల క్రితం లీజుకు తీసుకున్నారు. అరవైమూడు మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుంటున్నారు. తరగతులు ఒకవైపు కొనసాగిస్తూనే కొద్దినెలలుగా అల్ప్రాజోలంను గుట్టుగా తయారు చేస్తున్నారు. పాఠశాలను తనిఖీలు చేయాల్సిన మేడ్చల్ విద్యాశాఖ అధికారులు ఈ పాఠశాలకు రాలేదు.

మండల విద్యాధికారులు లేనందునే..

ప్రతి మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించేందుకు ప్రతి మండలానికి విద్యాధికారి ఉండాలి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఒకటి, రెండు మండలాలు మినహా ఎక్కడా మండల విద్యాధికారులు లేరు. హెడ్‌మాస్టర్లకే అదనంగా బాధ్యతలు అప్పగించారు. ఇదంతా భారంగా మారడంతో కొందరు తనిఖీలకు వెళ్లడం లేదు. మరికొందరు తనిఖీలు నిర్వహించకుండా సంతకాలు చేసి వస్తున్నారు.

# ఆశల తీరం.. 'కూత'వేటు దూరం!



పరిగి : రైల్వేలైన్ నిర్మించి జిల్లా వాసుల కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. దీంతో వెనుకబడిన వికారాబాద్, కొడంగల్ ప్రాంత ప్రజల ఆశలు నెరవేరనున్నాయి. వికారాబాద్ నుంచి నారాయణపేట జిల్లా కృష్ణా(కర్ణాటక సరిహద్దు) వరకు కొత్త రైల్వేలైన్ ప్రాజెక్టు ఎలైన్‌మెంట్ మారడంతో కొడంగల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సొంత నియోజకవర్గం కావడంతో సీఎం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

**పారిశ్రామిక కారిడార్ నేపథ్యంలో..**

రాష్ట్ర ప్రభుత్వం దుద్యాల మండలంలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాంత అభివృద్ధి, రవాణా సదుపాయాల మెరుగుకు రైల్వేలైన్ ఇక్కణ్నుంచి వెళ్లేలా ఎలైన్‌మెంట్ మారుస్తూ రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే మండలంలో రోడ్ల అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. తాజాగా రైల్వేలైన్ రానుండటంతో రవానా మరింత మెరుగు పడనుంది.

**లగచర్ల మీదుగానే..**

కొడంగల్ ప్రాంత యువతకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో దుద్యాల మండలంలో పారిశ్రామికవాడ ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా 1,177.35 ఎకరాలు అవసరం కాగా.. ఇప్పటికే 974 ఎకరాలు సేకరించింది. మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు మీదుగా ఈ రైల్వేలైన్ వెళ్లేలా అలైన్‌మెంట్‌ను మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం ఆ శాఖకు విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా వికారాబాద్, నస్కల్, పరిగి, తుంకిమెట్ల, కొడంగల్, టేకుల్‌కోడ్, మద్దూరు, బాలంపేట, అన్నాసాగర్, నారాయణపేట, మక్తల్ మీదుగా కృష్ణా వరకు అలైన్‌మెంట్ మారుస్తూ రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది.

**సౌకర్యాలు అందుబాటులోకి..**

కొడంగల్ ప్రాంత వాసులు రైల్లో ప్రయాణించాలంటే తాండూరుకు, పరిగి ప్రాంత ప్రజలు వికారాబాద్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఇకపై ఉన్న ఊళ్ల మీదుగానే రైళ్లు వెళ్లనుండడంతో ఆయా ప్రాంతాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరున్నర దశాబ్దాల కల నెరవేరినట్లవుతుంది. ఇండస్ట్రియల్ కారిడార్‌తో యువతకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగు పడేందుకు మార్గం సుగమం కానుంది. ఉద్యోగుల రాకపోకలకు రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

**సాధించి తీరుతాం..: డా.టి.రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే**

రైల్వేలైన్ నిర్మాణం జిల్లా ప్రజల చిరకాల వాంఛ. ఎట్టి పరిస్థితుల్లో సాధించి తీరుతాం. రవాణా మార్గం మెరుగు పడితే పరిగి నియోజకవర్గం అభివృద్ధికి సోపానంగా మారుతుంది. యువతకు అవకాశాలు మెరుగుపడతాయి.

# తల్లీ బిడ్డా.. ఆరోగ్యంగా ఉండేలా!



కరీంనగర్ : మాతా శిశు సంరక్షణ చేస్తూ ఆరోగ్యవంతమైన దేశ నిర్మాణమే లక్ష్యంగా ఏటా పోషణ్ అభియాన్ మాసోత్సవం నిర్వహిస్తున్నారు. ఈనెల 17 నుంచి అక్టోబరు 16 వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నెల రోజులపాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆహారం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారంపై విస్తృత అవగాహన కల్పిస్తారు. వోకల్ ఫర్ లోకల్ నినాదంతో గ్రామీణ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ మెరుగైన ఆహారపు అలవాట్లపై తెలియజేస్తారు.

**నాలుగు వారాల కార్యాచరణ ఇలా..**

మొదటి : అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, పాలిచ్చే తల్లులతో పిల్లల పోషణపై సలహా సమావేశం నిర్వహిస్తారు. మహిళలతోపాటు పురుషులకు వంటల పోటీలు నిర్వహిస్తారు. బాలికలు, మహిళలకు బీఎంఐ పరీక్షలు, పిల్లల బరువు, ఎత్తు కొలిచి పోషకాహార ప్రతిజ్ఞలు చేయిస్తారు. స్థానిక ఉత్పత్తుల గురించి అవగాహన కల్పిస్తారు.

రెండో : బిడ్డకు అందించే ముర్రు పాల విశిష్టత, అనుబంధ ఆహారంతో పాటు ఆరోగ్యకరమైన జీవన శైలి, ఆహారపు అలవాట్లపై అవగాహన సమావేశాలు నిర్వహిస్తారు. పోషణలో తండ్రుల భాగస్వామ్యం, బిడ్డ మొదటి వెయ్యి రోజుల్లో మెదడు అభివృద్ధిపై తెలియజేస్తారు.

మూడో : అతి తీవ్ర పోషణ లోపమున్న పిల్లలకు ఆకలి పరీక్షలు నిర్వహిస్తారు. గ్రోత్ మానిటరింగ్‌లో హాజరుకాని పిల్లల బరువు, ఎత్తులను కొలుస్తారు. పోషణ లోపం ఉన్న పిల్లల ఇళ్లకు ఆశా కార్యకర్తలు వెళ్లి వివరాలను సేకరిస్తారు.నాలుగో : మంచినీరు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, తక్కువ చక్కెర, నూనెలతో తయారు చేసే వంటకాలను ప్రదర్శిస్తారు. ప్లాస్టిక్ సంచులు, వ్యర్థాల నిర్వహణ గురించి వివరిస్తారు. పాఠశాలల్లో వ్యాసరచన, క్రీడా పోటీలు పెట్టి బహుమతులు అందజేస్తారు. కిచెన్ గార్డెన్ల ఏర్పాటు, కిశోర బాలికలకు రక్తహీనత పరీక్షల నిర్వహణ, రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తారు. **విస్తృత ప్రచారం చేపడతాం**నెలరోజులపాటు పోషకాహారం ప్రాధాన్యంపై విస్తృత ప్రచారం చేపడతాం. నిర్వహణకు ఒక్కో ప్రాజెక్ట్‌కు రూ.30 వేలు, జిల్లాకు రూ.50 వేల నిధులు కేటాయించారు. కార్యాచరణ ప్రకారం అంగన్‌వాడీ సిబ్బంది విధిగా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆదేశించాం. – సరస్వతి, కరీంనగర్ జిల్లా సంక్షేమ అధికారిణి

# బడి బాధ్యత మనదే..



వెల్గటూరు : విద్యార్థుల్లో నాయకత్వం, క్రమశిక్షణ, జట్టు పని, బాధ్యతాయుత ప్రవర్తనను పెంపొందించడానికి పాఠశాల విద్యాశాఖ పరిధిలో పాఠశాలల్లో విద్యార్థి సమూహాలుగా విద్యార్థి మండలి(స్కూల్ హౌజెస్) ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు సమగ్రశిక్షా రాష్ట్ర ప్రాజెక్టు సంచాలకుల ద్వారా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

**ఏర్పాటు ఇలా..**ప్రాథమికోన్నత స్థాయి నుంచి ఆపై తరగతులున్న పాఠశాలల్లో విద్యార్థులను నాలుగు బృందాలుగా ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి గ్రూపునకు పాఠశాలలోని పెద్ద తరగతి నుంచి కెప్టెన్‌ను, రెండో పెద్ద తరగతి నుంచి వైస్ కెప్టెన్‌ను చొప్పున ఎనిమిది మందిని ఎంపిక చేస్తారు. వీరిలో ఒకరు బాలుర నుంచి ఉంటే మరొకరు బాలికల నుంచి ఉండాలి. వీరి ఎంపికకు సంబంధించి ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. వీటికి ప్రముఖుల పేర్లు పెట్టారు. ఒక్కో గ్రూపులోని నాయకుడికి హెచ్‌ఎం నిధి నుంచి ఒక్కో రంగు యూనిఫాం కేటాయించారు. ప్రతి నెలా మూడో శనివారం మండలి సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చిస్తారు.

**నిర్వహణ..**సమూహ నాయకులు తమ బృందంలోని విద్యార్థుల హాజరు పర్యవేక్షించాలి. స్కూల్ అసెంబ్లీ నిర్వహణ, మధ్యాహ్న భోజన పర్యవేక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత పరిశీలన, క్రమశిక్షణ, జట్టు పని ప్రోత్సాహం, వ్యక్తిత్వ వికాసం, సహ పాఠ్య కార్యక్రమాలు వంటి విధులు నిర్వహించాలి. పర్యావరణ, బాలికా సాధికారత–కౌమార భద్రత, ప్రహరీ, లైబ్రరీ–సాహిత్య–సాంస్కృతిక, క్రీడలు–ఆరోగ్యం–పరిశుభ్రత వంటి వివిధ విద్యార్థి క్లబ్‌లతో ఏకీకరణ జరిపి కార్యక్రమాలను చేపట్టాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాల నిర్వహణను విజయవంతం చేయాలి. **అవార్డులు**ఈ నెల 16 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 23 పాఠశాల చివరి పనిదినం వరకు కార్యకలాపాలు నిర్వహించాలి. ఫిబ్రవరి 15కు ముందు అవార్డుల వేడుక నిర్వహించనున్నారు. హాజరు, విద్యార్థుల పనితీరు, సమయ పాలన, కార్యకలాపాల అమలు, సానుకూల ప్రవర్తన తదితర అంశాలలో మూల్యాంకనం ఆధారంగా ఒక్కో హౌజ్‌కు అవార్డులను అందించనున్నారు.

# ఆదరణ లేక.. సీట్లు నిండక

వికారాబాద్ : సాంకేతిక రంగంవైపు విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. ఏదో ఓ రంగంలో నైపుణ్యం సాధిస్తే జీవితంలో స్థిరపడొచ్చని అటువైపు పరుగులు తీస్తున్నారు. దీంతో డిగ్రీ కళాశాలల్లో సీట్లు భర్తీ కావడం లేదు. జిల్లాలోని ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు భర్తీ చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. విద్యార్థుల్లో ఉన్న అభిప్రాయాన్ని మార్చాలన్న ఉద్దేశంతో కళాశాల విద్యాశాఖ కొత్త కోర్సులు తీసుకొచ్చినా ప్రవేశాలు మాత్రం పెరగటం లేదు. జిల్లాలో భారీగానే సీట్లు మిగులుతున్నాయి. దీంతో ఈనెల 16వ తేదీన డిగ్రీ ప్రథమ సంవత్సరానికి తక్షణ ప్రవేశాలు నిర్వహిస్తున్నారు. 15వ తేదీన ఈ కార్యక్రమం కొనసాగింది.

**జిల్లాలో నాలుగు కళాశాలలు..**

జిల్లాలో నాలుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలున్నాయి. వాటిలో ప్రథమ సంవత్సరంలో 1,680 సీట్లు కేటాయించారు. ఇందులో 500 మాత్రమే భర్తీ అయ్యాయి. జిల్లాలోని అన్ని కళాశాలల్లో చాలావరకు నిండలేదు. జిల్లాలోని ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో మూడు కళాశాలలున్నాయి. కొడంగల్ మాత్రం పీయూ పరిధిలో ఉంది. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలోని వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో




420 సీట్లుకు 113 మాత్రమే భర్తీ అయ్యాయి. తాండూరు డిగ్రీ కళాశాలలో 480 సీట్లకు 164 భర్తీ అయ్యాయి. విద్యారణ్యపురి ప్రాంతం పరిగిలోని డిగ్రీ కళాశాలలో 300కు కేవలం 29 మాత్రమే నిండాయి. కొడంగల్ డిగ్రీ కళాశాలలో 480కి 194 భర్తీ అయ్యాయి. తక్షణ ప్రవేశాలను ప్రభుత్వ నిబంధనల మేరకు భర్తీ చేస్తామని సంబంధిత డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. సీట్ల కేటాయింపులో రిజర్వేషన్లు ఉంటాయని, దాని ప్రకారం పూరిస్తామన్నారు.

**అప్రెంటీస్‌షిప్ కోర్సులపై ఆసక్తి..**

డిగ్రీ కోర్సు పూర్తి చేసిన తరవాత ఉపాధి అవకాశాలు తక్కువగా ఉంటున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని కళాశాల విద్యాశాఖ అప్రెంటీస్‌షిప్ అనుసంధాన కోర్సులను ప్రవేశపెడితే బాగుంటుందని విద్యార్థులు అంటున్నారు. ఈ కోర్సులను పూర్తి చేస్తే డిగ్రీ పూర్తయ్యాక ఉపాధి అవకాశాలు అధికంగా ఉంటాయని వారు అంటున్నారు.

# గుర్రుమంటూ.. పిక్కలపై కాటు

హైదరాబాద్: నగరంలో కుక్కకాట్లతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. బాధితులతో నల్లకుంటలోని ఫీవర్ ఆసుపత్రి నిండిపోతోంది. శివార్ల నుంచి కూడా ఎక్కువ మంది బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. ఈ నెలలో 14 రోజుల్లోనే 1,340 మంది కుక్కకాట్ల బారిన పడి ఆసుపత్రిలో చేరారు. రోజుకు సరాసరి 95 మంది బాధితులుగా మారుతున్నారు. నారాయణగూడ ఐపీఎంలో నిత్యం 300 మంది రేబిస్ వ్యాక్సిన్ తీసుకుంటున్నారు. బాధితుల్లో ఎక్కువ శాతం



చిన్నపిల్లలు ఉంటున్నారు. రోడ్ల పక్కన చెత్తచెదారం, మాంసపు వ్యర్థాలు పారబోయడంతో అవి తింటూ అక్కడే తిష్ఠ వేస్తు పిల్లలు, వృద్ధులపై దాడి చేస్తున్నాయి. నిర్లక్ష్యం చేయొద్దు.. కుక్క కరిచిన తర్వాత చిన్న గాయమని నిర్లక్ష్యంగా ఉంటే.. అది రేబిస్‌కు దారి తీస్తుంది. కుక్క గోళ్లు తాకి చిన్న చిన్న గాయాలైన సరే ఇంట్లో తిడతారని పిల్లలు చెప్పకుండా దాచేస్తుంటారు. తల్లిదండ్రులు గుర్తిస్తే వెంటనే వైద్యుల వద్దకు తీసుకెళ్లి రేబిస్ వ్యాక్సిన్ ఇప్పించాలి. పెంపుడు కుక్క అయినా సరే.. రేబిస్ టీకా ఇప్పించాలి. వీధిలో కుక్కల సమస్య ఉంటే.. జీహెచ్ఎంసీ నంబరు 0402111 1111కు ఫిర్యాదు చేయాలి.

# ఏరియా భవిష్యత్తు ప్రశ్నార్థకం?

మణుగూరు : మణుగూరు ఏరియా భవిష్యత్తు ప్రశ్నార్థకం కానుంది. బొగ్గు గనుల జీవితకాలం ఆరేళ్లు మాత్రమే ఉంటుందని, ఏరియా, ఓసీలు, కోల్ బ్లాకులు భవిష్యత్తులో ఉండబోవని సింగరేణి సీఎండీ బలరాం చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. కొత్త బొగ్గు గనులు ప్రారంభించాలని కార్మికులు, కార్మిక సంఘాలు కోరుతున్న సమయంలో సీఎండీ వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. కార్మికులు, వారి కుటుంబీకులు సుమారు 5 నుంచి 6 వేల మంది, ఒప్పంద కార్మికులు 1,000 మంది వరకు ఉన్నారు. ప్రధానంగా వీరిపై ప్రభావం పడనుంది. **ఎందుకంటే..?**మణుగూరు ఏరియాలో ఓసీ–2, ఓసీ–4, మణుగూరు ఓసీ, కొండాపురం భూగర్భ గనులు ఉన్నాయి. ఓసీ–2, ఓసీ–4ను కలిపి పీకే ఓసీ గనులుగా పిలుస్తారు. పీకేఓసీ నుంచి రోజుకు 25 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతోంది. మణుగూరు ఏరియాకు ఏడాదికి 115 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం ఉంటే.. అందులో పీకే ఓసీ గనుల నుంచే ఏడాదికి 105 లక్షల టన్నుల ఉత్పత్తి అవుతుంది. వీటి జీవితకాలం మరో ఆరేళ్లు మాత్రమే ఉంది. ఆ తర్వాత గనిని విస్తరించాలంటే కేంద్రం నిర్వహించే వేలంలో సింగరేణి సంస్థ పాల్గొని దక్కించుకోవాల్సి ఉంటుంది. కొండాపురం భూగర్భ గని నుంచి రోజుకు 500 టన్నుల మంచి బొగ్గు ఉత్పత్తి కావటం లేదు. మణుగూరు ఏరియా భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకోనున్నాయి.ఓసీ గని జీవితకాలం ఏడాది మాత్రమే ఉండటంతో విస్తరించేందుకు సింగరేణి ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అందుకు భూసేకరణ పనులు జరుగుతున్నాయి. దీని జీవితకాలం 20 ఏళ్లు ఉన్నా ప్రయోజనం అంతంతమాత్రమే. రోజుకు 5–6వేల టన్నుల బొగ్గను మాత్రమే ఉత్పత్తి చేయనున్నారు. ఏరియాగా మనుగడ సాగించాలంటే ఎక్కువ సంఖ్యలో గనులు సింగరేణి ఆధ్వర్యంలో ఉండాలి.

చురకలు



# సాగునీరు వృథా.. ఎవరికీ పట్టదా?

ఎల్లారెడ్డిపేట : ఎగువ ప్రాంతంలో కురిసే వర్షాలకు వరదనీరు పారే కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. అనేకచోట్ల ప్రధాన కాలువల్లో భారీగా పూడిక పేరుకుపోయింది. పనికిరాని మొక్కలు, గడ్డి ఏపుగా పెరిగింది. దీంతో ఎక్కడికక్కడే నీరు వృథాగా బయటకు వెళుతోంది. శిథిలావస్థకు చేరిన కాలువల గుండా నీరు సక్రమంగా రాకపోవడంతో నీటి వనరులకు శాపంగా పరిణమిస్తోంది. చెరువులు, కుంటలు నిండే పరిస్థితి కనిపించడంలేదు. కాలువల మరమ్మతులపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

**ఆయకట్టు భూములకు ఆధారం**

2 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఎగువ మానేరు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో జలకళను సంతరించుకొని నిండుకుండను తలపిస్తోంది. మత్తడి దూకుతుండటంతో అత్యధికంగా నీరు మానేరు వాగులో కలిసిపోతోంది. అయితే ఎగువ మానేరు మత్తడి పారితే వచ్చే నీటిని సముద్రలింగాపూర్ శివారులోని సింగసముద్రం చెరువులోకి మళ్లించేందుకు గొల్లకేతమ్మ ఆలయ ప్రాంతంలో రెండు గేట్లను అమర్చారు. సింగసముద్రం చెరువు కింద 2232 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ చెరువుకు రెండు తూములుండగా.. ఒకదాని ద్వారా రాచర్ల



బొప్పాపూర్ శివారులోని జక్కుల చెరువుకు, మరొక తూము ద్వారా ఆయకట్టు భూములకు సాగునీరు వెళుతుంది.

**మూడు తటాకాలకు ఊపిరి**

ఇంతటి ప్రాధాన్యమున్న నీటి వనరులకు మరమ్మతు చేసిన దాఖలాలు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జక్కుల చెరువు మత్తడి పారితే గొల్లపల్లి పరిధిలోని గాలం చెరువు, అక్కడి నుంచి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని 600 ఎకరాల ఆయకట్టు ఉన్న గిద్దె చెరువుకు వరద నీరు ప్రవేశిస్తుంది. **అధికారులు స్పందించాలి– బాలయ్య, రైతు, రాచర్ల బొప్పాపూర్** ఎగువమానేరు మత్తడి పారితే గొల్లకేతమ్మ ఆలయం వద్ద తూము నుంచి సింగసముద్రంలోకి నీటిని విడుదల చేయొచ్చు. ప్రస్తుతం ఒక తూము ద్వారా నీరు వస్తోంది. కొన్నేళ్లుగా కాలువల నిర్వహణ లేక నీరంతా వృథా అవుతోంది. గొల్లకేతమ్మ ఆలయం వద్దనున్న తూము వద్ద నీరు అనవసరంగా బయటకు పారి మానేరు వాగులో కలుస్తోంది. అధికారులు వెంటనే సింగసముద్రం చెరువులోకి నీరు వచ్చేలా చూడాలి.

# వంతెన నిర్మాణం.. ఇంకెంత కాలం

గంభీరావుపేట : గంభీరావుపేట పరిధిలోని హై లెవల్ వారధి నిర్మాణానికి నిధులు మంజూరై దాదాపు రెండేళ్లు గడుస్తున్నా గుత్తేదారు నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఉన్న మట్టి రోడ్డు మానేరు మత్తడి దూకడంతో కొట్టుకుపోయింది. మూడు రోజుల నుంచి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

**రూ.10 కోట్లతో పనులు**

గంభీరావుపేట నుంచి లింగన్నపేటకు వెళ్లే ప్రధాన రహదారిలో మానేరు వాగుపై లో లెవల్ వంతెన ఉంది. ప్రతి ఏటా వానాకాలంలో మానేరు మత్తడి దూకడంతో అది మునిగిపోతుంది. దీంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ హైలెవల్ వంతెనకు రూ.10.60 కోట్లు నిధులు మంజూరు చేసి.. 2023, సెప్టెంబర్‌లో పనులకు శంకుస్థాపన చేశారు.

**సిద్దిపేటకు ఇదే మార్గం**

చాలాచోట్ల వాగులపై హైలెవల్ వంతెన నిర్మాణం జరిగే సమయంలో లోలెవల్ వంతెనను అలాగే ఉంచి పక్కన నిర్మిస్తారు. ఇక్కడ అలా చేయకుండా ఉన్న లోలెవల్ వంతెనను పూర్తిగా తొలగించారు. పైపులు వేసి పక్కన మట్టి రోడ్డు వేశారు. గతేడాది వర్షాకాలం అది పూర్తిగా



కొట్టుకుపోయి దాదాపు 15 రోజులపాటు రాకపోకలు నిలిచిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు సైతం అదే పరిస్థితి నెలకొంది. ఈనెల 19న మానేరు జలాశయం మత్తడి దూకడంతో మట్టి రోడ్డు రెండు చోట్ల తెగిపోయింది. దీంతో సిద్దిపేట, ముస్తాబాద్, కొత్తసల్లి, లింగన్నపేటకు రాకపోకలు నిలిచిపోయాయి.

**రెండేళ్లుగా పిల్లర్ల దశలోనే..**

రెండేళ్లుగా పనులు పిల్లర్ల దశలోనే ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వాహనదారులు మండిపడుతున్నారు. 11 పిల్లర్లకుగాను ఎనిమిది పిల్లర్ల పనులు మాత్రమే జరుగుతున్నాయి. వర్షాలు పడటంతో గుత్తేదారు పనులను నిలిపివేశారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని వారధి నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**ప్రవాహం తగ్గగానే రోడ్డు నిర్మిస్తాం**

– నిఖిల్, ఆర్‌ఐండ్‌బీ ఏఈ

వరద ప్రవాహం పూర్తిగా తగ్గగానే తెగిన చోట మళ్లీ మట్టి రోడ్డు వేసి.. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం. వారధి నిర్మాణం వెంటనే పూర్తయ్యేలా గుత్తేదారుతో మాట్లాడుతాం. పూర్తి చేయించేలా చొరవ తీసుకుంటాం.

# వరద గోదారి.. ఆయకట్టు తడారి!



సారంగాపూర్ : గోదావరి వృథా నీటిని అడ్డుకునేందుకు బ్యారేజీల నిర్మాణాలు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీర్‌పూర్‌లోని పలు ప్రాంతాల్లో అనువైన ప్రాంతాలను అధికారులు సర్వే చేసి ప్రతిపాదనలు తయారు చేశారు. నీటికి అడ్డుకట్ట వేస్తే కలిగే ప్రయోజనాలపై మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పలుమార్లు సీఎం, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ నిధులు మంజూరు కాకపోవడంతో ప్రస్తుతం గోదావరి నీరు వృథా అవుతోంది. దీంతో వేసవిలో పొలాలకు నీరందించే ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారుతున్నాయి. పలు ఎస్సారెస్పీ కాలువల మరమ్మతులు లేకపోవడంతో పై ప్రాంతంలో నీరు వృథాగా వెళుతుండగా.. చివరి ఆయకట్టుకు నీరందక రైతులు అవస్థలు పడుతున్నారు.

**గుత్తేదారులకే ప్రయోజనం**

బీర్‌పూర్‌లోని రంగసాగర్, చిత్రవేణిగూడెం, తాళ్లధర్మారం గ్రామాల్లో 1988లో రూ.15 లక్షలతో ఎత్తిపోతల పథకాలను ప్రారంభించారు. ఏడాదికే పైపులైన్లు పగిలిపోయి పథకాలు నిలిచిపోయాయి. ఆ తరువాత పలుమార్లు నిధులు మంజూరు చేసినా గుత్తేదారులకు లాభం చేకూరిందే తప్ప రైతులకు ప్రయోజనం లేదు. ప్రస్తుతం ఆయా పథకాలకు మళ్లీ రూ.60 కోట్ల చొప్పున మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు.

**వేటికి ఎంతంటే..**

రంగపేట ఊరకుంటకు రూ.కోటి, బీర్‌పూర్‌లోని అరగుండాల ప్రాజెక్టు కాలువ లైనింగ్‌కురూ.2.75 కోట్లు, కమ్మునూర్ రావికుంటకు రూ.3.50 కోట్లు, సారంగాపూర్ చింతల చెరువులోకి ఎస్సారెస్పీ కాలువ నీటి మళ్లింపునకు రూ.20 కోట్లు, డీ–53, 12–ఎల్ పరిధిలో కాలువలు, తూముల మరమ్మతులకు 1.50 కోట్లు అవసరమవుతాయని అధికారులు నివేదించారు.

**రెండు మండలాలకు ఆదరువు**

గోదావరిపై రెండు బ్యారేజీలు నిర్మిస్తే బీర్‌పూర్, ధర్మపురి రైతులకు సాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండనుందని అధికారులు సర్వే నిర్వహించారు. ఇందులో బీర్‌పూర్‌లోని చిన్నకొల్వాయి, రంగసాగర్ వద్ద మొసల్ల మడుగు ప్రాంతాలు బ్యారేజీ నిర్మాణాలకు అనువుగా ఉంటాయని ప్రతిపాదనలు తయారు చేశారు. ఆయా నిర్మాణాలకు రూ.275 కోట్ల చొప్పున నిధులు అవసరమని నివేదించారు. బ్యారేజీ నిర్మాణాలతో నీటి నిల్వతో పాటు గోదావరి తీరం వెంట ఉన్న ఎత్తిపోతల పథకాలకు నీటి సమస్య తొలగనుంది.

# ఇందిరమ్మ ఇళ్ల పేరు.. అక్రమార్కుల తీరు



పెద్దపల్లి : జిల్లాలో అవకాశం ఏదైనా సొమ్ము చేసుకోవడంలో అక్రమార్కులు ముందుంటున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన మొరం, ఇసుకను ఉచితంగా అందిస్తుండగా ఇదే అదనుగా దందాకు తెరలేపారు. నిన్నటి వరకు ఇసుక రవాణా చేసిన వారే మానేరులో ప్రవాహం పెరగడంతో మట్టి రవాణాపై కన్నేశారు. గుట్టుగా సాగుతున్న ఈ వ్యవహారంపై మైనింగ్ అధికారులు దృష్టిసారించారు. పెద్దపల్లి మండలంలోని తుర్కలమద్దికుంటలో గ్రామంలో గురువారం దాడులు నిర్వహించి రెండు పొక్లెయిన్‌లను సీజ్ చేయగా అక్రమం వెలుగులోకి వచ్చింది.

**రెండింటికే అనుమతి ఉండగా..**

జిల్లాలో ప్రస్తుతం పెద్దపల్లి మండలంలోని తుర్కలమద్దికుంట, ధర్మారం మండలంలోని మల్లాపూర్ క్వారీలకే అనుమతి ఉంది. కానీ జిల్లాలో పలు గ్రామాలలో అనేక అనధికారిక క్వారీలున్నాయి. ముఖ్యంగా గుట్టబోరు ప్రాంతాల్లోనే అక్రమ దందా జోరుగా సాగుతోంది. తాజాగా తుర్కలమద్దికుంటలో కూడా అనుమతించిన ప్రాంతంలోకాకుండా గుట్టకు మరోవైపు మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. రాఘవపూర్, అందుగులపల్లి, కన్నాల, కుమ్మరికుంట, భూపతిపూర్ ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు అధికంగా జరుగుతున్నాయి. గత వేసవిలో పెద్దకల్వలలోని హుస్సేన్‌మియా వాగులోనూ మట్టి తవ్వకాలు చేపట్టారు. ఈ మట్టి యావత్తు రహదారులు, ఇళ్ల నిర్మాణాలు, స్థిరాస్తి వెంచర్లకు అధికంగా వినియోగిస్తున్నారు.


**రెండు పొక్లెయిన్‌లు సీజ్**

పెద్దపల్లి మండలంలోని తుర్కలమద్దికుంట వద్ద అనుమతి లేని క్వారీ నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న వ్యవహారంపై జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాస్ గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. మట్టి రవాణాదారులు పొక్లెయిన్‌లు వదిలేసి పారిపోగా అధికారులు వాటిని స్వాధీనం చేసుకొని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు మైనింగ్ ఏడీ తెలిపారు.

**ఇసుకతోపాటు..**

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఉచితంగా లభిస్తున్న మానేరు ఇసుకను రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసి దూర ప్రాంతాలకు తరలించగా ఇటీవల కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలాల్లో రెవెన్యూ అధికారులు తనిఖీలు చేసి పట్టుకోవడం తెలిసిందే. తాజాగా ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన మొరాన్ని తీసుకునేందుకు ప్రభుత్వం ఆంక్షలు తొలగించడంతో వివిధ అనధికారిక క్వారీల నుంచి మట్టిని జోరుగా తరలిస్తున్నారు.

# అందుబాటులోకి ‘క్రిటికల్ కేర్’ సేవలు



గోదావరిఖని : అత్యవసర వేళల్లో మెరుగైన వైద్య సేవలందించి ప్రాణాపాయ స్థితి నుంచి ప్రజలను కాపాడాలనే లక్ష్యంతో గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి ఆవరణలో చేపట్టిన ‘క్రిటికల్ కేర్’ భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. జిల్లా పాలనాధికారి ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సంబంధిత అధికారులు, గుత్తేదారును ఆదేశిస్తుండడంతో పనులు వేగవంతమయ్యాయి. పక్కనే ఉన్న రాజీవ్ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ప్రాథమిక వైద్యం అందించి కరీంనగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలించాల్సి వస్తోంది. దూరాభారంతో పాటు అక్కడికి వెళ్లేసరికి ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలున్నాయి. ఈ నేపథ్యంలో గోదావరిఖనిలో క్రిటికల్ కేర్ సేవలను అందుబాటులోకి తెస్తే ప్రాణాపాయ స్థితి నుంచి పలువురిని కాపాడవచ్చనే సంకల్పంతో తెలంగాణ ఆరోగ్య, మౌలిక వసతుల కల్పన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ భవన నిర్మాణ పనులు చేపట్టారు.

**పడకలు 50.. విస్తీర్ణం 40 వేల చ.అడుగులు**

రెండంతస్తుల్లో 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 50 పడకల సామర్థ్యంతో చేపట్టిన క్రిటికల్ కేర్ భవన నిర్మాణ పనులు తుదిదశకు చేరుకొన్నాయి. రూ.10 కోట్లతో భవన నిర్మాణ పనులు పూర్తికానుండగా మరో రూ.13.75 కోట్లతో ప్రమాదబాధితులతో పాటు ఇతరులకు అత్యవసరంగా అత్యాధునిక వైద్య సేవలందించేందుకు అవసరమైన వైద్య సామగ్రి, సదుపాయాలను అందుబాటులోకి తేనున్నారు. ఈ నెలాఖరులోగా భవన నిర్మాణ పనులు పూర్తికానుండగా సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి సారించారు. గోదావరిఖనిలో క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులోకి వస్తే ప్రమాదబాధితులకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. ప్రాణాపాయ స్థితి నుంచి తప్పించుకునే అవకాశముండడంతో పాటు హైదరాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే భారం తప్పనుంది. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గుండెపోటు మరణాలు సైతం అత్యధికంగా ఉన్న నేపథ్యంలో క్రిటికల్ కేర్ భవనం ఆవరణలో క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటు చేసి అత్యవసర వైద్య సేవలను అందుబాటులోకి తేవడంతో మరణాలను కొంత మేరకు నివారించే అవకాశముంది.

# ప్రచార ఘనం.. ఆచరణ శూన్యం

గోదావరిఖని : రామగుండం నగరపాలికలో పారిశుద్ధ్య నిర్వహణ కొంత మెరుగైనప్పటికీ ఇంటింటికీ తడి, పొడి చెత్త సేకరణ మాత్రం ప్రచారానికే పరిమితమవుతోంది. చెత్త సేకరణ తరలింపు కోసం కొనుగోలు చేసిన అత్యాధునిక వాహనాలు తుప్పు పట్టిపోతున్నాయి. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కావడంతో సుమారు రూ.83 కోట్లతో 15 ఎకరాల విస్తీర్ణంలోని రామగుండం ఎరువుల కర్మాగారం స్థలంలో పనులు చేపడుతున్నారు. రికార్డుల ప్రకారంగా సుమారు 395 మంది వివిధ స్థాయిల్లో పారిశుద్ధ్య కార్మికులుండగా వందకు పైగా కార్మికులు ఇతర విధుల్లో ఉంటున్నారు.

**నిత్యం 120 మెట్రిక్ టన్నులు..**

నగరంలోని వివిధ కాలనీల నుంచి నిత్యం 120 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. కేవలం కూరగాయల మార్కెట్ నుంచి వెలువడే దాదాపు 2 మెట్రిక్ టన్నుల తడి చెత్తను మాత్రమే గౌతమినగర్‌లోని చెత్త నిర్వహణ కేంద్రానికి తరలించి సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నారు.



**ఆటోలతోనే..** పారిశుద్ధ్య నిర్వహణకు రూ.5 కోట్లు వెచ్చించి వాహనాలను కొనుగోలు చేసినప్పటికీ అక్రమాలు నెలకొన్నాయనే ఆరోపణలపై విజిలెన్సుతో పాటు అంతర్గత విచారణ కొనసాగుతోంది. డీజిల్ వినియోగంలోనూ అక్రమాలు నెలకొన్నాయి. నగరపాలికలో 60 డివిజన్లుండగా కేవలం 53 ఆటో ట్రాలీలు మాత్రమే ఉండగా తరచూ ఒకటి రెండు మరమ్మతుల్లోనే ఉంటాయి. మొత్తం 13 ట్రాక్టర్లతో నగరంలో చెత్త సేకరణ కొనసాగుతోంది. చెత్త తరలించే వాహనాలను జీపీఎస్ విధానంతో పర్యవేక్షిస్తున్నారు.

**సేంద్రియ ఎరువు తయారీపై అవగాహన**

– జె.అరుణశ్రీ, జిల్లా అదనపు పాలనాధికారిణి

సేంద్రియ ఎరువు తయారీపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. డంపింగ్ యార్డులోనే తడి, పొడి చెత్త నిర్వహణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం. దీంతో చెత్త నిర్వహణ మరింత మెరుగుపడుతుంది.

# కట్టలు బలహీనం.. తెగితే ప్రమాదం!

మంచిర్యాల : ఇది నెన్నెల మండలం కోనంపేట గ్రామంలోని కొత్తచెరువు. ఇటీవల కురిసిన వర్షాలకు కట్ట తెగి నీరు కిందికి పోయింది. కట్ట బలహీనంగా ఉండటంతో ఇలా జరిగింది. ప్రస్తుతం దీనికి తాత్కాలిక మరమ్మతులు కొనసాగుతున్నాయి.

చెరువుల మరమ్మతులు, పటిష్ఠతకు గతేడాది అంతంతమాత్రంగానే నిధులు విడుదలయ్యాయి. గతేడాది, ఈ సంవత్సరం కురిసిన భారీ వర్షాలతో జిల్లాలోని చెరువులకు అక్కడక్కడ గండ్లు పడ్డాయి. పలు చోట్ల కట్టలు బలహీనంగా ఉండటం, తూములు శిథిలమై మరమ్మతులు లేక ప్రమాదకరంగా మారాయి. తూములకు పక్కన నిర్మించిన రక్షణ గోడలు కూలిపోయాయి. నీటిని వదిలేందుకు, మూసేందుకు అవసరమైన రాడ్లు సైతం శిథిలమయ్యాయి. తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి నెట్టుకొస్తున్నారు. శాశ్వత పనులు చేయిస్తేనే ప్రయోజనకరంగా ఉంటుంది.

**ముందు జాగ్రత్తలు తీసుకుంటేనే..**

భారీ వర్షాలు పడితే కొన్ని చోట్ల చెరువులకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన దృశ్య సమీక్షలో అధికారులు జిల్లాలోని చెరువుల పరిస్థితిని వివరించారు. కొన్నేళ్లుగా ఆధునికీకరణకు నిధులు రాక తూములు, అలుగులు, చెరువుల నుంచి పొలాలకు వెళ్లే కాలువలకు మరమ్మతులు చేపట్టలేదు. చాలా చోట్ల కాలువల్లో పూడిక తొలగించక ఆయకట్టు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

**ప్రతిపాదనలు..** జిల్లాలో సుమారుగా 50 చెరువులకు మరమ్మతులు అవసరం ఉన్నా ఎక్కువగా ఇబ్బంది ఉన్న 8 చెరువులను గుర్తించి వీటి కోసం ప్రతిపాదనలు పంపారు. భీమిని మండలంలో 3, నెన్నెలలో 2, తాండూరు, కన్నెపల్లి, బెల్లంపల్లిలో ఒక్కోటి చొప్పున మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపారు. ఈ విషయంపై జిల్లా నీటి పారుదల శాఖ ఈఈ రామును సంప్రదించగా.. ప్రస్తుతం అవసరం ఉన్న దగ్గర తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టామని, నిధులు రాగానే శాశ్వత పనులు చేయిస్తామన్నారు.

ఇది దండేపల్లి మండల కేంద్రంలోని ఎర్రగుంట చెరువు. తూములు శిథిలమయ్యాయి. రక్షణ గోడలు శిథిలం కావడంతో వరదలు వస్తే ప్రమాదం పొంచి ఉంది.

**జిల్లాలో ఇదీ పరిస్థితి..**

జిల్లాలో చెరువులు : 634

పూర్తి ఆయకట్టు : 62,138

సాగవుతున్న ఆయకట్టు : 40 వేలు

# బీమా లేదాయె.. పరిహారం రాదాయె!

మంచిర్యాల : ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికందకుండానే పోతున్నాయి.. అయితే అతివృష్టి లేదా అనావృష్టి కారణంగా రైతులు ఏటా నష్టపోతున్నారు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేయాల్సిన పంటల బీమా పథకం పత్తా లేకపోవడంతో.. నష్టపరిహారం పైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. గతేడాది నష్టానికే ఇంతవరకు మంజూరు కాకపోవడంతో నిరీక్షణ తప్పడం లేదు. ఈ ఏడాది ఇప్పటికే 5.80 లక్షల ఎకరాల్లో పంటలు సాగుకాగా, ఇటీవల వరదలతో 20 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.. వరుస వర్షాలతో పంట ఎదుగుదల లోపించింది.. దీంతో దిగుబడి తగ్గుతుందని రైతులు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం అమలుచేసే ప్రధానమంత్రి పంటల బీమా యోజన గత ప్రభుత్వం అమలు చేయలేదు. పంటకు వాతావరణ ఆధారిత బీమా, సోయాకు గ్రామం యూనిట్ కింద పంట బీమా అమలయ్యేది.. ఎకరానికి నిర్ణయించిన ప్రీమియంలో రైతులు 50 శాతం చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం 25 శాతం, రాష్ట్రం 25 శాతం చెల్లించేంది.. అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలకు నష్టం జరిగితే నిబంధనల మేరకు మంజూరయ్యే పరిహారం నేరుగా రైతుల ఖాతాలో జమయ్యేది.

2018 నుంచి బీమా పథకం అమలు చేయకపోవడంతో రైతులు ప్రీమియం చెల్లించడం లేదు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తామే ప్రీమియం చెల్లించి పథకం అమలుచేస్తామని ప్రకటించింది. ఇప్పటివరకు పథకం అమలుకు నోచుకోవడం లేదు. పంట నష్టపోయిన సందర్భంలో ప్రభుత్వం సర్వే చేయించి రైతులకు నష్ట పరిహారం మంజూరు చేస్తోంది.

## ఉల్లి వరద.. కుళ్లి బురద

కర్నూలు : కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు ఏకంగా 40 వేల ఉల్లి బస్తాలు విక్రయానికి వచ్చాయి. 13, 14 తేదీల్లో మార్కెట్‌లో ఉల్లి క్రయ, విక్రయాలు నిలిచిపోవడంతో 15వ తేదీన పెద్ద ఎత్తున సరకు తీసుకొచ్చారు. సమయానికి మొత్తం 347 లాట్లలో 40,430 బస్తాల దిగుబడులు వచ్చాయి.

ఉల్లి క్వింటా కనిష్ఠ ధర రూ.100, మధ్యస్తం రూ.587, గరిష్ఠ ధర రూ.1200 పలికింది. వ్యాపారులు క్వింటా రూ.100 నుంచి రూ.587తో కొనుగోలు చేశారు. మార్క్‌ఫెడ్ గరిష్ఠ ధర రూ.1200తో కొనుగోలు చేసింది. గత వారం, పది రోజులుగా వ్యాపారులు ఇప్పటి వరకు గరిష్ఠ ధర రూ.1200కు మించి ధర రాసింది లేదు.



మార్కెట్‌కు 18,099 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు రాగా.. వ్యాపారులు 8,077 క్వింటాళ్లు మాత్రమే కొన్నారు. మిగిలిన 10,022 క్వింటాళ్ల ఉల్లిని మార్క్‌ఫెడ్ రూ.1200 మద్దతు ధరతో కొనుగోలు చేసింది. ఈ ఒక్కరోజే మార్క్‌ఫెడ్ వెయ్యి టన్నుల ఉల్లిని కొనుగోలు చేయడం గమనార్హం.

**నేడు 2500 టన్నులకు వేలం**

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన ఉల్లి నిల్వలను శని, ఆదివారం వేలం వేసినా 1500 టన్నుల సరకు మిగిలిపోయింది. మరో వెయ్యి టన్నులు కొనుగోలు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో మొత్తం 2500 టన్నుల ఉల్లి నిల్వలున్నాయి. వీటికి బహిరంగ వేలం వేస్తున్నారు. రిటైలర్స్, హోల్‌సేలర్స్, హోటళ్ల యజమానులు, తదితరులు పాల్గొనాలని అధికారులు కోరారు.

## తూముకు తూట్లు.. భూమికి ఎసరు

నంద్యాల : రైతులకు అండగా ఉండాల్సిన పాలకులు వారిపై కక్ష కట్టారు. వైకాపా వారు కాదన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లపాటు పొలాలకు నీరందించలేదు. ఫలితంగా 350 ఎకరాలు బీడుగా భూములుగా మారాయి. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ప్రయోజనం లేకపోయింది.

నంద్యాల శివారులోని కానాల గ్రామంలో 848.42 ఎకరాల విస్తీర్ణంలో 'నాగమ్మ చెరువు' ఉంది. పలు గ్రామాల్లోని పొలాలకు నీరందేలా నాలుగు తూములు ఏర్పాటుచేశారు. దీని కింద సుమారు మూడు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. కేసీ కాలువ నిర్మాణ సమయంలో ఒక తూము ఏర్పాటుచేసి ఈ చెరువును నింపేలా కాలువ తవ్వారు. ఫలితంగా కానాల, చింతకుంట, జూలెపల్లి, పసులపాడు, గోస్పాడు, కూలూరు తదితర గ్రామాల రైతులు రెండు పంటలు పండించుకునే వెసులుబాటు కలిగింది.

**న్యాయస్థానాన్ని ఆశ్రయించారు**

అనధికార తూము నుంచి చింతకుంట, హెచ్.కొట్టాల, జూలెపల్లి గ్రామాల రైతులు నీరు తీసుకోవడంతో తమకు సరిపోవడం లేదంటూ కానాల రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అనధికారికమని చెబుతున్న నాలుగో తూము నుంచి నీరు తీసుకుంటుండటంతో ఎంతనీరు వినియోగమవుతుందో అంత నీరు అదనంగా కేసీ కాలువ నుంచి చెరువులోకి వచ్చేలా కాలువ ఇన్‌లెట్ తూము వ్యాసం పెంచాలని



న్యాయస్థానం సూచించింది. దీనిని అధికారులు అమలు చేయలేదు. కానాల రైతులు కోర్టు ధిక్కారం కింద మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని న్యాయస్థానం సూచించగా 2019లో వైకాపా ప్రభుత్వ హయాంలో నాటి అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో నాలుగో తూమును మూసేసి 350 ఎకరాలకు నీరు అందకుండా చేశారు.

**కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేదు**

కానాల చెరువు తూమును శాశ్వతంగా మూసేయడంతో తమ పొలాలు బీడుగా మారుతున్నాయని చింతకుంట, హెచ్ కొట్టాల, జూలెపల్లి రైతులు గత ప్రభుత్వ హయాంలో అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ గోడును ప్రస్తుత అధికారులకు విన్నవించారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

**కన్నేసి.. మూసేసి**

చెరువుకు ఉన్న నాలుగు తూముల్లో ఒకటి అధికారిక రికార్డుల్లో లేకపోవడం చింతకుంటు, హెచ్.కొట్టాల, జూలెపల్లి రైతులకు శాపంలా మారింది. ఆ తూమును మూసేస్తే దానికి అనుసంధానమై ఉన్న కాలువ భూములు కొట్టేయొచ్చని కొందరు ప్రణాళికలు రచించారు. ఆ తూముకు అనుసంధానమై ఉన్న కాలువ ప్రధాన రహదారికి ఆనుకుని ఉండటంతో కాలువ భూములకు మంచి ధర పలుకుతోంది. ఈ నేపథ్యంలో అనుకున్నదే తడవుగా ఆ తూము మూసేశారు. కాలువ ఎండిపోయేలా చేశారు. రహదారికి ఆనుకుని ఉన్న సర్వే నంబరు 668/2బిలోని 1.27 ఎకరాలను విజయలక్ష్మి పేరుతో ఆన్‌లైన్ నమోదు చేశారు. కాలువ భూమిని ఆమె పేరుతో ఎలా చూపుతారంటూ కొందరు రైతులు కలెక్టర్‌తోపాటు మంత్రి ఫరూక్‌కు ఫిర్యాదు చేశారు.

**రైతులకు అన్యాయం చేస్తున్నారు** శ్రీనివాసగౌడ్, రైతు, హెచ్.కొట్టాల

" వైకాపా నాయకుల ఒత్తిడితో గత ప్రభుత్వ హయాంలో జలవనరుల శాఖ అధికారులు రైతులకు తీరని ద్రోహం చేశారు. కేసీ నుంచి చెరువులోకి ఎక్కువ నీరు వచ్చేలా తూము వ్యాసాన్ని పెంచాలని న్యాయస్థానం స్పష్టమైన సూచనలు చేసినా మూడు గ్రామాల రైతులు నష్టపోయేలా తూమును శాశ్వతంగా మూసేయడం దారుణం. ప్రస్తుత ప్రభుత్వ అధికారులైనా న్యాయం చేసేలా తగిన చర్యలు తీసుకోవాలి.

## పట్టా భూమని వంక.. అమ్మాలని ఆశ



ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు పట్టణం వేగంగా విస్తరిస్తోంది.. స్థలాలకు రెక్కలొచ్చాయి.. పట్టణ శివారులో రాత్రికిరాత్రే వెంచర్లు వెలుస్తున్నాయి. ఇక్కడ సెంటు స్థలం రూ.3 లక్షలు మొదలు రూ.10 లక్షల వరకు పలుకుతోంది. ఎగువ ప్రాంతంలో కొండలు ఉన్నాయి.. వాటి నుంచి వచ్చే వర్షపు నీరు దిగువకు వెళ్లడానికి వీలుగా ఏళ్ల కిందట సహజ సిద్ధంగా వంకలు ఏర్పడ్డాయి.. వాటిని పట్టాదారులు పూడ్చేసి ప్లాట్లుగా మార్చుతున్నారు. నిబంధనల ప్రకారం వంకలను పూడ్చినా.. విక్రయించినా వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలి. పుర, రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడంతో యథేచ్ఛగా పూడ్చేస్తున్నారు. ఇళ్ల స్థలాలుగా మార్చి విక్రయిస్తున్నారు. వంకలను పూడ్చడంతో సాయినగర్, సున్నంబట్టీ వీధి, రామలక్ష్మమ్మ కాలనీ, లక్ష్మణ్‌టాకీస్ ఏరియా, భీమన్ననగర్, 27వ వార్డు, ధోబీఘాట్ ఏరియా, చంద్రయ్యకొట్టాల, సంజీవ్‌నగర్, ఇతర కాలనీల్లో నిత్యం సమస్య తలెత్తుతున్నాయి. వర్షం వస్తే దాదాపు 30 వేల మందికి పైగా నివసిస్తున్న కాలనీలు నీట మునుగుతున్నాయి. ఎమ్మిగనూరు పట్టణ శివారులో సర్వే నంబరు 459 నుంచి 469 వరకు సుశీలమ్మ కొండ వంక విస్తరించి ఉంది. మొత్తం ఒక కి.మీ.మేర 80 అడుగుల వెడల్పుతో ఉండేది. పట్టా భూములుగా చెప్పి వంకనూ పూడ్చేశారు. 3 అడుగుల మేర పిల్ల కాల్వ మాదిరిగా చేశారు. సెంటు రూ.7 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు విక్రయించారు. ఇక్కడ 28 వరకు ప్లాట్లు వేసి రూ.కోట్లు వెనకేసుకొన్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా కాలనీ మొత్తం భారీగా నీరు నిల్వ ఉంటోంది.


గుడేకల్ ప్రాంతం నుంచి వచ్చే నీరు నల్లవాగులో పారుతోంది. 80-100 అడుగుల మేర వెడల్పు ఉన్న ఈ వంకను పూడ్చి ఇళ్ల స్థలాలుగా మార్చారు. ప్రస్తుతం ఆరు అడుగులకు పరిమితమైంది. ఇక్కడ 15 వరకు ప్లాట్లుగా చేసి సెంటు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ధర ఖరారు చేసి విక్రయించారు. ప్రస్తుతం నివాసాలు వెలుస్తున్నాయి. వర్షం వస్తే కాలనీ మొత్తం చెరువును తలపిస్తోంది.

**ఇక్కడ ఆక్రమించారు**శిల్పా ఎస్టేట్ వెనుక సర్వే నంబరు-495లో 2.2 ఎకరాల్లో 120 అడుగుల వెడల్పుతో ఉండే వంక ఇప్పుడు రూపు కోల్పోయింది. ఇళ్ల స్థలాలు వేసి సెంటు రూ.లక్షల వరకు విక్రయించారు. దాదాపు రూ.ఐదారు కోట్లు సొమ్ము చేసుకొన్నారు.

వెంకటాపురం నుంచి విద్యుత్తు సబ్ స్టేషన్ వరకు 50 అడుగుల వెడల్పుతో ఉండే వంకను ప్లాట్లు వేసి ఆక్రమించుకున్నారు.

కమిటీ రోడ్డులో 40 అడుగుల వెడల్పుతో ఉండే వంక అక్రమ కట్టడాలతో మూసుకుపోయింది. వ్యవసాయ మార్కెట్‌లోని వర్షం నీరు ఈ వంకలో పారాలి. అన్యాక్రాంతం కావడంతో నీళ్లు మార్కెట్‌లోనే నిలిచి రైతుల పంట ఉత్పత్తులు తడిసిపోతున్నాయి.

## నైపుణ్యా పోటీ.. భవితకు దివిటీ



కర్నూలు : ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలే ఉజ్వల భవిష్యత్తుకు సోపానాలుగా నిలుస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో చదువుతో సంబంధం లేకుండా వివిధ వృత్తులు, సాంకేతిక అంశాల్లో నైపుణ్యం కలిగిన వారిని గుర్తించి ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంతర్జాతీయ స్థాయి పోటీలో దేశానికి ప్రాతినిధ్యం వహించే సదవకాశం కల్పిస్తోంది. ఈ నైపుణ్య పోటీలో జిల్లా యువత ఉత్సాహంగా పాల్గొని సత్తా చాటాలని కర్నూలు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్‌రాజ్‌కుమార్ కోరారు. ప్రతిభావంతులకు ఇది సరైన వేదిక అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు.

**ప్రతి స్థాయిలో ప్రోత్సాహకం**

వరల్డ్ స్కిల్స్- 2025 పోటీలను తొలుత జిల్లా, జోనల్‌స్థాయిలో నిర్వహిస్తారు. విజేతలు ఒక్కో మెట్టు ఎక్కుతూ రాష్ట్రం, రీజినల్, ప్రీ నేషనల్, జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకు వెళ్తారు. ప్రతి పోటీలోనూ విజేతలకు ప్రోత్సాహకాలు అందజేస్తారు. స్కిల్ ఇండియా, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, వరల్డ్ స్కిల్స్ ఇండియా.. ఈ మూడు విభాగాల భాగస్వామ్యంలో ఈ పోటీలను నిర్వహించనున్నారు.

**3,273 మంది నమోదు**

రాష్ట్ర వ్యాప్తంగా ఈ పోటీ పరీక్షలకు 50 వేల మందిని సన్నద్ధం చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. ఒక్కో జిల్లా నుంచి 2 వేల మంది చొప్పున ఇండియా స్కిల్స్ కాంపిటీషన్-2025లో పోటీ పడేలా నైపుణ్యాభివృద్ధి సంస్థ కసరత్తు చేస్తోంది. ఈనెల 12వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో 3,273 మంది యువత రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

**వీరూ పోటీ పడొచ్చు**

మరో 50 ట్రేడ్‌లకు 2004 జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులు. వీరికి విద్యార్హత ప్రామాణికం కాదు. పది, ఇంటర్, డిగ్రీ ఆపై చదివిన వారెవరైనా అర్హులే.

బ్రిక్లియింగ్, కార్పెంటరీ, క్యాబినెట్ మేకింగ్, కాంక్రీట్ కన్‌స్ట్రక్షన్ వర్క్, ల్యాండ్ స్కేపింగ్ గార్డెనింగ్, పెయింటింగ్ అండ్ డెకోరేటింగ్, ప్లంబింగ్ అండ్ హీటింగ్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషనింగ్, వాల్ అండ్ ఫ్లోర్ టైలింగ్, జువెలరీ, గ్రాఫిక్ డిజైనింగ్ టెక్నాలజీ, డిజిటల్ ఇంటరాక్టివ్ మీడియా, వెబ్ టెక్నాలజీస్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, కెమికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ, సీఎన్‌సీ మిల్లింగ్, ఇండస్ట్రియల్ మెకానిక్స్, ఇండస్ట్రియల్ కంట్రోల్, మెకానికల్ ఇంజినీరింగ్ సీఏడీ, రెన్యూవబుల్ ఎనర్జీ, వెల్డింగ్, బేకరీ, బ్యూటీ థెరపీ, కుకింగ్, హెల్త్ అండ్ సోషల్ కేర్, హోటల్ రిసెప్షన్, ఆటో బాడీ రిపేర్, కార్ పెయింటింగ్, హెవీ వెహికల్ టెక్నాలజీ, ఫ్యాషన్ టెక్నాలజీ, ఫ్లోరిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, రెస్టారెంట్ సర్వీస్, రిటైల్ సేల్స్ వంటి కోర్సుల్లో వీరు పోటీ పడొచ్చు.

పోటీ : ఇండియా స్కిల్స్ కాంపిటీషన్- 2025

నిర్వహణ: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ

ఎన్ని అంశాల్లో : మొత్తం 63 ట్రేడ్లు

దరఖాస్తులు ఇలా.. స్కిల్ ఇండియా డిజిటల్ హబ్ వెబ్‌సైట్ %www.skillindiadigital.gov.in% లోకి వెళ్లాలి. వ్యక్తిగత వివరాలు, విద్యార్హత, ఏయే విభాగాల్లో పోటీ పడుతున్నారో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

అర్హత : 13 ట్రేడ్‌లకు 2001 జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులు. వీరికి డిజిటల్ కన్‌స్ట్రక్షన్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఇండస్ట్రియల్ డిజైన్ టెక్నాలజీ, ఇండస్ట్రీ 4.0, మెకట్రానిక్స్, రోబోట్ సిస్టమ్ ఇంటిగ్రేషన్, వాటర్ టెక్నాలజీ, డెంటల్ ప్రోస్థటిక్స్, ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్, ఆడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి విభాగాల్లో పోటీ ఉంటుంది.

చివరి తేదీ : ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

## నిధి సమకూరక.. పుర ప్రగతి తప్పింది

నంద్యాల : పుర అధికారుల అవగాహన లేమి అభివృద్ధి పనులపై పడింది.. నిధులున్నా పనులు చేయలేని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో పుర ఆదాయమంతా సీఎఫ్‌ఎంఎస్‌కు జమ చేసేవారు. అక్కడి నుంచి నిధులు విడుదల చేస్తేనే స్థానికంగా అభివృద్ధి పనులు చేయాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎఫ్‌ఎంఎస్ విధానాన్ని పక్కనపెట్టి 'నిధి' పోర్టల్‌ను తీసుకొచ్చింది. అభివృద్ధి పనులకు సంబంధించి స్థానికంగానే బిల్లులు చెల్లించే విధానాన్ని కల్పించారు. ఆయా ప్రాంతాల్లో వచ్చిన ఆదాయంతోనే బిల్లులు చెల్లించాలన్న నిబంధన పెట్టింది. ఉమ్మడి జిల్లాలోని ఏ పురపాలక సంఘం కూడా ప్రభుత్వం కల్పించినా అవకాశాన్ని వినియోగించుకోలేదు.

**పాత బిల్లులకు 'రాంరాం'**

'నిధి' పోర్టల్‌లో పాత బిల్లులను అప్‌లోడ్ చేయడం లేదు. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి వచ్చిన ఆదాయంతోనే బిల్లులు చెల్లించాలన్న నిబంధనను ప్రభుత్వం విధించింది. దీంతో పాత బిల్లులపై మున్సిపాలిటీలు దృష్టి సారించడం లేదు. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోనే పాత బిల్లులు రూ.80 కోట్ల వరకు ఉన్నాయి. నంద్యాలలో రూ.25 కోట్లు, ఆదోని రూ.20 కోట్లు, ఎమ్మిగనూరు రూ.8 కోట్లు, డోన్ రూ.5 కోట్లు, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు మున్సిపాలిటీలకు కలిపి రూ.6 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

**ఆశీస్సులుంటేనే..**

నంద్యాల మున్సిపాలిటీలో పాత బిల్లులకు మోక్షం కలగాలంటే అస్మదీయ గుత్తేదారులైతే సరి.. లేకుంటే 'పెండింగ్'లో పెట్టాలన్న ఆదేశాలున్నాయి. ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు పురపాలక సంఘాల పరిధిలో బిల్లులు రావాలంటే ఎంతో కొంత ఇచ్చుకోవాల్సిందే. ఆదోని, ఎమ్మిగనూరు, డోన్‌లో సిఫార్సులుంటే చాలు.. కర్నూలులో ఓ నాయకుడి ఆశీస్సులు ఉన్నవారికే బిల్లులు వస్తున్నాయన్న ఆరోపణలున్నాయి.

**నమోదు చేయకనే తంటాలు**

ఈ ఆర్థిక సంవత్సరం తొలి మూడు నెలలపాటు పన్నులు, రుసుములు, జరిమానా, అనుమతుల ద్వారా వచ్చిన నిధులను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయలేదు. నంద్యాల పురపాలక సంఘానికి ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.5 కోట్లు వచ్చింది. కర్నూలు నగరపాలక సంస్థకు రూ.20 కోట్లు, ఆదోని రూ.3 కోట్లు, ఎమ్మిగనూరు రూ.కోటి, డోన్ పురపాలక సంఘానికి రూ.కోటి ఆదాయం వచ్చినా ఉపయోగించుకోలేని పరిస్థితి.

రహదారులు, కాలువలు, తాగునీటి పైపులైన్లు, పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ తదితరాలు చేశారు. పనులు పూర్తైనప్పటికీ గుత్తేదారులకు బిల్లులు రాలేదు. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో ఏడాది కాలంలో రూ.25 కోట్ల పనులు జరిగాయి. నంద్యాల మున్సిపాలిటీలో రూ.10 కోట్లు, ఆదోని రూ.8 కోట్లు, ఎమ్మిగనూరు రూ.3 కోట్లు, ఆత్మకూరు, నందికొట్కూరు, ఆళ్లగడ్డ పురపాలక సంఘాల పరిధిలో ఒక్కోచోట రూ.కోటి విలువైన పనులు చేశారు.

## గుంతకల్లు, గుత్తి రైల్వే జంక్షన్లకు మహర్దశ

గుంతకల్లు : రైల్వే ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు, స్టేషన్ల గుండా సకాలంలో రైళ్లు బయలుదేరి వెళ్లేవిధంగా చూడడానికి గుంతకల్లు, గుత్తి రైల్వే జంక్షన్లలో అత్యాధునిక వసతులు సమకూర్చనున్నారు. దీనికి గాను రూ. 47.69 కోట్లు కేటాయించి గుత్తేదారులకు ఆయా పనులు అప్పగించే ప్రక్రియను పూర్తి చేశారు. గుంతకల్లు జంక్షన్‌లో అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. పనులు పూర్తయితే గుత్తి, గుంతకల్లు జంక్షన్లలో మెరుగైన సౌకర్యాలు ప్రయాణికులకే కాకుండా రైల్వే సిబ్బందికి సమకూరనున్నాయి. స్టేషన్లలో పనులు చేపట్టడానికి అవసరమైన నిధుల కోసం గత 20 ఏళ్ల నుంచి నుంచి ఎదురు చూస్తుంటే రైల్వే బోర్డు ప్రస్తుతం నిధులు కేటాయించడం శుభపరిణామం.

**క్షేత్రస్థాయిలో చకచకా పనులు**



గుత్తి రైల్వే జంక్షన్‌లో ప్లాట్‌ఫాంల నిర్మాణం, షెల్టర్ల ఏర్పాటు, వంతెనల నిర్మాణం, అదనపు రైల్వేలైన్లు, గదుల నిర్మాణ పనులను చేపడుతున్నారు. గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో యార్డు విస్తరణ, స్టేషన్ భవనాల నిర్మాణంతో పాటు స్టేషన్‌లోని అన్ని రైల్వేలైన్ల అనుసాధానం పనులు చేపడుతున్నారు. కొత్తదైన ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. ఇప్పుడు స్టేషన్‌లో ఉన్న మూడు సిగ్నలింగ్ క్యాబిన్లను తొలగించి వాటిని ఒకే గదిలో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకుకోసం ఇప్పటికే స్టేషన్‌లో రూ. 3 కోట్లు ఖర్చు చేసి సిగ్నలింగ్ క్యాబిన్ భవాలను నిర్మించారు. యార్డుల విస్తరణ పూర్తయితే తప్పా సిగ్నలింగ్ వ్యవస్థలో మార్పులు చేయడానికి అవకాశం లేదని విస్తరణ పనులను చేపడుతున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. కొత్త వ్యవస్థ ఏర్పాటైతే కంప్యూటర్ల సాయంతో సిగ్నళ్లు పనిచేస్తాయని అధికారులు పేర్కొన్నారు. రైలు ప్రమాదాలు జరగడానికి, రైళ్లు డేంజర్ సిగ్నళ్లను దాటే అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు. లైన్ల అనుసంధాన పనులను చేయడానికి స్టేషన్‌లోని పాత బుకింగ్ కార్యాలయానికి చెందిన భవనాలు పూర్తిగా తొలగించనున్నారు.

## నైపుణ్యాభివృద్ధిమస్తు.. ఉద్యోగ ప్రాప్తిరస్తు..!

మద్దిలపాలెం : ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులకే కొలువులు దొరకని రోజులివి. ఇక సాధారణ డిగ్రీ చేసిన విద్యార్థుల పరిస్థితి ఏమిటి..? వారికి ఉద్యోగాలు ఎలా వస్తాయి.. ఈ ప్రశ్నలకు జవహర్ విజ్ఞాన కేంద్రాలు (జేకేసీలు) సమాధానాలు చెబుతున్నాయి. డిగ్రీ విద్యార్థులకు ఇక్కడ శిక్షణ ఇచ్చి ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దుతున్నారు. 2006లో రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కళాశాలల్లో వీటిని ప్రారంభించింది. అందులో మద్దిలపాలెం డాక్టర్ వీఎస్‌కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కేంద్రం కూడా ఉంది.

**ఒక్కో బ్యాచ్‌కు మూడు నెలలు:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఎటువంటి ఫీజు చెల్లించకుండా జేకేసీలో శిక్షణ పొందవచ్చు. మూడు నెలలపాటు బ్యాచ్‌కి 60 మంది చొప్పున ఏడాదికి 240 మంది వీఎస్‌కృష్ణా కళాశాల జేకేసీలో శిక్షణ పొందుతున్నారు.

నిపుణులైన మెంటార్లు విద్యార్థుల్లో కమ్యూనికేషన్, విశ్లేషణాత్మక నైపుణ్యాల పెంపుదలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. సాఫ్ట్ స్కిల్స్, రీజనింగ్, అర్థమెటిక్‌లో మెలకువలు నేర్పిస్తున్నారు. ఎంపిక చేసిన అంశంపై బృంద చర్చలు ఏర్పాటు చేసి ఆంగ్లభాష నైపుణ్యాలు పెంచుకునేలా, వేదికలపై భయం లేకుండా మాట్లాడేలా తర్ఫీదు ఇస్తున్నారు. రోజు రెండు గంటలపాటు తరగతులు ఉంటాయి. ఒక గంట థియరీ, మరో గంట ప్రాక్టికల్స్.

కంప్యూటర్ కోర్సులు, వ్యక్తిత్వ వికాస తరగతులు: ప్రస్తుతం యువత ఏ ఉద్యోగంలో చేరాలన్నా కనీసం కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం. అందుకే ఇక్కడ విద్యార్థులకు ఎం.ఎస్.ఆఫీస్, ఇంటర్నెట్, సీ లాంగ్వేజ్



లాంటి కోర్సులు నేర్పిస్తున్నారు. ఉద్యోగ సాధనలో వ్యక్తిత్వ వికాసం కీలకపాత్ర పోషిస్తున్న నేపథ్యంలో నిపుణులతో వ్యక్తిత్వ వికాస తరగతులు ఏర్పాటు చేస్తున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత వివిధ సంస్థలు ఉద్యోగాలు మేళాలు ఏర్పాటు చేస్తున్నాయి.

**పేద విద్యార్థులకు వరం..**

– సౌజన్య, వీఎస్‌కృష్ణా కళాశాల పూర్వ విద్యార్థిని

వీఎస్ కృష్ణా డిగ్రీ కళాశాలలో బీకాం చదువుతూ జేకేసీలో శిక్షణ తీసుకున్నా. ఉద్యోగ మేళాలో ప్రతిభ చూపడంతో బెంగళూరులోని ఫ్లిప్‌కార్టు సంస్థలో ఉద్యోగం వచ్చింది. జేకేసీలో శిక్షణతో నైపుణ్యాలు పెరిగాయి.

**గ్రామీణ ప్రాంత యువతకు ఉపయుక్తం**

– డాక్టర్ జి.శ్రీనివాసరావు, జేకేసీ కోఆర్డినేటర్

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు జేకేసీ శిక్షణ ఎంతగానో ఉపయోగ పడుతోంది. మూడు నెలల్లో వారిలో నైపుణ్యాలు పెరిగేలా తర్ఫీదు ఇస్తున్నాం. నమూనా ఇంటర్వ్యూలు నిర్వహించి ఆత్మవిశ్వాసం పెరిగేలా చూస్తున్నాం.

# ఈ-పంట నమోదు 19 శాతమే

పుట్టపర్తి :శ్రీసత్యసాయి జిల్లాలో ఈ-పంట నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. పంటల సాగుతో సంబంధం లేకుండా ప్రతి ఎకరా భూమిని సర్వే నంబర్ల ఆధారంగా వివరాలు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో భూముల వివరాలు లాగిన్‌లలో పూర్తిస్థాయిలో కనిపించక పోవడంతో ప్రక్రియ ముందుకు సాగడం లేదు. వివిధ కారణాలతో ఇప్పటి వరకు జిల్లాలో 19 శాతం మాత్రమే నమోదు చేశారు. ఈ నెలాఖరులోపు పంట నమోదు ప్రక్రియ పూర్తి చేసి తుది జాబితా తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. నిర్దేశించిన గడువుకు ఇంకా 15 రోజులే సమయం ఉంది. ఆ లోపు 10 లక్షల ఎకరాల పంట వివరాలను నమోదు చేయాల్సి ఉంది. మండల వ్యవసాయాధికారులు, సహాయకులు అందరూ కొన్ని రోజులుగా యూరియా సరఫరా విధుల్లోనే ఉండిపోయారు. ప్రస్తుతం ఆ సమస్య ఓ కొలిక్కి రావడంతో అధికారులు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

**ఇబ్బందులు ఇలా..** చుక్కల భూములు, డీపట్టా, అసైన్డ్ అటవీ భూముల



వివరాలు వీఆర్వో, వీఏఏల లాగిన్‌లలో పూర్తిస్థాయిలో కనిపించక పోవడంతో ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

సాంకేతిక కారణాలతో వెబ్‌ల్యాండ్‌లో భూముల వివరాలు కనిపిస్తున్నా, ఈ-పంట వివరాలు నమోదు కావట్లేదు. గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వే వల్ల కూడా సమస్యలు తలెత్తుతున్నాయి. యూరియా కొరతపై సిబ్బంది దృష్టి పెట్టడంతో ఈ ప్రక్రియ మందగించింది.

**నెలాఖరుకు పూర్తి చేస్తాం - రామునాయక్, జేడీఏ**

నెలాఖరు నాటికి జిల్లాలో ఈ-పంట నమోదు ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే మండల వ్యవసాయాధికారులకు ఆదేశాలు జారీ చేశాం. గ్రామాల్లో వీఏఏలకు రైతులు సహకరించాలి. రైతులు స్వచ్ఛందంగా నమోదు చేయించుకోవాలి.

జిల్లాలో మొత్తం విస్తీర్ణం : 12,96,586 (ఎకరాలు)
సాగైన పంటల విస్తీర్ణం : 2,27,240
ఈ-పంట నమోదు : 2,23,966

# బతుకు నాడి పట్టారు

నాయుడుపేట : మారుమూల పల్లెటూరు జీలపాటూరు. వ్యవసాయమే జీవనాధారం. అందరూ ఆదర్శ రైతులే. తల్లిదండ్రులు తమ పిల్లల్ని సెలవు రోజుల్లో తమ వెంట పొలాల్లోకి తీసుకెళ్లేవారు. పిల్లల్ని పొలం గట్లపై కూర్చోమని పెద్దలు తాము పడుతున్న కష్టాన్ని వాళ్లకు చూపించారు. పిల్లలు కసి, పట్టుదలతో చదివేలా వెన్నుతట్టారు. పోటీతత్వాన్ని నూరిపోశారు. అంతే ఆ గ్రామంలో ప్రస్తుతం 30 మంది వైద్యులుగా మారారు. పెళ్లకూరు మండలం జీలపాటూరు పంచాయతీలో 360 ఆవాసాలున్నాయి. 1400 మంది పైగా జనాభా ఉన్నారు. పూర్తిగా వ్యవసాయ ఆధారిత గ్రామం. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చిన్నతనం నుంచి కష్టపడి చదివి మెడిసిన్ పూర్తిచేశారు.



ఒకరిని చూసి మరొకరు పోటీతత్వంతో చదువులో రాణించారు. ఏటా ఇక్కడ ఇద్దరు ముగ్గురు వైద్యం అభ్యసిస్తున్నారు. ఒక్కో ఇంట్లో ముగ్గురు నలుగురు చొప్పున వైద్యులుగా కొనసాగుతున్నారు. కొందరు సొంతూరులో సేవలందిస్తున్నారు.

**చదువు మా గ్రామాన్ని మార్చేసింది**

చదువే మా గ్రామాన్ని మార్చేసింది. ఇక్కడ 75 మంది ఇంజినీర్లు, 50 మంది ఆదర్శ రైతులున్నారు. 10-20 మంది వరకూ ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఎకరా 40-50 బస్తాల వరకూ పండిస్తారు. పిడికెడెంత పల్లెటూరులో ఎంతోమంది ప్రతిభావంతులు తయారయ్యారు.- శివకుమార్, సర్పంచి

# రెస్కోకు మస్కా.. విచారణకు మసక

అనకాపల్లి : అనకాపల్లి గ్రామీణ సహకార విద్యుత్తు సంస్థలో (రెస్కో) అక్రమాలు, అడ్డగోలు వ్యవహారాలపై ఎంతకీ నిగ్గుతేల్చడం లేదు. సంస్థను తూర్పుప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థలో (ఈపీడీసీఎల్) విలీనం చేసినప్పుడే పలు అవకతవకలు గుర్తించారు. అప్పట్లో సహకార శాఖ అధికారిని పర్సన్ ఇన్‌ఛార్జిగా పెట్టుకుని వైకాపా నేతలు దందాలు నడిపారు. విద్యుత్తు ఉపకరణాల కొనుగోలు, సిబ్బంది నియామకాల్లో రూ. కోట్లు దిగమింగారు. కొంతమంది సిబ్బంది విధులకు రాకుండానే నెలనెలా జీతాలు తీసుకున్నారు. గత ప్రభుత్వంలో ఇలా లెక్కకు మిక్కిలిగా అక్రమాలు జరిగినా వైకాపా నేతల ఒత్తిళ్లతో అధికారులు నిజాలను దాచిపెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర దాటుతున్నా ఇప్పటికీ ఈ అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశించడం లేదు. ముందుకు సాగని విచారణ... రెస్కోలో కంటింజెన్సీ పేమెంట్ వర్కర్ (సీపీడబ్ల్యూ) పేరుతో 450 మంది సిబ్బంది ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నారు. గత ప్రభుత్వంలో అవసరం లేకున్నా ఒక్కొక్కరి నుంచి రూ. 4 లక్షల చొప్పున తీసుకుని ఒప్పంద పద్ధతిలో నియమించుకున్నారు. రెస్కోను ఈపీడీసీఎల్‌లో విలీనం చేసిన తర్వాత కూడా 30 మందిని పైగా ఇష్టం వచ్చినట్లు నియమించుకున్నారు. ఎలాంటి ఉత్తర్వులు లేకుండా నియామకాలు జరగడంపై డిస్కం అభ్యంతరం తెలిపింది. దీంతో అప్పట్లో కొంతమందిని తప్పించేశారు. మరికొంత మంది విధులు నిర్వర్తిస్తున్నారని వెనకేసుకొచ్చారు. పూర్తిస్థాయిలో పరిశీలన చేయకుండా ఈపీడీసీఎల్ ఏఈ, ఏడీలు ఇచ్చిన నివేదికతో సరిపెట్టేశారు. వైకాపాకు చెందిన ముఖ్య నేత, రెస్కో మాజీ ఛైర్మన్ దగ్గరి బంధువు ఒకరు గత ఐదేళ్లు విధులకు వెళ్లకుండా జీతం పొందారన్న ఫిర్యాదులున్నాయి. ఇతడే కాదు, ఎటువంటి పనులు చేయకుండా జీతాలు తీసుకున్న సిబ్బంది కూడా చాలామంది ఉన్నారన్న ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం వీటిపై కొరడా ఝుళిపించకుండా కాలయాపన చేయడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

సమగ్ర విచారణ చేస్తున్నాం... నిబంధనలకు విరుద్ధంగా సిబ్బందిని నియమించారన్న అంశం కోర్టులో ఉండటంతో విచారణ ఆలస్యమైంది. ఇటీవల కోర్టు అనుమతులు వచ్చాయి. తుమ్మపాల చక్కెర కర్మాగారం ఎండీ శాస్త్రి విచారణ చేయనున్నారు. చాలామందిపై ఆరోపణలు ఉన్నాయి.

# కాగితాల్లోనే టమాటా ప్రాసెసింగ్



అనంతపురం: నిలకడలేని ధరలతో ఏటా నష్టాలు మూటగట్టుకుంటున్న టమాటా రైతుల్ని ఆదుకోవడం కోసం జిల్లాలో ఆహారశుద్ధి పరిశ్రమ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు దశాబ్దకాలంగా కాగితాలకే పరిమితవుతున్నాయి. కళ్యాణదుర్గంలో టమాటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలనే ప్రయత్నాలు 2012 నుంచే జరుగుతున్నా కార్యరూపం దాల్చలేదు.

**ప్రతిపాదనలకే పరిమితం**

కళ్యాణదుర్గం పరిధిలో రోజుకు 50 టన్నులు ప్రాసెస్ చేసేలా పరిశ్రమ, 100 టన్నుల సామర్థ్యంతో రెండు శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన చాలా ఏళ్లుగా ఉంది. 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యూనిట్ ఏర్పాటుకు తిమ్మసముద్రంలో భూముల్ని పరిశీలించింది.

కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు.. ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల జరిగిన డీఆర్సీ సమావేశంలోనూ ఇన్‌ఛార్జి మంత్రి టీజీ భరత్ దృష్టికి తీసుకెళ్లారు.

**కర్నూలులో సాకారం దిశగా..**

గత వైకాపా ప్రభుత్వం కర్నూలు జిల్లా పత్తికొండలో రూ.12 కోట్లతో టమాటా ప్రాసెసింగ్ యూనిట్ మంజూరు చేసింది. భూమిపూజ చేసి చేతులు దులుపుకొంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రక్రియను ముందుకు తీసుకెళ్లింది. ఇటీవల పనులు మొదలుపెట్టారు. ఇదే క్రమంలో అనంతపురం జిల్లాలోనూ ప్రాసెసింగ్ యూనిట్ల అవసరంపై ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉంది. కళ్యాణదుర్గంతో పాటు అనంతపురం, రాప్తాడు ప్రాంతాల్లోనూ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

**ఏటా 3 లక్షల టన్నులు**

ఉమ్మడి జిల్లాలో 60 వేల ఎకరాల్లో టమాటా సాగు చేస్తున్నారు. ఏటా 3 లక్షల టన్నుల దిగుబడి వస్తోంది.

అనంతపురంలో మార్కెట్ ఉన్నప్పటికీ దిగుబడి సమయానికి ధరలు పడిపోతున్నాయి. ఒక్కోసారి 15 కిలోల బాక్సు రూ.30 మించి ధర పలకడం లేదు. టమాటా గుజ్జు, సాస్, జ్యూస్ తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే గిట్టుబాటు ధరలు లభిస్తాయి.

# మ్యాజిక్‌తో మురుగు మరుగు!



ఉరవకొండ: గ్రామాల్లో స్వచ్ఛతతోపాటు భూగర్భ జలాల పెంపునకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులతో ప్రయోగాత్మకంగా మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి రంగం సిద్ధం చేసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మురుగు సమస్య అధికంగా ఉన్న ఎనిమిది గ్రామాల్లో నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ డ్రెయిన్లతో మురుగు ఎక్కడికక్కడే సులువుగా భూమిలోకి ఇంకుతుంది. దీంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తదు. దోమల బెడద తగ్గనుంది.

అనంత జిల్లాలో 660 మీటర్లు, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో 820 మీటర్ల మేర మ్యాజిక్ డ్రైయిన్లను నిర్మించనున్నారు. ఇందుకు రూ.8.85 లక్షల ఉపాధి హామీ పథకం నిధులు మంజూరయ్యాయి. ఈ ప్రక్రియను వచ్చేనెల 2 నాటికి పూర్తిచేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని డ్వామా అనంతపురం పీడీ సలీంబాషా తెలిపారు.

**ఖర్చు తక్కువ.. ప్రయోజనాలు ఎక్కువ**

రెండు అడుగుల లోతు, అర మీటరు వెడల్పుతో కాలువను తవ్వుతారు. కింద భాగంలో 150 ఎంఎం కంకరను 30 సెం.మీ., మధ్యలో 40 ఎంఎం కంకరను 20 సెం.మీ, పై పొరలో 20 ఎంఎం కంకరను 10 సెం.మీ వేస్తారు. కాలువకు ఇరువైపులా బండలను పాతుతారు. దీంతో ఎక్కడి మురుగు అక్కడే ఇంకిపోతుంది.

వర్షాలు అధికమై నీరు బయటికి వచ్చే పరిస్థితుల్లో 50 మీటర్లకు ఒకటి చొప్పున ఇంకుడు గుంతను తవ్వుతారు.

సాధారణంగా 100 మీటర్ల సిమెంటు డ్రైయిన్‌ను నిర్మించాలంటే రూ.4 లక్షలు ఖర్చు అవుతుంది. ఇదే పరిమాణంలో మ్యాజిక్ డ్రైయిన్ నిర్మాణానికి రూ.75 వేలల్లోనే పూర్తవుతుంది.

ప్రధానంగా శుభ్రతతోపాటు వర్షపు నీటిని ఒడిసి పట్టవచ్చు.

# కాసుల దాహానికి.. కరుగుతున్న కొండలు



పుట్టపర్తి : కొండలు, గుట్టలను అక్రమార్కులు యథేచ్ఛగా కరిగించేసి సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా రహదారుల నిర్మాణంలో నిబంధనల అతిక్రమణ జరుగుతోంది. ఎన్‌హెచ్ 342, 42తోపాటు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేల నిర్మాణం జరుగుతోంది. వాటి నిర్మాణాన్ని ఎవరూ కాదనరు. ప్రకృతి వనరులను ఇష్టారాజ్యంగా కొల్లగొట్టడంపైనే సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. గుత్తేదారులు నిబంధనలు పాటించి పనులు పూర్తి చేయాలి. కొందరు సమీపంలో ఉండే కొండలు, గుట్టలను తవ్వేసి.. మట్టి, రాళ్లను తరలిస్తున్నారు.

ఎన్‌హెచ్ 42 పనులు బత్తలపల్లి నుంచి ముదిగుబ్బ వరకు పూర్తికాగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొండలను కరిగించి మట్టిని వాడుకున్నారు. బెంగళూరు నుంచి విజయవాడకు వెళ్లేందుకు ఉద్దేశించిన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే ప్రకాశం జిల్లా నుంచి మొదలై పులివెందుల మీదుగా తలుపులలో జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ముదిగుబ్బ, నల్లమాడ, పుట్టపర్తి, గోరంట్ల మీదుగా కొడికొండ చెక్‌పోస్టు వరకు వెళ్లి ఎన్‌హెచ్ 44లో కలుస్తుంది. నల్లమాడ మండలం రెడ్డిపల్లి వద్ద జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులకు సమీపంలోని పీతరకుంట, రెడ్డిపల్లి చెరువుల్లో మట్టిని తోడేసి వాడుకున్నారు. మీసాలవాండ్లపల్లి వద్ద గుట్టను తవ్వారు. ముదిగుబ్బ నుంచి బుక్కపట్నం, పుట్టపర్తి, గోరంట్ల, చిలమత్తూరు మండలంలో కోడూరు వరకు ఎన్‌హెచ్ 342 వెళుతుంది. అక్కడ ఎన్‌హెచ్ 44లో కలుస్తుంది. ముదిగుబ్బ-పుట్టపర్తి వరకు మొదటి విడత 80 శాతం, పుట్టపర్తి నుంచి కోడూరు వరకు 70 శాతం పనులు జరిగాయి. ప్రస్తుతం ముదిగుబ్బలో బైపాస్ నిర్మాణం జరుగుతోంది.

**రాయల్టీ చెల్లించాల్సిందే..**

**- ఓబుళరెడ్డి, మైనింగ్ శాఖ ఏడీ**

అలైన్‌మెంట్ పరిధిలోకి వచ్చే మట్టి, రాళ్లను పనులు జరిగే ప్రదేశంలో వాడుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సమీపంలోని కొండలు, గుట్టలు, చెరువులు తవ్వితే ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాల్సిందే. ఎక్కడైనా చెల్లించకపోతే థర్డ్‌పార్టీ తనిఖీలు చేసి బిల్లుల్లో కోత విధిస్తుంది.

**ఇంజినీర్లు ఏమంటున్నారంటే..**

రహదారుల నిర్మాణానికి అవసరమైన మట్టి.. పనులు చేసేచోటే లభిస్తోంది. ఎక్కడైనా అవసరమైతే రైతులతో మాట్లాడుకుని ఒప్పందం మేరకు తవ్వుతున్నారు.

# నాడి పట్టే వారేరీ?

కదిరి : పేదల వాడలు, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతో ప్రారంభించిన ప్రాథమిక, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల కొరత వేధిస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నివాసాల మధ్య మురుగునీరు నిల్వ ఉంటోంది. వీటివల్ల దోమల ఉద్ధృతి పెరిగి జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రోజూ సరాసరిన 60 మంది రోగులు వస్తుంటారు. వీరితోపాటు గర్భిణులు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడేవారు చికిత్స కోసం వస్తుంటారు. ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు లేనికారణంగా సిబ్బంది ప్రథమ చికిత్స చేసి మందులు ఇచ్చి పంపుతున్నారు. రోగం తగ్గని స్థితిలో ప్రైవేటు వైద్యశాలలకు వెళ్తున్నట్లు బాధితులు వాపోతున్నారు.

**ఇన్‌ఛార్జిలే దిక్కు..** కదిరి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోగులకు అందుబాటులో ఉంటాయి. రాజీవ్‌గాంధీనగర్, మూర్తిపల్లి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఇన్‌ఛార్జి వైద్యులు రోజు మార్చి రోజు సేవలందిస్తున్నారు. రాజీవ్‌గాంధీనగర్ ఆరోగ్య కేంద్రానికి నిజాంవలికాలనీ వైద్యుడు, మూర్తిపల్లికి కుటాగుళ్ల వైద్యురాలు ఇన్‌ఛార్జిలుగా ఉన్నారు. రాజీవ్‌గాంధీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ వైద్యుడు ఉన్నప్పుడు రోజూ 120 మందికిపైగా వైద్యం కోసం వచ్చేవారు. ప్రస్తుతం వారి సంఖ్య 50కి పడిపోయింది. **ఖాళీల భర్తీకి ప్రకటన ఇచ్చాం - ఫైరోజా బేగం, డీఎంహెచ్‌వో**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వైద్యుల భర్తీకి ప్రకటన వెలువడింది. నియామకాలు చేపట్టగానే ఖాళీలు భర్తీ చేసి ప్రజలకు వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటాం.

# రూ. కోట్లకు మంత్రం.. అడుగుకో కుతంత్రం

విశాఖపట్నం: అన్నీ అనుకున్నట్లు జరిగితే రూ. కోట్లలో సొమ్ములొస్తాయ్! అలా కాకుండా పరిహారం భూములు దక్కినా లాభం భారీగానే ఉంటుంది!! ఇదీ కొందరి కుట్ర.

**అదెలా సాధ్యం:** భీమిలి మండలం అన్నవరంలో సర్వే నంబరు 101లో ప్రభుత్వానికి 40 ఎకరాలున్నాయి. ఇక్కడ ఎకరం ధర దాదాపు రూ. 10 కోట్ల వరకూ ఉంటుంది. వీటిని పర్యాటకశాఖకు రెవెన్యూ విభాగం 2023లోనే బదలాయించింది. హెూటల్ నిర్మాణానికి ఇటీవల ఓ ప్రముఖ సంస్థకు పర్యాటకశాఖ అప్పగించింది. అయితే...విలువైన ఈ భూములను కొట్టేసేందుకు భూమాఫియా రంగంలోకి దిగింది. రైతుల పేరుతో అనేక అడ్డదారులు తొక్కుతోంది. ప్రభుత్వ భూమికి జీపీఏ (జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ) అన్ రిజిస్టర్ డాక్యుమెంటు సృష్టించేశారు. ఈ అంశంపై కొందరు రైతులు కోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న న్యాయస్థానం నిబంధనల ప్రకారం ముందుకువెళ్లండని ఆదేశించడంతో అధికారులు ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు.

**వెనుకబడిన వర్గాల జీవనోపాధికి**

ఈ భూములు 28 మంది రైతుల సాగులో ఉన్నట్లు అధికారులకు పలువురు వినతిపత్రాలిస్తున్నారు. వారికి న్యాయం చేయాలంటున్నారు. వాస్తవానికి ఈ భూములను వెనుకబడిన వర్గాల జీవనోపాధి నిమిత్తం సాగు చేయడానికి అప్పగించాలని గతంలో నిర్ణయించారు. అయితే...ఆ నిర్ణయం అమలులోకి రాలేదు. ఈ పథకం కింద అప్పగించినా వాటిని



సాగు చేసుకోవడానికే తప్ప ఆ భూములపై ఎటువంటి హక్కులుండవు. అధికారులు విచారించగా... ఆ పథకం కింద ఎవరికీ భూముల్వివ్వలేదని తేలింది. ఆ భూములను ఇచ్చినా ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే ఇవ్వాలి. ఇప్పుడు వినతి ఇస్తున్న రైతుల్లో ఆ వర్గాల వారు లేరు. దీంతో ఆ పథకం కిందైనా వర్తించదని అధికారులు గుర్తించారు.

ఈ భూములకు సంబంధించి మరింత లోతుగా విచారణ జరపగా గతంలో ఓ తహసీల్దార్ తప్పుడు నివేదిక ఇవ్వడంతో ఆ లొసుగు ఆధారంగా ప్రస్తుత వ్యవహారాలు సాగుతున్నట్లు తెలిసింది. ఆ నివేదిక చెల్లదని అధికారులు పేర్కొంటున్నారు.

ఈ భూములకు సమీపంలో గతంలో వీఎంఆర్‌డీఏ భూసమీకరణ చేపట్టింది. ఆ సమయంలో ఆక్రమణదారులకు పరిహారం కింద అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇచ్చారు. ఇక్కడే తామూ సాగు చేస్తున్నామని కొందరు చెప్పుకొస్తున్నారు. అధికారులు ఈ భూములకు పరిహారంగా భూములు అప్పగిస్తే వాటిని తమ గుప్పిట్లో పెట్టుకునేందుకు తెరవెనుక సూత్రధారులు కాచుక్కూర్చున్నారు.

ఆధారాలు చూపిస్తే న్యాయం చేస్తాం: అన్నవరంలో డీపట్టా భూములను గతంలో భూసమీకరణలో తీసుకున్నాం. అవి కాకుండా 98 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దానిని పర్యాటకశాఖకు బదలాయించగా ఆ స్థలాన్ని పలు సంస్థలకు అప్పగించింది. ఇక్కడ పనులు చేస్తున్న సంస్థలకు కొందరు రైతులు అడ్డుతగులుతున్నారు. రైతులు ఆధారాలు చూపిస్తే తగిన న్యాయం చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

సంగీత్ మాధుర్, ఆర్డీవో, భీమిలి

# అరట్లకోట.. ఉపాధ్యాయుల కోట

పాయకరావుపేట : ఉపాధ్యాయ కొలువు పొందాలంటే అహర్నిశలు శ్రమించాలి. సిలబస్‌పై పట్టు ఉండాలి. టెట్, డీఎస్సీల్లో తిరుగులేని మార్కులు సొంతం చేసుకోవాలి. లక్షల్లో పోటీ ఉన్న ఉద్యోగం సాధించడం అరుదైన గౌరవం. ఒకరు కాదు ఇద్దరూ కాదు... తాజాగా విడుదలైన డీఎస్సీ ప్రతిభా జాబితాలో అరట్లకోటకు చెందిన 10 మంది ఉద్యోగాలు సాధించి ఊరి పేరును ఉపాధ్యాయుల కోటగా మార్చారు. ఒక్కరితో మొదలై... 1989లో ఒక్కరితో మొదలైన ఉపాధ్యాయ ఉద్యోగ ప్రస్థానం ఈ రోజుకు కొత్తవారితో కలిపి 35కు చేరుకుంది. గ్రామానికి చెందిన అన్నంనీడి అప్పారావు తొలిసారిగా ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెట్టారు. ఇప్పటివరకు గ్రామంలోని ఉపాధ్యాయుల సంఖ్య 25. వీరిలో కొంతమంది ఒకేచోట ఇళ్ల నిర్మాణం చేసుకుని టీచర్స్ కాలనీగా నామకరణం చేశారు. సీనియర్లు ఇచ్చిన స్ఫూర్తి...బోధనపై ఆసక్తితో వీరంతా ఈ రంగంలోకి వస్తున్నారు. తాజా డీఎస్సీలో గర్లంక ప్రసాదరావు, జి.వెంకటరమణ, జి.శ్రావణి, బి.వెంకటదుర్గ, జి.రాజేష్, పి.రాజా, బి.చిన్ని, ఎన్.శ్రీను, బి.రామాంజనేయులు, జి.అనిత ఉద్యోగాలు సాధించారు. మారుమూల గ్రామీణ ప్రాంతానికి చెందిన వీరంతా ఉత్తమ ర్యాంకులతో సత్తా చాటడం విశేషం. **ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో...** చిన్నప్పట్నించి ఉపాధ్యాయుడు కావాలన్నదే నా కోరిక. ఈ వృత్తిపై మక్కువ



పెంచుకున్నాను. నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి పట్టుదలతో చదివా. మా కన్నా ముందు ఉద్యోగాలు సాధించిన వారిని స్ఫూర్తిగా తీసుకున్నాం.జి.రాజేష్, అరట్లకోట

**సైన్సు అంటే ఎంతో ఇష్టం...** సైన్సు సబ్జెక్టులంటే ఎంతో ఇష్టపడేదాన్ని. ముఖ్యంగా భౌతిక శాస్త్రాన్ని చాలా ఇష్టంగా చదివేదాన్ని. బీఈడీలో ఇదే సబ్జెక్టు ఎంచుకున్నా. ఉపాధ్యాయురాలిగా మారాలన్న తపన నిజమైంది. పాఠ్యాంశాల బోధనలో ప్రత్యేకత చాటుకుంటాం. బి.వెంకటదుర్గ విద్యార్థులను తీర్చిదిద్దడంలోనే.. మెరుగైన సమాజం నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైంది. అందుకే ఈ రంగాన్ని ఎంచుకున్నా. మంచి ఉపాధ్యాయినిగా పేరు తెచ్చుకుంటా. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతా.జి.శ్రావణి

చురకలు



# పుర పీఠమెక్కేదెవరు?

మార్కాపురం: మార్కాపురం పురపాలక సంఘం ఛైర్మన్ పీఠం గత రెండు నెలలుగా ఖాళీగా ఉండడం విమర్శలకు తావిస్తోంది. పట్టణంలో మొత్తం 35 వార్డులుండగా, గత ఎన్నికల్లో తెదేపా 5 వార్డుల్లో మాత్రమే గెలుపొందింది. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పలువురు వైకాపా కౌన్సిలర్లు తెదేపా గూటికి చేశారు. దీంతో సంఖ్యాబలం పెరగడంతో జూన్ 11న కౌన్సిల్‌లో ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి నెగ్గడంతో ఛైర్మన్ పీఠం నుంచి వైకాపాకు చెందిన బాలమురళీకృష్ణ దిగిపోవాల్సి వచ్చింది. అయితే ఇది జరిగి రెండు నెలలకు పైగా కావస్తున్నా ఛైర్మన్ పీఠంపై కూటమి నేతలు కూర్చొవాల్సి ఉన్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తు



తున్నాయి. దీనిపై తెదేపా నేతలు, కార్యకర్తల్లో అసహనం వ్యక్తమవుతోంది. అటు వార్డుల్లో కూడా ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదని కౌన్సిలర్లు బహిరంగంగా విమర్శిస్తున్నారు. సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియడం లేదని వాపోతున్నారు. మున్సిపల్ చట్టం సెక్షన్ 46 ప్రకారం నెలకొకసారి క్రమం తప్పకుండా కౌన్సిల్ సమావేశం నిర్వహించాల్సి ఉన్నా నిర్వహించక పోవడంతో పాలనా పరమైన వ్యవహారాలు స్తంభించిపోయాయి. ఛైర్మన్ ఎన్నికపై ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత లేకపోవడం గమనార్హం.

# అక్రమాలకు అడ్డుకట్ట!

ఒంగోలు :గ్రామాల సుస్థిరాభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది. ఇందులో భాగంగా 'స్వర్ణ పంచాయతీ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తద్వారా డిజిటల్ సేవలు విస్తరించాలని సంకల్పించింది. దీంతో ప్రపంచంలో ఎక్కడ నివాసం ఉంటున్నా సొంతూరులోని ఇంటితోపాటు ఇతరత్రా భవనాలకు ఇక నుంచి నేరుగా ఆన్‌లైన్‌లోనే ఆస్తిపన్ను చెల్లించొచ్చు. తాజాగా 'స్వర్ణ పంచాయతీ'ల్లో భాగంగా డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గ్రామీణ ప్రాంతాల్లో నివాసగృహాలు, ఇంటి పన్నుల వివరాలు వంద శాతం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ఆదేశించింది. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయాల సిబ్బంది అసెస్‌మెంట్ల వారీగా భవన వివరాలను నమోదు చేశారు. జిల్లాలో 729 గ్రామ పంచాయతీలు ఉండగా, నివాసాలు, ఇతరత్రా ఆస్తులకు సంబంధించి 4,73,447 అసెస్‌మెంట్లు ఉన్నాయి. 2025-26 సంవత్సరానికి ఇంటి పన్ను డిమాండు రూ.31.60 కోట్లు ఉంది. ఏటా గ్రామపంచాయతీలకు ఇంటి పన్నుల రూపంలో సమకూరే సాధారణ నిధులు దుర్వినియోగమవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలోని సింగరాయకొండ, మద్దిపాడు, నాగులుప్పలపాడు, సంతనూతలపాడు మండలాల పరిధిలోని పంచాయతీల్లో లక్షలాది రూపాయలు దుర్వినియోగమయ్యాయి. అందుకు బాధ్యులైన వారిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నా నిధుల వసూలుపై మీనమేషాలు




లెక్కిస్తున్నారు. ప్రతి రోజూ ఏదోక పంచాయతీ నుంచి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇంటి, నీటి పన్నుల వసూళ్ల నుంచే పారదర్శకత తీసుకురావాలన్న ఉద్దేశంతో గత వైకాపా ప్రభుత్వం డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ప్రతి పంచాయతీలో డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించేందుకు స్కానర్‌ను కూడా ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో అమల్లోకి వచ్చేసరికి స్థానికులకు అవగాహన కల్పించకపోవడంతో డిజిటల్ లావాదేవీల విధానం అటకెక్కింది. తాజాగా కూటమి ప్రభుత్వం డిజిటల్ లావాదేవీల అమలుకు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లోని నివాసాలతో పాటు ఇతర భవన నిర్మాణాలకు సంబంధించిన పన్ను వివరాలను స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. వ్యాపార లైసెన్స్‌లు, భవన నిర్మాణ అనుమతులు, వివాహ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు..ఇలా పలు సేవలను ఇక నుంచి ఆన్‌లైన్‌లోనే పొందొచ్చు.

# వైకాపా పాపం... వైద్యానికి శాపం!

ఒంగోలు : చిత్రంలో కనిపిస్తోంది దొనకొండ మండలంలో అర్ధంతరంగా నిలిచిపోయిన విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనం. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం చేపట్టిన గత వైకాపా ప్రభుత్వం నిధులివ్వకుండా గాలికొదిలేసింది. ఫలితంగా జిల్లాలోని 241 గ్రామాల ప్రజలకు వైద్యసేవలు దూరమయ్యాయి. గతంలో రెండు మూడు గ్రామాలకు కలిపి ఒక



ఆరోగ్య ఉపకేంద్రం ఉండగా, గత వైకాపా హయాంలో ఆ విధానం రద్దు చేసి విలేజ్ హెల్త్ క్లినిక్‌లను తెరపైకి తెచ్చింది. 2020లో చేపట్టిన భవనాల నిర్మాణం ఇప్పటికీ పూర్తికాలేదు. జిల్లాలో పాత భవనాలు 49 ఉండగా, కొత్తగా 489 మంజూరు చేసి నిర్మాణ బాధ్యతలు పంచాయితీరాజ్‌శాఖకు అప్పగించారు. ఒక్కో భవనానికి తొలుత రూ.17 లక్షలు మంజూరు చేశారు. సకాలంలో నిధులివ్వకుండా జాప్యం చేయడంతో అంచనాలు పెరిగిపోవడంతో రూ.20.50 లక్షలకు పెంచారు. నాలుగేళ్లలో 248 భవనాలు నిర్మించగా, మిగిలిన 241లో 65 అసలు ప్రారంభమే కాలేదు. మిగిలినవి వివిధ దశల్లో నిలిచిపోయాయి. వీటి నిర్మాణాలు పూర్తిచేసేందుకు సుమారు రూ.17.60 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు.

# మీ కోసమే 'న్యాక్'..!



గాజువాక : నిరుద్యోగ యువతకు తగిన వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడానికి నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్(న్యాక్) సంస్థ చర్యలు చేపడుతోంది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శాఖ పరిధిలో ఈ సంస్థ విశాఖ నగరంలో మహారాణిపేట, పెదగంట్యాడలో శిక్షణ కేంద్రాలను నడుపుతోంది. 2021లో ఏర్పాటు చేసిన ఈ సంస్థ ద్వారా ఎందరో నిరుద్యోగులు స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణ పొంది ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకున్నారు.కూటమి ప్రభుత్వం ప్రతి జిల్లాలో రెండు నుంచి మూడు న్యాక్ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. స్కిల్ అప్‌గ్రేడేషన్ కింద 10 రోజుల శిక్షణ కూడా ఇస్తోంది. ఉచిత శిక్షణతోపాటు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తోంది. ఏడాది కాలంలో వివిధ కోర్సుల కింద సుమారు వెయ్యి మంది అభ్యర్థులు లబ్ధి పొందారు. నిపుణుల పర్యవేక్షణలో కోర్సు పూర్తి చేసే అవకాశం ఉంది. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్ అందిస్తారు. వివిధ సంస్థల్లో ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకుంటారు.

శిక్షణ వీటిలో...

అసిస్టెంట్ ప్లంబర్ జనరల్

సర్వేయర్, ఎలక్ట్రీషియన్

జూనియర్ టెక్నీషియన్ స్మార్ట్ ఎనర్జీ మీటర్ (3 నెలలు, 10 రోజులు)

షెడ్యూల్డ్ కులాల వారికి ప్రత్యేకంగా ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్ కోర్సు.

ఉపాధి పొందేందుకు ఈ కోర్సులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

విద్యార్హత: పదోతరగతి పాస్‌లేదా ఫెయిల్

వయసు: 15 నుంచి 45 ఏళ్ల వరకూ..

# జలవనరుల హననం..!



రాజమహేంద్రవరం: కొన్ని వేల ఎకరాలకు సాగునీటి భరోసా అందించే చెరువులవి.. అక్రమార్కుల కన్ను వాటిపై పడడంతో చూస్తుండగానే బక్కచిక్కిపోయాయి. కొన్ని చోట్ల పంటలు సాగు చేస్తుండగా ఇంకొన్నిచోట్ల నిర్మాణాలు చేపట్టారు. వీటిపై దృష్టిసారించిన కూటమి ప్రభుత్వం జలవనరులు, పంచాయతీరాజ్ పర్యవేక్షణలో ఉన్నవాటిపై సమగ్ర సర్వే చేపట్టింది. దీంతో అక్రమార్కుల బండారం వెలుగుచూస్తోంది. ఇప్పటికి రాజమహేంద్రవరం డివిజన్‌లో ఒకటి, కొవ్వూరు డివిజన్ పరిధిలో 11 చోట్ల మాత్రమే ఆక్రమణలు తొలగించారు.

**అత్యధికంగా రాజానగరం, నల్లజర్లలోనే..**

రాజానగరం మండల పరిధిలో 250 చెరువులున్నాయి. 33 చోట్ల 271 మంది 101 ఎకరాలను ఆక్రమించారు. పంటలు, దుకాణాలు, ప్రార్థనా మందిరాలు కనిపిస్తున్నాయి. ఇంతవరకు కనీస చర్యలు లేవు. నల్లజర్లలో 110 చెరువులకుగాను 29 చోట్ల ముప్పై నాలుగు ఎకరాలను 111 మంది ఆక్రమించారు.

గోకవరంలో 120 వనరులుండగా ఆరు ప్రాంతాల్లో 42 మంది పదెకరాల్లో పాగా వేశారు.రాజమహేంద్రవరం గ్రామీణంలో 39 చెరువులు కనిపిస్తున్నాయి. వీటిలో 8 చోట్ల 489 మంది 12 ఎకరాలు కబ్జా చేశారు. అధికారులు 0.8 ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. చాగల్లులో 15 సాగునీటి వనరులుండగా అన్నిచోట్లా ఆక్రమణలే. 93 మంది దాదాపు 5 ఎకరాలు ఆక్రమించి దర్జాగా అనుభవిస్తున్నా పట్టడం లేదు. తాళ్లపూడి మండల పరిధిలో 46 వనరులకుగాను పది ప్రాంతాల్లో 6.15 ఎకరాలు ఆరుగురి చేతుల్లో ఉంది. అక్కడి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బిక్కవోలులో ఒక చెరువును 62 మంది ఆక్రమించి 1.03 ఎకరాలను సొంతానికి వినియోగిస్తున్నారు. ఉండ్రాజవరంలో 22 చెరువుల్లో ఇరవైరెండు మంది పాగా వేసి రెండెకరాలు, నిడదవోలులో 1.05 ఎకరాలను మరికొందరు కబ్జా చేశారు.

**సాగుకు కష్టాలు...**

గోకవరం మండలం అచ్యుతాపురంలో రాజు చెరువు గర్భం అన్యాక్రాంతమవడంతో నిల్వ సామర్థ్యం తగ్గి ఏటా నీటి కష్టాలు తప్పడం లేదు. 56 ఎకరాల్లోని చెరువు సగం మేర ఆక్రమణల్లో ఉంది. శివారులోని వీర్లంకపల్లి వద్ద ఉన్న రాజు చెరువు, గాదెలపాలెంలో ఇసుకపల్లివారి చెరువు, తంటికొండలోని బద్దిరెడ్డివారి చెరువులదీ ఇదే పరిస్థితి.

**తొలగించేందుకు చర్యలు..**

మండల స్థాయిలో సాగునీటి వనరుల ఆక్రమణలను గుర్తించి రెవెన్యూ అధికారులు ఆ జాబితాలను జలవనరులశాఖ అధికారులకు అప్పగించారని ఓ ఉన్నతాధికారి తెలిపారు. సంబంధిత శాఖల సమన్వయంతో కబ్జాలు తొలగించి, పూర్తి ఆయకట్టుకు నీరందేలా చర్యలు చేపడతామన్నారు.

**ఇదీ లెక్క**

తూర్పులో చెరువులు : 2,571

విస్తీర్ణం : 16 వేల ఎకరాలు

అక్రమార్కులు : 1210 మంది

కబ్జాకు గురైన చెరువులు : 143

అన్యాక్రాంతమైన విస్తీర్ణం : 200 ఎకరాలు

# పుష్కర.. ఆయకట్టుకు ఆసరా



కాకినాడ : జిల్లాలో మెట్ట ఆయకట్టుకు కీలకమైన పుష్కర ఎత్తిపోతల పథకానికి సంబంధించి రైతులకు తీపి కబురు అందింది. గత వైకాపా పాలకుల నిర్లక్ష్యంతో మూలకు చేరిన ఈ పథకాన్ని పట్టాలెక్కించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 31 వేల ఎకరాలకు మేలు జరిగేలా అడుగులు వేసింది. రూ.52 కోట్ల అంచనాతో చేపట్టే కొత్త పైప్‌లైన్‌కు రాష్ట్ర మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపింది. త్వరలో కార్యరూపంలోకి తెచ్చి ఆయకట్టు రైతులకు సాగునీటి భద్రతను కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. గండేపల్లి మండలం తాళ్లూరు శివారు పోలవరం కాలువ గట్టుపై తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం ఉంది. దీని పైపులైన్లు పాడైపోవడంతో గత మూడు ఖరీఫ్ సీజన్లలో ఆయకట్టు రైతులకు నీరు అందించలేకపోయారు. గండేపల్లి, జగ్గంపేట మండలాల పరిధిలో సుమారు 3.56 కి.మీ మేర మూడు వరుసల్లో సిమెంటు పైపులున్నాయి. పథకం నుంచి నీటిని విడిచిపెట్టేటప్పుడు ఒత్తిడికి ఈ పైపులు ఎక్కడికక్కడ పగుళ్లు ఏర్పడి లీకేజీతో నీరంతా వృథాగా పోతుంది. శివారు భూములకు చేరడం గగనంగా మారేది. కొన్నాళ్ల నుంచి ఈ పైపులైన్ల స్థానంలో ఇనుప పైపులు వేయాలని ప్రతిపాదనలు పంపిస్తున్నా ఫలితం లేకుండా పోయింది. వైకాపా హయాంలో సీఎస్సార్ నిధులతో కొంతమేర మరమ్మతులు చేసినా అవి మూన్నాళ్ల ముచ్చటగానే మారిపోయాయి. నాలుగు మండలాల పరిధిలో 31 వేల ఎకరాలకు సాగు ప్రశ్నార్థకమైంది.

**ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి..**

పుష్కర ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించాలని ఇటీవల జడ్పీ సర్వసభ్య సమావేశంలో జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ అధికారులను కోరారు. ప్రాజెక్టు దుస్థితిని, రైతుల అవస్థలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో నిధులు సాకారమయ్యాయి. ఈ నెలలోనే టెండర్లు పిలిచి గుత్తేదారులకు అప్పగించి పనులు త్వరితగతంగా అయ్యేలా చూస్తామని నెహ్రూ చెబుతున్నారు.

# అక్రమానికి.. అధికారిక అండ!

అమలాపురం : ఓడలరేవు రెవెన్యూ పరిధిలో 947/1, 947/2ఏ సర్వే నంబర్లలో 12 ఎకరాల వరకు సీఆర్‌జడ్ పరిధిలోకి వస్తుంది. ఇక్కడ తవ్విన చెరువులకు 939 సర్వే నంబరుపై తీసుకున్న మత్స్యశాఖ ధ్రువీకరణ పత్రం ద్వారా విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు దరఖాస్తు చేశారు. స్థానికులు వ్యతిరేకిస్తున్నా.. ఓ నాయకుడు అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం. సఖినేటిపల్లి, మలికిపురం, మామిడికుదురు మండలాల సీఆర్‌జడ్ పరిధిలో 550 ఎకరాల్లో అనధికారిక ఆక్వా సాగు జరుగుతోంది. ఎన్జీటీ ఆదేశించినా పూర్తి స్థాయిలో తొలగించలేదు.ఓడలరేవులో ఒకరు ట్రాన్స్‌ఫార్మర్‌కు దరఖాస్తు చేశారు. ఇక్కడి చెరువులు సీఆర్‌జడ్‌కు 500 మీటర్లకు లోపల ఉన్నా.. 543 మీటర్లుగా అధికారులు తప్పుడు నివేదిక ఇచ్చారు.

కోస్టల్ రెగ్యులేషన్ జోన్(సీఆర్‌జడ్) పరిధిలో రొయ్యల చెరువులు, ఇతర నిర్మాణాలు ఉండకూడదని జాతీయ హరిత ట్రైబ్యునల్ నిబంధనలు ఉన్నా.. కొంతమంది వీటిని తుంగలోకి తొక్కుతున్నారు. కొందరు అధికారులు అక్రమార్కులకు అండదండలు అందించడంతో వీరి ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు.

**తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో..**

రొయ్యల చెరువుల సాగుదారులు అనుమతులకు దరఖాస్తు చేసుకున్న సర్వే నంబర్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి. అవి సీఆర్‌జడ్ పరిధిలోకి



వస్తాయా..? జిరాయితీయా..? డి.పట్టా భూములా..? అనే విషయాలను పూర్తి స్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలి. కొందరు రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు మామూళ్లకు అలవాటుపడి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీటిని పరిశీలించకుండానే ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చేస్తున్నారు.

**తనిఖీలు నామమాత్రం**

అక్రమ విద్యుత్తు వినియోగాన్ని అడ్డుకునేందుకు ట్రాన్స్‌కోలో విజిలెన్స్ విభాగం ఉంది. ఇక్కడి అధికారులు, సిబ్బంది ఫిర్యాదులు వచ్చిన ప్రతిసారీ నామమాత్ర తనిఖీలు నిర్వహించి అంతా సవ్యంగా ఉందని వెళ్లి పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతంలో అక్రమార్కులకు అడ్డూఅదుపు లేకుండాపోతోంది.

**ఇతరులకు అమ్ముతూ..**

కొంతమంది ఇతర ప్రాంతాల్లోని సర్వే నంబర్లతో సీఆర్‌జడ్ పరిధిలో విద్యుత్తు కనెక్షన్లు ఏర్పాటు చేస్తున్నారు. వీరికి ప్రభుత్వం నుంచి విద్యుత్తు రాయితీ వస్తోంది. మళ్లీ వీరు పక్కన ఉన్న చెరువులకు యూనిట్ రూ.6 నుంచి రూ.9 వరకు విక్రయిస్తుండటం గమనార్హం.

**గుర్తించి చర్యలు తీసుకుంటాం**

సీఆర్‌జడ్ పరిధిలోని విద్యుత్తు కనెక్షన్లపై సర్వే నిర్వహిస్తాం. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో కనెక్షన్లు తీసుకున్నవారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. అనధికారికంగా విద్యుత్తు అమ్ముతున్నట్లు విచారణలో తేలితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

రాజేశ్వరి, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్

# సేద్యపు కుంట.. ఉండదు నీటిచింత..!

రాజమహేంద్రవరం: నీటి వనరుల పునరుద్ధరణతో భూగర్భ జలాలు వృద్ధి, నీటి సంరక్షణపై కూటమి సర్కారు దృష్టి సారించింది. వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునేలా సాగు భూముల్లో సేద్యపు కుంటల తవ్వకాలను ప్రోత్సహిస్తోంది. జిల్లాలోని మెట్టప్రాంతంలో ఎక్కువ శాతం వ్యవసాయం వర్షాధారంపైనే ఆధారపడి ఉంది. వర్షం కురిసినప్పుడు ఆ నీటిని సేద్యపు కుంటల్లోకి మళ్లించి సాగు అవసరాలకు వినియోగించుకునేలా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) ద్వారా ఈ ఏడాది జిల్లాలో 1,500 సేద్యపు కుంటలు తవ్వాలని లక్ష్యంగా నిర్దేశించింది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 11 మండలాల పరిధిలోని 198 గ్రామాల్లో నీటి కుంటల తవ్వకానికి అనువుగా ఉన్న ప్రదేశాలు గుర్తించింది. ఉపాధి క్షేత్ర సహాయకులు (ఫీల్డ్ అసిస్టెంట్లకు) మండలాల



వారీగా శిక్షణ అందించారు. మొదట 1,229 సేద్యపు కుంటల తవ్వకాలకు పరిపాలన ఆమోదం కూడా లభించింది. ఏప్రిల్, మే నెలల నుంచి ఉపాధి కూలీలతో పంట భూములు, పండ్ల తోటల్లో పనులు ప్రారంభించి, ఇప్పటి వరకు 772 సేద్యపు కుంటల తవ్వకాలు పూర్తి చేశారు. మరో 200 చోట్ల పనులు పురోగతిలో ఉన్నాయి. ఇంకా 257 సేద్యపు కుంటల తవ్వకం పనులు ప్రారంభించాల్సి ఉంది. త్వరలోనే ఆ పనులు కూడా చేపట్టి లక్ష్యాన్ని పూర్తి చేస్తామని డ్వామా పీడీ నాగమల్లేశ్వరరావు చెబుతున్నారు.

తమ పొలాల్లో, పండ్ల తోటల్లో సేద్యపు కుంటలు ఏర్పాటుకు ముందుకొచ్చిన రైతులకు పైసా ఖర్చు లేకుండానే ఎన్ఆర్‌జీఈఎస్ నిధులతోనే వాటి తవ్వకాలు చేపడుతున్నారు. ఒక్కొక్క దానికి రూ.40 వేల నుంచి రూ.1.40 లక్షల వరకు నిధులు వెచ్చించి రూ.276 సగటు వేతనంతో ఉపాధి కూలీలతో తవ్వకాలు చేపడుతున్నారు.

## ప్రకృతి సాగు.. ఆదాయం బాగు!

అనంతపురం : ప్రకృతి సాగు పద్ధతిలో వ్యవసాయం రైతుల పాలిట కల్పతరువుగా మారుతోంది. కొద్దిపాటి విస్తీర్ణం.. తక్కువ పెట్టుబడులతో రైతులు స్వల్పకాలిక పంటలు సాగు చేస్తుండడంతో దిగుబడులతోపాటు రోజువారీగా ఆదాయం పొందుతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో సుమారు 8,600 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. మొత్తం రైతులు 4,500 మందికి పైగా ఉన్నారు. వారిలో 80 శాతం మందికిపైగా మహిళలు ఉండటం విశేషం. పురుగు మందులు లేకుండా సేంద్రియ విధానంలో ఘన, ద్రవ జీవామృతం, పేడ, వేప నూనె.. తదితరాలు వినియోగించి కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు.

**కుటుంబానికి ఆసరా..** – భాగ్యమ్మ, మల్లిపల్లి



ఎకరాలో వేరుసెనగ, టమాటాతోపాటు 20 సెంట్లలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా. రూ.5 వేలు పెట్టుబడి పెట్టా. 15 రోజులకే ఆకుకూరలు, 25 రోజులకు కూరగాయలు చేతికి వస్తున్నాయి. రోజుకు రూ.4,500 ఆదాయం వస్తోంది.


**రోజుకు రూ.5 వేల సంపాదన**– గంగమ్మ, భట్టువానిపల్లి

ఏడాదిగా ప్రకృతి పంటల సాగు చేస్తున్నాం. 25 సెంట్లల్లోనే కూరగాయల పంటలు వేశా. క్వింటాలు నుంచి రెండు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. కళ్యాణదుర్గంతోపాటు బళ్లారి మార్కెట్లకు తీసుకెళ్లి విక్రయిస్తున్నాం. రోజుకు రూ.5 వేల వరకు ఆదాయం వస్తుంది.

## 'స్మార్ట్' రేషన్‌కార్డులొచ్చాయ్..!

పుట్టపర్తి, : కూటమి ప్రభుత్వం నిర్ణయంతో జిల్లాలోని రేషన్‌కార్డుదారులకు 'స్మార్ట్' రేషన్‌కార్డులు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే జిల్లాకు అవసరమైన కార్డులు సహాయ పౌర సరఫరాల అధికారి (ఏఎస్‌ఓ), మండల కార్యాలయాలకు చేరాయి. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాగానే, పంపిణీ ప్రారంభిస్తారు.

**అర్హులందరికీ...:** ఇటీవల జిల్లా వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 45,582 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 43,101 మందిని అర్హులుగా తేల్చారు. 2481 దరఖాస్తులు విచారణ దశలో ఉన్నాయి.



కొత్తగా అర్హులైన వారికి, ఇప్పటికే కార్డులు ఉన్న వారందరికీ స్మార్ట్ కార్డులు అందిస్తారు. వైకాపా పాలనలో జగన్ ఫొటోతో కార్డులు జారీ చేశారు. ఇప్పుడు కొత్తగా ఇవ్వబోయే కార్డులపై ఏ నాయకుల ఫొటోలు ఉండవు. విశాఖ జిల్లాలో ప్రస్తుతం 5,24,989 రేషన్‌కార్డులు ఉన్నాయి. వాటి స్థానే 5,17,149 స్మార్ట్‌కార్డులు వచ్చాయి. మిగిలిన 7,840 కార్డులు సాంకేతిక పరమైన సమస్యల కారణంగా రాలేదు. ఆయా సమస్యల్ని పరిష్కరించిన తర్వాత వాటినీ జారీ చేస్తారు.

ప్రత్యేక యాప్ సిద్ధం: కార్డుల పంపిణీకి ప్రత్యేకంగా ఓ యాప్ సిద్ధం చేశారు. ఆ యాప్‌లో కార్డుదారుల పేర్లు నమోదు చేయాల్సి ఉంటుంది. గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా పంపిణీ చేయాలా..?, రేషన్ డిపోల వద్ద ఇవ్వాలా...? అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. ఒకటి రెండు రోజుల్లో కార్డుల పంపిణీకి సంబంధించిన మార్గదర్శకాలు వచ్చే అవకాశం ఉందని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు.

## లెక్కల్లో యూనిట్లు.. కానరాక ఇక్కట్లు

మయూరికూడలి : విజయనగరానికి చెందిన ఓ ఆటో చోదకుడు రాయితీ రుణం ద్వారా కొత్త వాహనం కొనుగోలు చేయాలని భావించాడు. బీసీ విభాగం కింద దరఖాస్తు చేశాడు. ముఖాముఖికి హాజరయ్యాడు. బ్యాంకు అధికారులు వివిధ రకాల ధ్రువపత్రాలు తీసుకున్నారు. అయితే ఇప్పటివరకు యూనిట్ మంజూరు కాలేదు. ఇటీవల అప్పు చేసి కొనుగోలు చేశాడు. పేద, మధ్యతరగతి వర్గాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లను ప్రారంభించింది. వాటి ద్వారా స్వయం ఉపాధి కల్పించేందుకు యూనిట్లు మంజూరు చేస్తామని చెప్పింది. ఈమేరకు బీసీ, ఈబీసీ, ఎస్సీ, మైనార్టీ వర్గాల నుంచి అధికారులు దరఖాస్తులు ఆహ్వానించారు. బీసీ, ఈబీసీ వారికి ముఖాముఖిలు సైతం నిర్వహించారు. కానీ ఇప్పటివరకు ఒక్కరికీ లబ్ధి కలగలేదు.

**సాయం ఇలా..**రూ.3 లక్షల విలువైన యూనిట్ ఏర్పాటు చేసుకుంటే అందులో 50 శాతం(బీసీ వారికి) వరకు రాయితీ దక్కుతుంది. మిగిలిన సొమ్మును బ్యాంకుల నుంచి రుణంగా పొందవచ్చు. మిగిలిన వారు 40 శాతం నుంచి 50 శాతం వరకు సబ్సిడీ పొందవచ్చు. అయితే నిధులు రాకపోవడంతో బ్యాంకర్లు వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

**ఒక్కటీ లేదు..**

బీసీ, ఈబీసీ, మైనార్టీ, ఎస్సీ వర్గాల్లో 21 సంవత్సరాలు దాటిన వారికి యూనిట్లు కేటాయించాలి. 150 రకాల జీవనోపాధులు పొందే అవకాశం కల్పించారు. విభాగాల వారీగా దరఖాస్తులు తీసుకున్నారు. రెండు జిల్లాలకు సంబంధించి 5,863 యూనిట్లు కేటాయించారు. ఈమేరకు రూ.137.52 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే సుమారు 49,850 దరఖాస్తులు అందాయి. తొలి విడతలో ఈబీసీ, బీసీ వారికి మౌఖిక పరీక్షలు చేపట్టారు. అందులో అర్హులైన వారిని గుర్తించి, ధ్రువపత్రాలను బ్యాంకర్లకు అందించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పరిశీలించి, యూనిట్లు కేటాయించాలి. ఇంతవరకు ఆ ప్రక్రియ కానరావడం లేదు. **నాయకుల దోపిడీ..**దరఖాస్తుదారులకు యూనిట్లు మంజూరయ్యేలా చూస్తామని కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు దోపిడీ చేశారు. ఓ నియోజకవర్గంలో రూ.లక్షల్లో వసూలు చేశారనే ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మరోవైపు మౌఖిక పరీక్షల సమయంలో కుల, ఆదాయ, ప్రాజెక్టు రిపోర్టు తదితర ధ్రువపత్రాలను ఇచ్చారు. వీటి కోసం కార్యాలయాల చుట్టూ తిరిగారు. దీంతో కొందరు అధికారులకు సైతం డబ్బులివ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏర్పాటుకు సంబంధించి ఇప్పటివరకు ఆదేశాలు రాలేదని, త్వరలోనే చర్యలు తీసుకుంటామని బీసీ, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు పెంటోజీరావు, వెంకటేశ్వరరావు తెలిపారు.

## బోలెడు దూరం.. రవాణా భారం



పాడేరు: వాహనం రోడ్డెక్కాలంటే సామర్థ్య ధ్రువీకరణ (ఫిట్‌నెస్ సర్టిఫికెట్) తప్పనిసరి. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో అత్యధిక మండలాల వాహనదారులు ఈ ధ్రువపత్రం తెచ్చుకోవడానికి ఆపసోపాలు పడాల్సి వస్తోంది. ఒకరోజు మొత్తం వెచ్చిస్తే తప్ప ఈ ధ్రువపత్రం చేతికిరాని పరిస్థితి.

సబ్బవరం హైవేకి సమీపంలో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ఇక్కడ యంత్ర పరికరాలతో వాహనాలను తనిఖీ చేసి సామర్థ్యానికి అనుగుణంగా ఉందా.. లేదా అని ధ్రువీకరిస్తారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 22 మండలాలు, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 12 మండలాల వాహన యజమానులకు ఈ కేంద్రం చాలా దూరంలో ఉంది. అల్లూరి జిల్లాలోని గూడెంకొత్తవీధి, కొయ్యూరు, ముంచంగిపుట్టు మండలాల్లోని కొన్ని గ్రామాల ప్రజలు ముందురోజు రాత్రి బయలుదేరితే తప్ప సబ్బవరం ఉదయానికి చేరుకోలేని పరిస్థితి. ఒకవైపు ప్రయాణానికే 150 కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. అనకాపల్లి జిల్లాలోనూ నర్సీపట్నం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి 100 కి.మీ ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నర్సీపట్నం ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం పరిధిలో 3400 ఆటోలు, సుమారు 800 మ్యాక్సీ క్యాబ్‌లు, 82 ప్రైవేట్ బస్సులు, 190 స్కూల్ బస్సులు, ఉన్నాయి. మిగిలిన వాహనదారులతో పోలిస్తే కంటే.. ఆటో యజమానులే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లకు ఎక్కువ ఇబ్బంది పడుతున్నారు. ఆటో కొనుగోలు చేసిన తర్వాత మొదటి నాలుగేళ్లు రెండేళ్లకు ఒకసారి, ఆ తర్వాత ప్రతి ఏడాది ఫిట్‌నెస్ చేయించుకోవాలి. రోజూ నర్సీపట్నం చుట్టుపక్కల నుంచి 80కిపైగా ఆటోలు సబ్బవరం ఏటీఎస్‌కి వెళ్తున్నట్లు ఆటో కార్మిక సంఘం నాయకులు చెబుతున్నారు. చలానాకు అయ్యే ఖర్చుతోపాటు అదనంగా మరో రూ. 1000 ఖర్చు అవుతోందని... దీనికితోడు ఒకరోజు ఆదాయం కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సీపట్నం చుట్టుపక్కల మరో ఏటీఎస్ ఏర్పాటు చేస్తే.. ఏజెన్సీ మండలాలకు, నర్సీపట్నం పరిసర గ్రామాల వాహనదారులకు మేలు జరుగుతుంది.

**కొరవడిన పర్యవేక్షణ..**ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీలో మధ్యవర్తుల ప్రమేయం, అవినీతి లేకుండా, పారదర్శకత కోసం ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రభుత్వం ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ విధానాన్ని తీసుకొచ్చింది. కానీ.. వాహనాల సామర్థ్యాన్ని సరిగా తనిఖీ చేస్తున్నారా.. లేదా? అనేది ఎవరూ చెప్పలేని పరిస్థితి. వాస్తవానికి వీటి నిర్వహణపై జిల్లా రవాణా అధికారుల పర్యవేక్షణ ఉండాలి. కానీ వారికి దీంతో ఏ సంబంధం లేకుండాపోయింది. ఏటీఎస్ నిర్వహణ, దూరాభారంపై జిల్లా రవాణా శాఖ అధికారి మనోహర్‌తో మాట్లాడగా.. గతంలో వాహనాల సామర్థ్య పరిశీలన, ధ్రువపత్రాల జారీ తమ పరిధిలో ఉండేదని తెలిపారు. సబ్బవరం ఏటీఎస్ నిర్వహణతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

## అసత్యం.. అసభ్యం



అనంతపురం : భావప్రకటన స్వేచ్ఛ కొందరి అనుచిత పోస్టుల కారణంగా దుర్వినియోగం అవుతోంది. సమాజాన్ని ప్రభావితం చేసేలా ఇతరుల వ్యక్తిగత విషయాలతో దూషణలు, తిట్లతో కూడిన వీడియోలను విపరీతంగా పోస్టు చేస్తున్నారు. తెలిసో, తెలియక చేసే పోస్టులు, లైకులు, షేర్ల కేసుల రూపంలో మెడకు చుట్టుకునే అవకాశం ఉంది.

**నేరపూరితం..**

ఉద్దేశపూర్వకంగా గానీ, దురుద్దేశంతో కానీ వ్యక్తిత్వ హననానికి పాల్పడే సమాచారాన్ని ప్రజలకు చేరవేయకూడదు. అసత్యాలు ప్రచారం చేయకూడదు. ఎదుటి వ్యక్తులు కుటుంబాలను ఉద్దేశించి దూషిస్తూ అసభ్యకరంగా పోస్టులు పెట్టరాదు. వీటికి లైకులు కొట్టడం ఇతరులకు ఫార్వర్డ్ చేయడం నేరం. ప్రజల మధ్య కులాలు, మతాల మధ్య విద్వేషాలు రగిల్చే పోస్టులు చేస్తే జైలుకు వెళ్లక తప్పదు. చదువులు, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లే వారిపై కేసులు నమోదైతే పోలీసులు ఎన్‌వోసీ ఇవ్వరు.

**కొత్తచట్టాలతో కొరడా**

భారతీయ న్యాయసంహిత ఐటీ యాక్టు కింద నేరాల చట్టాలు ఉన్నాయి. వాటి వివరాలు క్లుప్తంగా..

ప్రముఖుల పేర్లతో కించపర్చే పోస్టులు పెడితే – 66 ఐటీయాక్ట్ కింద కేసు.. ( నేరం రుజువైతే మూడేళ్ల జైలు, రూ.లక్ష వరకు జరిమానా). అసభ్యకర పోస్టులు అప్‌లోడ్ చేస్తే – 67 ఐటీయాక్టు కింద కేసు (నేరం రుజువైతే ఐదేళ్ల జైలు, రూ.10 లక్షల జరిమానా) ఫిర్యాదు చేయవచ్చు..

డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.సైబర్‌క్రైమ్.జీవోవీ.ఇన్ వెబ్‌సైటులో ఫిర్యాదును రిజిస్టర్ చేయవచ్చు. వాటిని అధికారులు పరిశీలించి కేసులు నమోదు చేస్తారు.

36 కేసులు..

అనంతపురం జిల్లాలో ఈ ఏడాది.. ఇప్పటివరకు 36 మందిపై కేసులు నమోదు చేశారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్‌లపై విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టారు. ఇలాంటి వాటిపై పర్యవేక్షణకు జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్‌లో ప్రత్యేక విభాగం ఉంది. నలుగురు పోలీసు అధికారులు నిత్యం పరిశీలిస్తున్నారు.

## వైద్యసేవలు అరకొరే!




పుట్టపర్తి : రాష్ట్రంలోనే ఎక్కడా లేనివిధంగా కృత్రిమ పళ్లు ఇక్కడే తయారు చేసి రోగులకు అమర్చేవారు. ఇందుకుగాను 2019లో ఏర్పాటు చేసిన ఆధునిక ల్యాబ్ మూతపడింది. ప్రస్తుతం టెక్నీషియన్ ఒక్కరే ఉన్నారు. దీంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలోని జిల్లా ఆసుపత్రి ఎంతో కీలకమైంది. 200 పడకల సామర్థ్యం ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు హిందూపురం, మడకశిర, పెనుకొండ, గోరంట్ల తదితర ప్రాంతాలతోపాటు కర్ణాటకలోని సరిహద్దు గ్రామాల నుంచి నిత్యం ఓపీ విభాగానికి 800 నుంచి 1000 మంది వస్తుంటారు. ఇక 50 మందికిపైగా ఇన్‌పేషెంట్లుగా ఉంటున్నారు. 42 మంది వైద్యులకుగాను 32 మంది, 47 మంది నర్సులకుగాను 36 మంది పనిచేస్తున్నారు. వైద్యులకు ఫేషియల్ అటెండెన్స్ అమలులో ఉన్నా కొందరు ఇలా వచ్చి.. హాజరు వేసి వెళ్లిపోతున్నారు. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఓపీ చీటీ కోసం గంటల తరబడి వరుసలో నిలబడాల్సిన పరిస్థితి. ప్రత్యేక ఓపీ కౌంటర్ల విభాగం పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. ఎమ్మెల్యే బాలకృష్ణ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయించారు. గత ఐదేళ్లలో నిర్వహణపై వైకాపా ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో సేవలు మందగించాయి. గైనిక్ వార్డులో పలు కేసులను అనంతపురానికి సిఫార్సు చేస్తున్నారు.

సీటీ స్కాన్ అత్యవసరం. రూ.కోటి విలువచేసే యంత్రం మరమ్మతులకు నోచుకోవడం లేదు. శవపరీక్ష గది శిథిలావస్థకు చేరుకోవడంతో సమీపంలోని ధోబీ గదిలో తాత్కాలికంగా పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు.

**తగిన చర్యలు తీసుకుంటున్నాం**

– అన్నపూర్ణ, ఆసుపత్రి సూపరింటెండెంట్

వైద్యులు సమయపాలన పాటించేవిధంగా పర్యవేక్షిస్తాం. గైనిక్ వార్డుకు పరికరాలు వచ్చాయి. త్వరలోనే సేవలు అందుబాటులోకి తెస్తాం. దంత చికిత్స విభాగంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. రోగులకు ఇబ్బంది తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

## రూ.కోట్లు ఖర్చు.. తాగునీరొస్తే ఒట్టు!

విజయనగరం : గత ప్రభుత్వంలో జరిగిన జల్‌జీవన్ మిషన్ తొలి విడత పనుల్లో డొల్లతనం చోటుచేసుకుంది. 2020–2024 మధ్య నాలుగేళ్లపాటు దశలవారీగా వేసిన కుళాయిలు ఎక్కడా పనిచేయడం లేదు. మూణ్నాళ్లకే పైపులైన్లు పాడవడంతో నీరు రాని పరిస్థితి. ఇష్టారాజ్యంగా నాణ్యత లేకుండా పనులు చేశారు. ఏళ్లపాటు మన్నిక వచ్చేలా భూమి తవ్వి వేయాల్సిన పైపులైన్లు బయటే వేశారు. ఫలితంగా రూ.కోట్లు ఖర్చు చేసినా ఆశయం నెరవేరలేదు. నీరొస్తుందని సంబరపడ్డ పల్లె జనం ఇప్పుడు పాట్లు పడుతున్నారు.

**50 శాతం పాడై..**

బొబ్బిలి నియోజకవర్గంలో గతంలో రూ.22 కోట్లతో 176 పనులు చేపట్టారు. వీటిలో 40 శాతం వరకు పనులు పాడయ్యాయి. 50 శాతం కుళాయిలు మరమ్మతులకు గురయ్యాయి. ట్యాప్‌లు ఊడిపోవడం, పైపులైన్లు సక్రమంగా లేకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. మెట్టవలసలో రూ.30 లక్షలు, ఎం.బూర్జివలసలో రూ.15 లక్షలు, కోమటిపల్లిలో రూ.15 లక్షలు చొప్పున ఖర్చు చేసినా కుళాయిలు చాలా వరకు విరిగిపోయాయి.

గజపతినగరం నియోజకవర్గంలో రూ.7.6 కోట్లతో 162 గ్రామాల్లో ఇంటింటి కుళాయిలను ఏర్పాటు చేశారు. డోలపాలెం న్యూ కాలనీలో పైపులైన్లు సిమెంటు కట్టలు పాడవడంతో బయటకు కనిపిస్తున్నాయి. పైపులు మురుగు కాలువలో పడిపోగా స్థానికులు కర్రల సాయంతో పైకి తీసి, పెట్టారు. గజపతినగరం రైల్వే కాలనీలో నీరు సరఫరా కావడం లేదు. రెండోదశలో పాడైన కుళాయిలు సరిచేస్తామని గ్రామీణ నీటిసరఫరా విభాగం గజపతినగరం డీఈ తిరుపతినాయుడు అన్నారు.



**వైకాపా కార్యకర్తలకే అప్పగించి..**

జలజీవన్ మిషన్‌లో గత ప్రభుత్వం హయాంలో రూ.5 లక్షలలోపు పనులు నామినేషన్ పద్ధతిన గ్రామాల్లోని వైకాపా కార్యకర్తలకే అప్పగించారు. కార్యకర్తలకు లబ్ధి చేకూర్చాలన్న ఉద్దేశంతో పనులు అలా విభజించి ఇచ్చారు. ఆ సమయంలో అధికారులు ప్రశ్నించకపోవడంతో ఇష్టానుసారంగా నాసిరకం పైపులు, కుళాయిలు వేయడంతో తక్కువ కాలంలోనే పాడయ్యాయి.


**బాగుకు ప్రతిపాదనలు**

పాడైన పైపులు, కుళాయిలు సరిచేసేందుకు ఇప్పుడు రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. తెర్లాం మండలం నందబలగ, కుసుమూరు, నందిగాం గ్రామాల్లో వేసిన కుళాయిలు పనిచేయడం లేదు. వీటి మరమ్మతులకు అదనంగా మరో రూ.40 లక్షలు అవసరమని ప్రతిపాదనలు సిద్ధం చేయడం గమనార్హం. లోపాలు గుర్తిస్తున్నామని, సరిచేసేందుకు చర్యలు తీసుకుంటాని సంబంధిత బొబ్బిలి డీఈ ఢిల్లీశ్వరరావు అన్నారు.

**అరకొరగా జరిగాయి..– కవిత, పర్యవేక్షక ఇంజినీరు, గ్రామీణ నీటి సరఫరా విభాగం** గతంలో నిధులు తక్కువగా రావడంతో అరకొర పనులే జరిగాయి. కొన్ని పనులను పంచాయతీ నిధులతో చేయాలనుకున్నా అక్కడా లేకపోవడంతో వీలు కాలేదు.

## రైతులను కా'పాడి'కోవాలని..!

ఒంగోలు: ఒంగోలు డెయిరీని తెరిపించేందుకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ప్రధానంగా పాడి పరిశ్రమపై ఆధారపడిన కుటుంబాలు పెద్దసంఖ్యలో ఉన్నందున డెయిరీ తెరచుకుంటే జిల్లా అభివృద్ధిలో ఎంతో కీలకంగా మారుతుంది. ఈ నేపథ్యంలో జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ (ఎన్‌డీడీబీ)కు డెయిరీని అప్పగిస్తే ఎలా ఉంటుందన్న ప్రతిపాదన తెరపైకి తీసుకొచ్చారు. ఎన్‌డీడీబీ అధికారులను రప్పించివారితో మాట్లాడిన తరువాత నిర్ణయానికి రావాలని జిల్లా ఉన్నతాధికారులు భావిస్తున్నారు. 'గత నలభై ఏళ్లుగా పాలు పోస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ వచ్చాను.. కళ్ల ముందు డెయిరీ నిర్జీవంగా మారడం చూడలేకున్నా.. తక్షణం చర్యలు తీసుకుని తెరిపించేందుకు చర్యలు తీసుకోండి.. అని ఓ పాడి రైతు సంయుక్త కలెక్టర్ గోపాలకృష్ణ ఎదుట ఆవేదన చూస్తే డెయిరీపై ఇక్కడి వారి ఆకాంక్షలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం పాల ఉత్పత్తిదారులు, డెయిరీ మాజీ పాలకవర్గ సభ్యులు, అధికారులతో జేసీ సమావేశం నిర్వహించారు. డెయిరీ తెరవడం ఎలా అనేదానిపై సమాలోచనలు జరపడాన్ని రైతులు స్వాగతిస్తున్నారు. ప్రస్తుతం డెయిరీకి రూ.43 కోట్ల బకాయిలు ఉన్నాయి. వాటిని తీర్చడంతోపాటు తెరిచేందుకు ప్రభుత్వపరంగా




చేయాల్సిన సాయంపైన చర్చ నడిచింది. ఎన్‌డీడీబీతో సంప్రదింపులు జరపాలని నిర్ణయానికి వచ్చారు.

**గతంలో నిర్వహించింది ఈ సంస్థే..**

గుజరాత్ రాష్ట్రం ఆనంద్ నగరంలో నెలకొన్న ఎన్‌డీడీబీ దేశంలోని పాడి పరిశ్రమకు కొండంత అండగా నిలుస్తోంది. మూతపడిన వాటిని తెరిపించి సొంతంగా నిర్వహణ చేపడుతోంది. సుమారు 18 ఏళ్ల కిందట ఇదే ఒంగోలు డెయిరీని ఈ సంస్థ ఐదేళ్ల పాటు నడిపి లాభాల్లోకి తీసుకొచ్చింది. తరువాత ఒంగోలు డెయిరీ పాలక వర్గం చేతుల్లోకి రావడంతో ఈ సంస్థ నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకుంది. పాలకవర్గం సభ్యులు ఇష్టానుసారం నిధులు దుర్వినియోగం చేసి నష్టాల పాల్జేసి మూతపడేలా చేశారు. 2021లో తీసుకున్న అమూల్ సంస్థ ఏడాదిన్నర పాటు నడిపి చేతులెత్తేసింది. ఇక అప్పటి నుంచి మూలకు చేరింది. తిరిగి ఎన్‌డీడీబీని ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. ఆ సంస్థకు డెయిరీని నిర్ణీత సమయం పాటు లీజుకు ఇస్తే, వాళ్లే పెట్టుబడి పెట్టి నిర్వహిస్తారు. ఎన్‌డీడీబీ అధికారులతో మాట్లాడిన తరువాత సాధ్యాసాధ్యాలు ఎంత వరకు అనేది ఒక నివేదిక వస్తే గానీ స్పష్టత రాదు. జిల్లా ఉన్నతాధికారులు డెయిరీ విషయంలో మెరుగ్గానే వ్యవహరిస్తున్నారని, ఇదే ఊపుతో తెరిపించేందుకు శాయశక్తుల కృషి చేయాలని పాల ఉత్పత్తిదారులు కోరుతున్నారు.

చురకలు



## చూపు తిప్పనివ్వని అందాల స్టార్ కిడ్

బాలీవుడ్‌లో ప్రస్తుతం ఉన్న యంగ్ స్టార్స్‌లో ఎక్కువ శాతం స్టార్ కిడ్స్ అనడంలో సందేహం లేదు. ఇండస్ట్రీకి ప్రతి ఏడాది ఎంతో మంది స్టార్ కిడ్స్ పరిచయం అవుతూ ఉంటారు. అయితే స్టార్ బ్యాక్ గ్రౌండ్ ఉన్నంత మాత్రాన వారు ఇండస్ట్రీలో కొనసాగడం సాధ్యం కాదు. వారిలో ప్రతిభ, అందం, ఇంకా అణుకువ ఉంటేనే ఇండస్ట్రీలో ఉంటారు. ప్రతి ఏడాది ఎంట్రీ ఇచ్చిన స్టార్ కిడ్స్ లో దాదాపుగా సగం మంది ఇండస్ట్రీ బయటకు వెళ్లి పోతారు. అలా నెపో కిడ్ గా ఎంట్రీ ఇచ్చిన అనన్య పాండేను మొదట అంతా చాలా తక్కువ సమయంకే కనిపించకుండా పోతుందని అంతా భావించారు. కానీ తన ప్రతిభ చూపిస్తూ, అందాల ఆరబోత చేస్తూ, సోషల్ మీడియా ద్వారా, వెండి తెరపై తనదైన సత్తా చాటాడం ద్వారా బాలీవుడ్‌లో మెల్ల మెల్లగా స్టార్ హీరోయిన్స్ స్థాయికి చేరుకునేందుకు గాను తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది.

**కేసరి 2 తో వచ్చిన అనన్య పాండే...** ఆకట్టుకునే అందం ఉన్నప్పటికీ ఈ అమ్మడికి లక్ కలిసి రాలేదు. ఇండస్ట్రీలో అడుగు పెట్టి వరుస సినిమాలు చేయాలి అనుకున్న సమయంలోనే కరోనా వల్ల ఈమె ప్లాన్స్ రివర్స్ అయ్యాయి. అంతే కాకుండా ఇష్టం లేకుండా చేసిన లైగర్ సినిమా బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడింది. విజయ్ దేవరకొండ




హీరోగా పూరి దర్శకత్వంలో వచ్చిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశ మిగిల్చింది. దాంతో కాస్త జాగ్రత్త పడ్డ ఈ అమ్మడు బాలీవుడ్‌లోనే సినిమాలు చేయడం మొదలు పెట్టింది. ఈ ఏడాది ఇప్పటికే కేసరి 2 సినిమాతో వచ్చిన అనన్య పాండే వచ్చే ఏడాది మరో రెండు మూడు సినిమాలతో ప్రేక్షకులను పలకరించే అవకాశాలు ఉన్నాయి. ఈ అమ్మడికి హిట్ లేకున్నా వరుస ఆఫర్లు రావడంకు కారణం ఈమె అందం అనడంలో సందేహం లేదు. రెగ్యులర్‌గా ఇన్‌స్టాగ్రామ్‌లో ఈమె అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం అందరికీ తెలిసిందే.

**ఇన్‌స్టాగ్రామ్‌లో 26.5 మిలియన్‌ల ఫాలోవర్స్...** ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా 26.5 మిలియన్ ఫాలోవర్స్ ఉన్న ఈ అమ్మడు ఏ ఫోటో షేర్ చేసినా నిమిషాల్లో వైరల్ అవుతుంది. తాజాగా ఈమె షేర్ చేసిన ఈ ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఎలాంటి డ్రెస్ వేసినా అనన్య పాండే చూపు తిప్పనివ్వదు. అలాంటి అనన్య పాండే ఈసారి థైస్ ను చూపిస్తూ కవ్వించే విధంగా ఫోటోలకు ఫోజ్ ఇవ్వడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆగి మరీ ఈ అమ్మడి ఫోటోలు చూసే వారు చాలా మంది ఉన్నారు. సింపుల్ హెయిర్ స్టైల్ తో, డీసెంట్ మేకోవర్‌తో అనన్య పాండే ఈ ఔట్ ఫిట్ లో భలే ఉంది అంటూ అభిమానులతో పాటు, సోషల్ మీడియాలో ఆమెను ఫాలో అయ్యే వారు, అంతే కాకుండా నెటిజన్స్ తెగ కామెంట్స్ చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న లేడీకి కమర్షియల్ బ్రేక్ తప్పనిసరిగా రావాలంటూ కోరుకుంటున్నాం అంటున్న వారు చాలా మంది ఉన్నారు.

## రాజా సాబ్ ఫ్యాన్ ఫీస్ట్.. ప్లానింగ్ పీక్స్ అంతే..!

రెబల్ స్టార్ ప్రభాస్ రాజా సాబ్ సినిమా 2026 జనవరి 9న రిలీజ్ ఫిక్స్ చేశారు. సంక్రాంతి బరిలో ప్రభాస్ తన స్టామినా చూపించాలని దిగుతున్నాడు. ఆల్రెడీ సంక్రాంతికి ఇప్పటికే కొన్ని సినిమాలు రిలీజ్ షెడ్యూల్ చేశాయి. ఐతే రాజా సాబ్ తో ఆ సినిమాలు పోటీ పడక తప్పదు. మారుతి డైరెక్షన్ లో హర్రర్ థ్రిల్లర్ జోనర్ లో వస్తుంది రాజా సాబ్. టీజర్ తోనే సినిమా సంథింగ్ స్పెషల్ అనిపించేశాడు మారుతి. రాజా సాబ్ కి థమన్ మ్యూజిక్ సినిమాను నెక్స్ట్ లెవెల్ కి తీసుకెళ్లేలా ఉంటుందనిపిస్తుంది.

**ప్రభాస్ ఎలివేషన్స్ పీక్స్..** రాజా సాబ్ సినిమా ఫ్యాన్ ఫీస్ట్ పక్కా అనేస్తున్నారు మేకర్స్. సినిమాలో ప్రభాస్ క్యారెక్టరైజేషన్ తో పాటు ఆయనకు ఇచ్చే ఎలివేషన్స్ ఇంకా స్క్రీన్ ప్లే అన్నీ కూడా రెబల్ ఫ్యాన్స్ కి మాత్రమే కాదు ఆడియన్స్ కి ఫుల్ ట్రీట్ ఇస్తాయట. ఈ సినిమాలో



ప్రభాస్ ఎంట్రీ సాంగ్ ని కూడా ఒక ర్యాప్ సాంగ్ గా ప్లాన్ చేస్తున్నారట. థమన్ ఈ సాంగ్ ని డిఫరెంట్ గా డిజైన్ చేశాడని టాక్. రాజా సాబ్ సినిమాలో థమన్ బాలీవుడ్ ఓల్డ్ క్లాసిక్ సాంగ్ ఒకటి రీమిక్స్ చేస్తాడన్న టాక్ వచ్చింది. అది ఉందో లేదో తెలియదు కానీ ప్రభాస్ ఎంట్రీ సాంగ్ మాత్రం ర్యాపర్ సూరజ్ చెరుకత్ తో పాడిస్తున్నాడట. ఆల్రెడీ సాంగ్ కంపోజింగ్ పూర్తవగా త్వరలో షూట్ చేస్తారట. ఈ మూవీలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ ఫిమేల్ లీడ్ గా చేస్తున్నారు.

**హర్రర్ జోనర్ లోనే కొత్త అటెంప్ట్..** రాజా సాబ్ సినిమా హర్రర్ జోనర్ లోనే కొత్త అటెంప్ట్ అని అంటున్నారు. మారుతి మార్క్ కామెడీ మిస్ అవ్వదని టీజర్ తోనే చూపించారు. ఇక రెబల్ ఫ్యాన్స్ కోరుకునే మాస్ అంశాలైతే కొదవ ఉండదని టాక్. ఏది ఏమైనా మారుతి రాజా గారి ఇమేజ్ కి తగ్గట్టుగానే రాజా సాబ్ ని చేస్తున్నాడని అనిపిస్తుంది. ప్రభాస్ రాజా సాబ్ సంక్రాంతికి వస్తుంటే హనుతో చేస్తున్న సినిమా సమ్మర్ లేదా సెకండ్ హాఫ్ లో రిలీజ్ ఉంటుందట. ఇక సందీప్ వంగతో చేసే స్పిరిట్ సినిమా సెట్స్ మీదకు వెళ్లేందుకు రెడీగా ఉంది. ప్రభాస్ డేట్స్ కోసమే సందీప్ వెయిటింగ్ అని టాక్. ఇదే కాకుండా మరో 3 సినిమాలు ప్రభాస్ లైన్ లో ఉన్నాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ రీసెంట్ గా మిరాయ్ తో సూపర్ హిట్ అందుకుంది. ఆ సినిమా తర్వాత రాజా సాబ్ ఆ హిట్ జోష్ ని కొనసాగించేలా ఉంది.




## మిరాయ్ బాక్సాఫీస్ హవా.. మరోసారి 100 కోట్ల క్లబ్‌లో తేజ సజ్జా




తెలుగు సినిమాల్లో బాక్సాఫీస్ హంగామా మళ్లీ మిరాయ్ రూపంలో కనిపిస్తోంది. యంగ్ హీరో తేజ సజ్జా ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ చిత్రం ప్రతి రోజు కొత్త రికార్డులు సృష్టిస్తూ దూసుకుపోతోంది. విడుదలైనప్పటి నుంచి హౌస్‌ఫుల్ షోలు కొనసాగుతున్న ఈ సినిమాకి అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఇప్పటికే హనుమాన్ తో రికార్డ్ స్థాయిలో రెస్పాన్స్ అందుకున్న తేజ ఇప్పుడు మిరాయ్ తో మరో మైల్ స్టోన్ ను సొంతం చేసుకున్నాడు. ప్రత్యేకంగా 5 రోజులు పూర్తికావడానికి ముందే మిరాయ్ 100 కోట్ల గ్రాస్ క్లబ్‌లోకి అడుగుపెట్టడం ఇండస్ట్రీని ఆశ్చర్యపరుస్తోంది. సాధారణంగా ఇంత భారీ వసూళ్లు సాధించడం స్టార్ హీరోలకే సాధ్యమవుతుందని భావిస్తారు. కానీ తేజ సజ్జా మాత్రం తన కష్టానికి, తన ఎంపిక చేసిన కంటెంట్‌కి తగిన ప్రతిఫలాన్ని అందుకుంటూ కొత్త రికార్డులు క్రియేట్ చేస్తున్నారు. యాక్షన్, ఫాంటసీ, సూపర్ హీరో జానర్ కావడంతో మిరాయ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. అమెరికా బాక్సాఫీస్ వద్ద కూడా ఈ సినిమా ఊహించని రీతిలో దూసుకుపోతోంది. కేవలం 5 రోజుల్లోనే మిరాయ్ 2 మిలియన్ డాలర్ల మార్క్ దాటేయడం అరుదైన ఘనత. హనుమాన్ తర్వాత వరుసగా మరోసారి తేజ సజ్జా ఈ రికార్డును నమోదు చేయడం ఆయన పెరుగుతున్న మార్కెట్‌కి నిదర్శనం.

ఇక ఇండియాలో అయితే మంగళవారం ఒక్క రోజే ఒక లక్షకు పైగా టిక్కెట్లు బుక్ కావడం సినిమాపై ఉన్న డిమాండ్‌ని స్పష్టంగా చూపిస్తోంది. ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నట్లు, మిరాయ్ విజయానికి ప్రధాన కారణం తేజ సజ్జా డెడికేషన్, డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని విజువల్ ట్రీట్, నిర్మాత టిజి విశ్వ ప్రసాద్ పెట్టిన భారీ కృషి అని అంటున్నారు. ఈ ముగ్గురి విజన్ వల్లే ఈ సినిమా సాధారణ కమర్షియల్ సినిమాలకన్నా విభిన్నంగా నిలిచి, ప్రేక్షకులను ఆకట్టుకుంటోందని పేర్కొంటున్నారు. అలాగే మనోజ్ మంచు విలన్ పాత్రలో చేసిన పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్ కూడా సినిమా బలంగా నిలిచేలా చేసింది. ఆయన ఎనర్జీ తేజ సజ్జా పాత్రకి సరైన బ్యాలెన్స్ ఇచ్చింది.

ఈ ఇద్దరి మధ్య స్క్రీన్‌పై కనిపించిన కాంపిటీషన్ ప్రేక్షకులను బాగా ఎంటర్టైన్ చేస్తోంది. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్‌లు, ఫాంటసీ ఎలిమెంట్స్ మిరాయ్‌ని పాన్ ఇండియా స్థాయిలో సూపర్ హిట్‌గా మార్చాయి. మొత్తం మీద, మిరాయ్ విజయంతో తేజ సజ్జా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. వరుసగా రెండు పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్లతో తెలుగు సినిమా ఇండస్ట్రీకి ఒక కొత్త తరహా సూపర్ హీరోని పరిచయం చేశాడు. ఇప్పుడు 100 కోట్ల క్లబ్‌లోకి చేరిన మిరాయ్, రాబోయే రోజుల్లో మరెన్ని రికార్డులను బద్దలుకొడుతుందో చూడాలి.


## మా వందే: మోదీ బయోపిక్ లో వైలెంట్ హీరో!




భారతీయ రాజకీయాల్లోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా తన ప్రత్యేక ముద్ర వేసుకున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జీవితం సినిమాగా తెరకెక్కుతోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని సిల్వర్ క్యాస్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై వీర్ రెడ్డి ఎం. నిర్మిస్తున్నారు. మా వందే అనే టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రంలో మలయాళ స్టార్ హీరో ఉన్నీ ముకుందన్ మోదీ పాత్రలో నటించనుండటం హాట్ టాపిక్ గా మారింది. మార్కో సినిమాలో వైలెంట్ గా కనిపించిన ముకుందన్ మోదీ గా కనిపించడం సో స్పెషల్. క్రాంతి కుమార్ సి.హెచ్. ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాకి సంబంధించిన పోస్టర్లు విడుదల అవగానే అంచనాలు మరింతగా పెరిగాయి. మోదీ గారి తల్లి హీరాబెన్‌తో ఉన్న బంధం, ఆయన బాల్యం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన ప్రయాణం, దేశ నాయకుడిగా ఎదిగిన విధానం అన్నీ ఈ సినిమాలో చూపించనున్నారు. మోదీ గారి అసలైన వ్యక్తిత్వాన్ని, ఆయన సంకల్పబలాన్ని, ప్రజల పట్ల ఉన్న నిబద్ధతను సహజంగా ప్రతిబింబించేలా కథను తీర్చిదిద్దుతున్నారని మేకర్స్ తెలిపారు. ప్రత్యేకంగా మోదీ గారి తల్లితో ఉన్న అనుబంధం ఈ సినిమాలో భావోద్వేగ ప్రధానమైన అంశంగా చూపించనున్నారు. ఆయన చిన్ననాటి నుంచి పెరిగే వరకూ తల్లిదండ్రుల విలువలు, తల్లితో ఉన్న అనుబంధం ఆయన నాయకత్వ శైలిపై ఎలా ప్రభావం చూపిందో సున్నితంగా చూపించబోతున్నారు. "ఎన్నో పోరాటాల కన్నా.. తల్లి సంకల్పం గొప్పది" అన్న ట్యాగ్ తో ఈ చిత్రాన్ని మా వందే.. ది ఆంథమ్ ఆఫ్ ఎ మదర్ అనే టైటిల్‌తో ప్రకటించడం విశేషం. సినిమాకు టాప్ టెక్నికల్ టీమ్ పనిచేస్తోంది. కెమెరామెన్‌గా కె.కె. సెంథిల్ కుమార్, ఎడిటర్‌గా శ్రీకర్ ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్‌గా సాబు సిరిల్ పని చేస్తున్నారు. యాక్షన్ మాస్టర్ కింగ్ సోలమన్ కంపోజ్ చేయనున్న యాక్షన్ సన్నివేశాలు, మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్ అందిస్తున్న సంగీతం సినిమాకి హైలైట్ కానున్నాయి. వీఎఫ్ఎక్స్, టెక్నికల్ స్టాండర్డ్స్ హాలీవుడ్ స్థాయిలో ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. నరేంద్ర మోదీ జీవితకథ ఆధారంగా వస్తున్న ఈ చిత్రాన్ని హిందీ, తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, గుజరాతీ, మరాఠీతో పాటు ఆంగ్ల భాషలోనూ విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించారు. పాన్ ఇండియా సినిమాగా కాకుండా, ఇంటర్నేషనల్ ఆడియెన్స్‌కి కూడా కనెక్ట్ అయ్యేలా ప్లాన్ చేస్తున్నారు. మొత్తం మీద, మా వందే ఒక సాధారణ బయోపిక్ కాదని, ఇది ఒక భారతీయ నాయకుడి గొప్ప ప్రయాణాన్ని చూపించే గాథ అని చెబుతున్నారు. మరి ఈ బయోపిక్ లో ఎలాంటి అంశాలను హైలెట్ చేస్తారో చూడాలి.

## ప్రభాస్-అనుష్క లను మళ్లీ కలిపేదెవరు?

ప్రభాస్ -అనుష్క కాంబినేషన్ ఎంత అందంగా ఉంటుందన్నది చెప్పాల్సిన పనిలేదు. మిర్చి , బిల్లా లాంటి రీజనల్ మార్కెట్ చిత్రాల్లో అలరించారు. అటుపై బాహుబలి రెండు భాగాలతో పాన్ ఇండియానే షేక్ చేసారు. కానీ అనంతరం మళ్లీ ఆ జోడీ తెరపై కనిపించలేదు. అనుష్క సినిమాలు తగ్గించడం..ప్రభా స్ వేర్వేరు హీరోయిన్లతో పని చేయడం జరిగింది. దీంతో ఆ కాంబినేషన్ లో మరో సినిమా పడితే బాగుండని అభిమానులు సైతం ఆశీస్తున్నారు. వెండి తెరపై ఆ సూపర్ జోడీని చూసుకోవాలని మురిసిపోతున్నారు. మరి మళ్లీ ఆ కాంబినేషన్ సాధ్యమవుతుందా? అంటే అది పూర్తిగా దర్శక, హీరో చేతుల్లోనే ఉంది. ప్రస్తుతం ప్రభాస్ పాన్ ఇండియాలో పెద్ద స్టార్. ఇప్పుడతని పక్కన తీసుకునే ఏ నటి అయినా ఆ రేంజ్ హీరోయిన్ అయి ఉండాలి. కానీ అనుష్క బాహుబలి తర్వాత మాత్రం మరో పాన్ ఇండియా సినిమా చేయలేదు. ఇంకా చెప్పాలంటే ఉన్న మార్కెట్ కూడా డౌన్ అయింది. సినిమాలకు దూరంగా ఉండటం..సోషల్ మీడియా లో యాక్టివ్ గా లేకపోవడం వంటి సన్నివేశాలు అమ్మడి కెరీర్ పై కొంత ప్రభావాన్ని చూపించాయి అన్నది కాదనలేని వాస్తవం. అనుష్క తనని తాను ఎంత సమర్దించుకున్నా? ఈ విష



యంలో కొంత ప్రతికూల సన్నివేశాన్నే ఎదు ర్కుంది. ఈ ఫేజ్ నుంచి అనుష్క బయట పడాలంటే డార్లింగ్ కూడా అంతే సహకరించాలి. తనకు జోడీగా అనుష్క ను రికమండ్ చేయగలగాలి. దర్శకులు కూడా స్వీటిని దృష్టిలో పెట్టుకోగలగాలి. ఇటీవలే అను ష్క నటించిన లేడీ ఓరియేంటెడ్ చిత్రం ఘాటీ రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. ఈ సినిమాపై అమ్మ డు చాలా ఆశలు పెట్టుకుంది. కానీ ఫలితం మాత్రం నిరాశనే మిగిల్చింది. ఈ నేపథ్యంలో అనుష్క కు లిఫ్ట్ కూడా అవసరమైన సమయమిది. ఇప్పుడున్న సన్నివేశంలో బౌన్స్ బ్యాక్ అవ్వడం అంత వీజీ కాదు. హీరోయిన్ల మధ్య తీవ్రమైన పోటీ ఉంది. కన్నడ నుంచి వస్తోన్న కొత్త భామలకు ప్రాధన్యత పెరిగింది. ఈ క్రమంలో అనుష్కకకు ఇది కాస్త ఊరట నిచ్చే అంశమే. స్వీటీ కూడా కన్నడిగి అన్న సంగతి తెలిసిందే. మరి ఆ రకమైనా భాషాభిమానం ప్రశాంత్ నీల్ , రిషబ్ శెట్టి లాంటి వారు చూపించ గల్గితే? అనుష్కకు మరో పాన్ ఇండియా చిత్రంలో ఛాన్స్ పెద్ద విషయం కాదు.

## కాంచనకి శ్రీవల్లి తోడైతే.. పాన్ ఇండియా రచ్చ ఖాయం!

అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో వచ్చిన పుష్ప ఫ్రాంచైజీ మూవీలో శ్రీవల్లి పాత్రను పోషించడం ద్వారా రష్మిక మందన్న పాన్ ఇండియా రేంజ్‌లో మంచి గుర్తింపు దక్కించుకుంది. పుష్ప తర్వాత హిందీలో వరుస పెట్టి సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు ముందు ముందు మరిన్ని సినిమాలు అక్కడ చేయడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. బాలీవుడ్ నుంచి బ్యాక్ టు బ్యాక్ సినిమాలు వస్తున్నప్పటికీ రష్మిక మందన్న సౌత్ సినిమాలను కొనసాగిస్తూనే ఉంది. అంతే కాకుండా కొన్ని లేడీ ఓరియంటెడ్ సినిమాలను చేస్తూ బిజీగా ఉంది. ఈ సమయంలో ఈమెను ప్రముఖ కొరియోగ్రాఫర్ కమ్ డైరెక్టర్ రాఘవ లారెన్స్ సంప్రదించాడు అనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. కోలీవుడ్‌లో ప్రస్తుతం ఈ వార్త ప్రముఖంగా వినిపిస్తోంది. తమిళ సినిమా ఇండస్ట్రీ వర్గాల వారు వీరిద్దరి కాంబోలో మూవీ ఉంటుందని బలంగా చెబుతున్నారు.

**కాంచన 4 సినిమా కోసం రష్మిక మందన్న..** ప్రస్తుతం రాఘవ లారెన్స్ కాంచన 4 సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. ఇప్పటి వరకు వచ్చిన కాంచన ఫ్రాంచైజీ సినిమాలకు పాన్ ఇండియా రేంజ్‌లో మంచి హిట్ టాక్ వచ్చింది. అందుకే ఈ సినిమాపై అన్ని భాషల ప్రేక్షకుల్లోనూ అంచనాలు భారీగా ఉంటాయి. ఇది తమిళ సినిమా అయినప్పటికీ తెలుగులో డైరెక్ట్ తెలుగు సినిమా స్థాయిలో విడుదల కావడం మనం చూడబోతున్నాం. అంతే కాకుండా ఇతర భాషల్లోనూ



కాంచన 4 సినిమా భారీ రిలీజ్ కి ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా పూజా హెగ్డే నటిస్తూ ఉండగా, కీలక పాత్రలో బాలీవుడ్ స్టార్ నోరా ఫతేహీ నటిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఇదే సమయంలో కీలకమైన దెయ్యం పాత్రను రష్మిక మందన్నతో చేయిస్తే బాగుంటుంది అనే అభిప్రాయం ను కొందరు వ్యక్తం చేశారట. అందుకే లారెన్స్ చిన్న చిన్న మార్పులు చేసి రష్మిక వద్దకు వెళ్లాడని వార్తలు వస్తున్నాయి.

**పూజా హెగ్డే, నోరా ఫతేహీ హీరోయిన్స్‌గా..** నటనకు ఆస్కారం ఉన్న పాత్రలను చేసేందుకు రష్మిక ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. అందుకే కాంచన 4 సినిమాలో ఈ శ్రీవల్లి ఉంటుంది అనే విశ్వాసం ను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. ఇంతకు లారెన్స్ ఆమెను సంప్రదించాడా లేదా అనేది మాత్రం ఇప్పటి వరకు క్లారిటీ రాలేదు. సోషల్ మీడియాలో ఎవరికి తోచిన విధంగా వారు కామెంట్స్ చేస్తూ ఉన్నారు.

కాంచన 4 లో దెయ్యంగా రష్మిక నటిస్తే ఖచ్చితంగా పాన్ ఇండియా రేంజ్‌లో రచ్చ రచ్చ అన్నట్లుగా కలెక్షన్స్ నమోదు కావడం ఖాయం. బాక్సాఫీస్ షేక్ కావాలంటే రష్మిక వంటి స్టార్ కాస్ట్ కాంచన 4 లో అవసరం అని లారెన్స్ కూడా భావిస్తున్నాడని, అందుకే ఆమెకు అత్యధిక పారితోషికం ఇచ్చి మరీ నటింపజేసే ప్రయత్నాలు చేస్తున్నారు అంటూ వార్తలు వస్తున్నాయి. అసలు విషయం ఏంటి అనేది ముందు ముందు తెలిసే అవకాశాలు ఉన్నాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536